సంపుటి : 78 సంచిక : 52 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ ఆశ్వీయుజ శుద్ధ విదియ
వెల : ₹20/-
12-18 అక్టోబర్ 2026



## సాహితీ విరాట్ కవి సమ్రాట్




# హిందూ హృదయ సమ్రాట్

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.
@Jagriti Tv
78 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక
www.jagritiweekly.com

శ్రీ గురుభ్యోనమ:    శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం దక్షిణామ్నాయ శ్రీ శారదా పీఠం శృంగేరి పాలిత    జైమాతాది

# శ్రీ కనకదుర్గా శ్రీ నాగలక్ష్మీ అమ్మవార్ల శరన్నవరాత్రోత్సవములు


కనకదుర్గా క్రాస్ రోడ్స్, బషీర్‌బాగ్, భాగ్యనగర్ - 500 029.

ఫోన్ : 040 - 2323 7431, 2323 0858 | e-mail : kdnltemple@gmail.com


శ్లో॥ సర్వాబాధా వినిర్ముక్తో ధనధాన్యసమన్విత: మనుష్యో మత్ప్రసాదేన భవిష్య న సంశయ:

మన బషీర్‌బాగ్ నందు వెలసిన శ్రీ కనకదుర్గా శ్రీ నాగలక్ష్మి దేవాలయములో భక్తుల కోరికలను నెరవేర్చే శక్తి స్వరూపములైనటువంటి అమ్మవార్లకు జగద్గురువులు శ్రీ శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు, శ్రీ శ్రీ విధుశేఖర భారతీ స్వామి వార్ల అనుగ్రహముతో స్వస్తి శ్రీ పరాభవ నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి 11-10-2026 ఆదివారం నుండి 20-10-2026 మంగళవారం వరకు శరన్నవరాత్రోత్సవములు జరుగును. కావున భక్త మహాశయులందరూ ఈ భగవత్ కార్యములో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని మనవి.




## కార్యక్రమ వివరములు

| | | | |
|---|---|---|---|
| 10.10.2026 | శనివారము | అమావాస్య | (మహాలయ అమావాస్య ఉ గం 8:25 ని లకు) |
| 11.10.2026 | ఆదివారము | పాడ్యమి | శ్రీ శైలపుత్రీదేవి అలంకారం |
| 12.10.2026 | సోమవారము | విదియ | శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం |
| 13.10.2026 | మంగళవారము | తదియ | శ్రీ వైష్ణవిదేవి అలంకారం |
| 14.10.2026 | బుధవారము | చవితి | శ్రీ మహాగౌరీదేవి అలంకారం |
| 15.10.2026 | గురువారము | పంచమి | శ్రీ మీనాక్షీ దేవి అలంకారం |
| 16.10.2026 | శుక్రవారము | షష్ఠి | శ్రీ మహాకాళీ అలంకారం లక్ష కుంకుమార్చన |
| 17.10.2026 | శనివారము | సప్తమి | శ్రీ సరస్వతి అలంకారం మూల నక్షత్రం |
| 18.10.2026 | ఆదివారము | అష్టమి | శ్రీ మహా లక్ష్మీ అలంకారం సద్దుల బతుకమ్మ |
| 19.10.2026 | సోమవారము | నవమి | శ్రీ సిద్ధిదాత్రి అలంకారం మహ పూర్ణహుతి |
| 20.10.2026 | మంగళవారము | దశమి | శ్రీ విజయదుర్గ అలంకారం |

20.10.2026

మంగళవారము రాత్రి 7:30 ని॥లకు

నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో

## రావణ దహనం

తదుపరి శమీపూజ.

ఘటహారతి

**Sri P.A. murali** B.com.ACA (C.E.O. and Administrator, Sri Sharada Peetham Sringeri)

**KASI V.RAO** (Branch Head) | **M. RAMARAJU** (Chairman)

## భక్తులకు విజయదశమి శుభాకాంక్షలు

# పర్యావరణం..

## ఈ సంవత్సరం దీపావళి సంచిక ప్రత్యేకం

- పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న మన జీవనశైలి.
- అభివృద్ధి పేరుతో వనరుల దోపిడీ.
- ప్రతిఘటిస్తున్న ప్రకృతి
- నేటి ఎల్‌నినోలకు మనమే కారణం
- నగరాలలో కానరాని పచ్చదనం
- దురాశతో పంచభూతాలు కలుషితం

### పరిష్కారం..

- పర్యావరణ హిత జీవనం దిశగా అడుగులు
- వసుధైక కుటుంబ భావనతో వనరులను పంచుకోవడం
- జల విధానంలో సంప్రదాయపద్ధతులను అనుసరించడం
- పండుగల ద్వారా నదుల,వృక్షాలుసహా ప్రకృతి ఆరాధనను ప్రోత్సహించడం
- చిన్న చర్యల ద్వారా పర్యావరణంపై భారీ ప్రభావం చూపడం ఎలా?

ఇలాంటి మరిన్ని విశేషాలతో 2026 దీపావళి ప్రత్యేక సంచిక రానుందని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం. చందాదారులకు ఉచితం. పండుగలు, ఇతర శుభకార్యాలలో బంధుమిత్రులకు గిఫ్ట్‌గా ఇవ్వడానికి ఉపయోగించుకోవచ్చు. కనుక అదనంగా కావలసినవారు త్వరగా బుక్ చేసుకోగలరు.

**సంచిక తేదీ : నవంబర్ 2, 2026**

**త్వరపడండి!**



అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 20లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ / వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

**పేజీలు : సుమారు 300**

**వెల: 200/-**

- 25 నుంచి 50 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
- 51 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
- 100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కాంట్ లభిస్తుంది.
- పార్శిల్ ఖర్చులు అదనం

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

తొలి ప్రధాని నెహ్రూ భారత్ ఆర్థిక ఎదుగుదల సాఫీగా సాగనివ్వకుండా బిగించిన మిశ్రమ ఆర్థికవిధానపు సంకెళ్లను ఛేదించింది పి.వి.నరసింహారావు అయితే, ఆయన ఆరంభించిన ఆర్థిక సంస్కరణలకు జాతీయ స్థాయి రాజకీయ ఏకాభిప్రాయాన్ని ప్రకటించింది ఆ తర్వాతి ప్రధాని వాజపేయి. ఆర్థిక సంస్కరణలకు మరింత నగిషీలద్ది దేశాన్ని వడివడిగా ముందుకు కదిలేలా చేసింది నరేంద్రమోదీ.

ఆర్థికమంత్రిగా, ఆర్థిక సంస్కరణలకు శ్రీకారంచుట్టిన మన్మోహన్‌సింగ్, ఏ కారణం చేతనో ప్రధాని అయినపుడు వాజపేయి విధానాలు మరింత వేగంగా అమలుచేస్తాడని దేశం ఆశించింది. దేశ దురదృష్టం మన్మోహన్ 'యాక్సిడెంటల్ ప్రధాని'గా తయారై అసలుపెత్తనం సోనియా చేతిలోకి వెళ్లటం. జాతీయ ప్రయోజనం పట్టని విదేశీ వనిత కర్రపెత్తనంలో యూపీఏ ప్రభుత్వం అవినీతి ఊబిలో కూరుకుంది. ఏ రంగాన్ని కదిలించినా ఒక అవినీతి తన సొంత మంత్రి వర్గసహచరుల మీద కేసులు నమోదు చేయక తప్పనిసరి. సాక్ష్యాలు నాడు మన్మోహన్ ముందు నిలిచాయి. స్పెక్ట్రమ్, బొగ్గు, ఆసియా క్రీడలు..ఇలా ఏ రంగం తడిమితే ఆ రంగం భారీ అవినీతిమయం. ఇస్లామిక్ ఉగ్రవాదం అదుపులో వైఫల్యం. అమెరికా ఒత్తిళ్లకు తలవొగ్గింది.

ఇలా దశాబ్దంపాటు సాగిన అవినీతి పాలన నుండి విముక్తి సాధించి, భారత్‌ని చక్కదిద్ది అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయంగా ప్రజలచేత పట్టం కట్టించుకుంది మోదీ నాయకత్వం. అవినీతిరహితపాలన, సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీయించడం సాధ్యమేనని నిరూపించిన నాయకుడయ్యాడు మోదీ. తన ఆలోచనను దేశవ్యాప్త అంగీకారం కోసం ఆయన ఇచ్చిన పిలుపు 'డబుల్ ఇంజన్ సర్కార్'. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఒక లక్ష్యంవైపు, వడివడిగా వెళ్లాలంటే 'డబుల్ ఇంజన్ సర్కార్' అవసరం అన్నది మోదీ వాదన.

నిర్లక్ష్యానికి గురై, అభివృద్ధికి నోచుకోని సరిహద్దు రాష్ట్రాలు నేడు అభివృద్ధి పథంలో పరుగులిడుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు మోదీ అభివృద్ధి మంత్రాన్ని అందిపుచ్చుకున్నారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాల నిర్మాణాలను అరుణాచల్‌ప్రదేశ్‌లోని చైనా సరిహద్దువరకు, ఇటు త్రిపురలో బర్మా సరిహద్దు వరకు

**శాలివాహన 1948 శ్రీ పరాభవ ఆశ్వీయుజ శుద్ధ విదియ**


Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్


## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి**

## లోపలి పేజీలలో...





ముఖపత్ర కథనం
**హిందూ హృదయ సమ్రాట్** 6లో

ధారావాహిక నవల
(10) **ఏ వెలుగులకీ ప్రస్థానం ?**
**– గన్నవరపు నరసింహ మూర్తి** 20లో





అంతర్జాతీయం
**ఫ్లై దుబాయ్ సంఘటన ఉగ్రదాడి యత్నమే!** 24లో




# జాగృతి

## సంపాదకీయం

చురుకుగా సాగటంతో వికసిత భారత్‌లో తామూ భాగస్వాములమన్న ఆలోచన ఈశాన్య భారత ప్రజల్లో స్థిరపడింది. కశ్మీరీలు మోదీకి జైకొడుతున్నారు. వారెన్నడూ ఊహించని రైలుమార్గాలు వచ్చాయి. సింధు జలాలు కశ్మీరీలూ ఉపయోగిస్తున్నారు. సంపద పంపకం, వ్యాపార అవకాశాల పెరుగుదలతో కశ్మీరీలు జాతీయ జనజీవన స్రవంతిలో భాగమయ్యారు. వందేమాతర సంపూర్ణ గీతాలాపన కశ్మీర్‌లోయలో ప్రతిధ్వనించిందంటే అందుకు మూలం డబుల్ ఇంజన్ సర్కార్ ఆలోచనే. నేడు అక్కడి పాలకులు బీజేపీ మిత్రపక్షం కాకున్నా, మోదీ 'డబుల్ ఇంజన్' ఆలోచనలో భాగస్వాములయ్యారు.

## అభివృద్ధి పరుగుల 'డబుల్ ఇంజన్'

కాంగ్రెస్ రూపొందించిన విభజన చట్టంతో ఆర్థికంగా భారీగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ నేడు ప్రగతిపథంలో తీస్తున్న పరుగుల వెనుక మోదీ డబుల్ ఇంజన్ సర్కార్ పిలుపును చంద్రబాబునాయుడు అర్థం చేసుకోవటమే. 2018లో రాజకీయ తప్పిద నిర్ణయంతో ఓడిపోయిన 'తెలుగుదేశం' నేర్చుకున్న గుణపాఠం నుండి ఏర్పడినదే ఏపీలో కూటమి ప్రభుత్వం. 'డబుల్ ఇంజన్'లతో ఎక్కువ బరువున్న రైళ్లు పరుగులు తీయటం తెలిసిందే. అదే నేడు రాష్ట్రాభివృద్ధిలో కనిపిస్తోంది. కేంద్రం ఆలోచనలను అర్థంచేసుకుని, తగిన విధంగా స్పందించి, పథకాలను రూపొందించి అమలు చేస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ పలు రంగాలలో ప్రథమస్థానంలో నిలుస్తున్నది.

నిర్లక్ష్యానికి గురైన రాయలసీమను రతనాల సీమగా తయారుచేయటం అనేది కేంద్రం ఆలోచన. రాష్ట్ర బీజేపీ పెట్టిన ప్రత్యేక దృష్టి ఫలితమే ఒక్క ప్రాజెక్ట్‌లో రూ. లక్షకోట్ల పెట్టుబడులు రాయలసీమకు రావటం. ఆ ప్రాంతంలోని హింసాత్మక వర్గ పోరాటాలకు చెక్ పెట్టటం, అభివృద్ధి ద్వారానే 'ప్రత్యేక' రాయలసీమ అనే మాట పోయి 'రైజింగ్' రాయలసీమగా ప్రాచుర్యం పొందటానికి ఎంతో సమయం పట్టదు. కోస్తాలో జలవనరులు, రాయలసీమలో గనుల వనరులు, వ్యవసాయరంగంలో వినూత్న విధానాలు వెరసి ఆంధ్రప్రదేశ్ విభజన నష్టాన్ని పూడ్చుకుని విజయ పథంలోకి వెళుతోంది.

'డబుల్ ఇంజన్ సర్కార్ల' విలువ ఏమిటో ఇతర రాష్ట్రాలు అర్థం చేసుకున్నాయి. తాజాగా బెంగాల్ ఆ జాబితాలో చేరింది. ఒడిసా, ఛత్తీస్‌ఘడ్, బిహార్, ఉత్తరాఖండ్ 'డబుల్' ఫలితాలు అనుభవిస్తున్నాయి. 'డబుల్ ఇంజన్' ఆలోచన వ్యతిరేకులది రాజకీయ ఎజెండా తప్పించి, అభివృద్ధి ఎజెండా కాదు. ఆయా రాష్ట్ర పాలకులు నిత్య ఆందోళనజీవులు. వాస్తవ అభివృద్ధి తక్కువ, పార్టీ ప్రచార యావ ఎక్కువ. ఢిల్లీ పార్టీ పెద్దల పొగడ్తలకే ప్రాధాన్యత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిది.

'డబుల్ ఇంజన్ సర్కార్' లబ్ధి ప్రజలకు చేరాలంటే తెలంగాణలోనూ మార్పు అవసరం. ప్రజలను సుముఖులను చెయ్యటం బీజేపీ కార్యకర్తల బాధ్యత. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు రెండేళ్ల సమయం ఉంది. ఈ రెండేళ్ల ప్రచారంతో 'డబుల్ ఇంజన్ సర్కార్' వస్తే ప్రజలందరిని ముందుకు లాగుతుంది. ఎక్కలేనివారుండరు, వెనకబాటు తనం ఉండదు. వనరులు పుష్కలంగా ఉండి కూడా వినియోగ మార్గాలు తెలియని పార్టీలను పక్కనపెట్టండి. కొత్త రాష్ట్రంలో సంపద కుటుంబ సభ్యుల సంపదగా మార్చుకున్న కారు దొరలను కాదనండి. దోపిడీ హస్తాల నుండి బయటపడి, అభివృద్ధి పుష్పాలను అందరికి చేర్చగలిగిన పార్టీని గెలిపించుకోవాలి. పొరుగు తెలుగువారి నుండి రాజకీయ పాఠం నేర్చి డబుల్ ఇంజన్ పరుగులే మన రాష్ట్రంలోనూ కావాలన్నదే తెలంగాణ ప్రజలకు సందేశం కావాలి. ★

12 అక్టోబర్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**తోడు నీడ**

– లక్ష్మీగాయత్రి

ధరహాసం





| | | |
|---|---|---|
| కరవుసీమకు కలిసొచ్చే కాలం (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| ఆలయాలపై ఆగని అరాచకాలు (తెలంగాణ) | - | 18 |
| మొగలులతో పోరాడిన భిన్నవర్గాల యోధులు (హల్దీఘాటీ) | - | 26 |
| సర్‌ను సంపూర్ణం చేయాలి (జాతీయం) | - | 28 |
| రామాయణాన్ని మరువని ఇండోనేషియా (గళమెత్తిన గతం) | - | 30 |
| కృత్రిమ మేధ విలువలు నేర్పదు (పురస్కారం) | - | 32 |
| ఒంటరిగా ప్రపంచాన్ని చుట్టేయొచ్చు (మహిళ) | - | 34 |
| వందే వాల్మీకి కోకిలమ్ (ఆధ్యాత్మికం) | - | 35 |
| సైబర్ దొంగలకు చెక్ టీఏసీ సెక్యూరిటీ (యువవాణి) | - | 45 |
| బాలజాగృతి | - | 46 |
| ఆసియాక్రీడల్లో రాశితగ్గినా.. వాసిపెరిగిన భారత్! (క్రీడ) | - | 43 |
| సినిమా చరిత్రలో చెరగని సంతకం సింగీతం! (సినిమా) | - | 50 |




**సింఘాల్‌జీ జీవితం స్ఫూర్తిదాయకం:**

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

అశోక్ సింఘాల్‌గారి జయంతి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మనమందరం కలవడం చాలా సంతోషం. భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవన చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని కేటాయించు కొని, తన జీవితాన్ని అంకితం చేసిన ఆ మహనీయుడి స్మృతికి నేను ముందుగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. విశ్వహిందూపరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా, శ్రీరామజన్మభూమి ఉద్యమ ప్రేరేపితునిగా, దేశ సాంస్కృతిక సేవలో తరించి, హిందూ హృదయ సమ్రాట్‌గా ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఆ మహనీయుడ్ని జన్మ శతాబ్ది సంవత్సర వేడుకల్లో మనం అడుగుపెట్టాం. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సయత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే – సమాజంలో ఉత్తములు, ఆదర్శప్రాయులైన పెద్దలు ఏ విధంగా నడుచుకుంటారో ఇతరులు కూడా వారి మార్గాన్ని అనుసరిస్తారు. తమ నడవడిక ద్వారా ఏ విలువలనైతే నిరూపించి ప్రమాణంగా నిలబడతారో, తమ ప్రయాణాన్ని కొనసాగిస్తారో, లోకం కూడా దానినే ప్రామాణికంగా తీసుకొని ముందుకు సాగుతుందని ఆ శ్లోకం చెబుతుంది. శ్రీ అశోక్ సింఘాల్‌జీ జీవితం అలాంటి ప్రామాణిక ప్రస్థానమే అవుతుంది. కనుక వారిని స్ఫూర్తిగా తీసుకొని, వారు చూపిన మార్గంలో మనం ముందుకు వెళ్లాలి. ఆయనతో నాకు చిన్న వయస్సు నుంచే ప్రత్యేకమైన అనుబంధం ఉంది. శ్రీ అటల్ బిహారీ వాజపేయిజీ, శ్రీ ఎల్.కె.అద్వానీజీ తరహాలో శ్రీ అశోక్ సింఘాల్‌జీ నాతో సహా అనేకమంది కి గురుతుల్యులు. వారిని దగ్గరగా చూశాను. వారిని కలిశాను. వారి నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. డిసెంబర్, 2017లో నేను ఉపరాష్ట్రపతిగా ఉన్న సమయంలో సామాజిక కార్యకర్త మహేష్ భగ్‌చాందక రచించిన "Ashok Singhal: Staunch and Perseverant Exponent of Hindutva" అనే పుస్తకాన్ని ఆవిష్కరించే గౌరవం నాకు దక్కింది. ఆయనలో నిబద్ధత, ధర్మం పట్ల విశ్వాసం నిత్యం మనకు స్ఫూర్తిని ఇస్తాయి. ఆయన లాంటి మహనీయుల అడుగుజాడల్లో నడవడం, వారి ఆశయాలను ముందుకు తీసుకొనివెళ్లడమే మనం అందరం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అవుతుంది. అశోక్ సింఘాల్‌జీ కేవలం ఒక సంస్థకు నాయకుడు కాదు.. ఆయన భారతీయ సనాతన ధర్మ సంరక్షణకు తన జీవితాన్ని సర్వస్వం త్యాగం చేసిన విశిష్ట యోగి. స్వరాజ్య సమరంలోనూ, దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలోనూ సమాజాన్ని ఏకం చేయడానికి ఆయన ఎంతగానో పరితపించారు.

**భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవన చరిత్రలో అశోక్ సింఘాల్ జీవితం ఒక అధ్యాయం. హిందువుల హృదయాల్లో సమ్రాట్‌గా ఆయన స్థానం సుస్థిరం.భారతీయ సనాతన ధర్మ పరిరక్షణకు సర్వస్వాన్ని త్యాగం చేసిన ఆయన ఒక యోగి. ఇంజనీరింగ్ పట్టాతో గొప్ప శాస్త్రవేత్త కావడానికి బదులుగా సమాజసేవను తన మార్గంగా ఎంచుకున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్(ఆర్ఎస్ఎస్) ప్రచారక్‌గా జీవనం సాగిస్తూ హిందూ సమాజాన్ని ఏకం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలు, భావోద్వేగాలను ఒక్కతాటి మీదకు తీసుకొనివచ్చారు. అజేయమైన శ్రీరామజన్మభూమి ఉద్యమానికి పర్యాయ పదంగా నిలిచారు. విశ్వహిందూపరిషత్(వీహెచ్‌పీ) పూర్వ అంతర్జాతీయ అధ్యక్షులు, అయోధ్యలో శ్రీరామజన్మభూమి ఉద్యమానికి ముందు వరుసలో నిలిచి, భవ్యమైన బాలరాముని మందిర నిర్మాణం వెనుక ముఖ్య భూమికను పోషించిన**

ప్రఖ్యాత బెనారస్ హిందూ విశ్వవిద్యాయంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన మేధావి. చదువునే తన మార్గంగా చేసుకున్న పక్షంలో ఆయన ఎంతో గొప్ప శాస్త్రవేత్తగా రాణించి ఉండేవారు. కానీ ఆయన మేధోవికాసం, లక్ష్యం అంతకన్నా గొప్పవి. భౌతిక సుఖాలను, సంసార బంధాలను పూర్తిగా త్యజించి, ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా తన జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన మహనీయుడు ఆయన. అట్టడుగు వర్గాల ప్రజలకు ధైర్యాన్ని నూరిపోయడం, దేశవ్యాప్తంగా మన సంస్కృతి ఎదుర్కొంటున్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం వారి జీవితలక్ష్యంగా ఉండేది. సింఘాల్ అన్న పేరుకు తగ్గట్టుగా ఆయన ఒక సింహం. ఆయన స్వరంలో సింహ గర్జన వినిపించేది. అదే సమయంలో సమాజంపట్ల అపారమైన ప్రేమ, కరుణ ఆయనలో ఉండేవి. ఒక సన్యాసి ఏ విధంగానైతే మోక్షం కోసం తపనపడతాడో అశోక్ సింఘాల్‌జీ దేశం కోసం, ధర్మం కోసం నిరంతరం, జీవితాంతం శ్రమించారు. వారి పేరు




# దయ సమ్రాట్

**అశోక్ సింఘాల్‌ను భాగ్యనగరం ఘనంగా స్మరించుకుంది. వీహెచ్‌పీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో అశోక్ సింఘాల్ జన్మ శతాబ్ది వేడుకలు అక్టోబర్ నాల్గవ తేదీన ఘనంగా జరిగాయి. నాలుగు గంటలకు పైగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, ముఖ్య వక్తగా వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షులు చంపత్ రాయ్, తదితర ప్రముఖులు సింఘాల్ సేవాచింతనను కొనియాడారు. వారిని ఆదర్శాలను ఆచరణలో చూపడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. భజనలు, రామాయణ నృత్యనాటిక, ఓంకారం, ఏకాత్మతా మంత్రం, విజయ మహామంత్రోచ్చారణ, వందేమాతర గీతాలపన, సాధు, సంతుల ఆశ్వీరచనాలు, పుస్తకాల ఆవిష్కరణతో కార్యక్రమం ఆద్యంతం భారతీయతను ప్రతిబింబించింది. ఈ సందర్భంగా వక్తల ప్రసంగంలో కీలకమైన భాగాలను యథాతథంగా అందిస్తున్నాం.**

వినగానే మనకు గుర్తుకు వచ్చేది అజేయమైన శ్రీరామజన్మభూమి ఉద్యమం. దేశానికి స్వరాజ్యం సిద్ధించిన తర్వాత భారతదేశ సాంస్కృతిక ఆత్మ గౌరవాన్ని పునఃప్రతిష్టించడానికి జరిగిన అతి పెద్ద ఉద్యమం అది. ఆ ఉద్యమానికి ముందు నిలవడమే కాకుండా దానికి ఒక ప్రణాళికాబద్ధమైన నాయకత్వాన్ని అశోక్ సింఘాల్‌జీ అందించారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను, భావోద్వేగాలను ఒకతాటిపైకి తెచ్చారు. ఆ దిశగా దేశవ్యాప్తంగా చైతన్యం తీసుకురావడంలో వారు పడిన శ్రమ అసాధారణమైనది. శ్రీరామసేతు ఉద్యమం, ఏకాత్మతాయాత్ర ఇలా ప్రతి కార్యక్రమం లోనూ వారి దార్శనికత స్పష్టంగా కనిపించింది. అశోక్ సింఘాల్‌జీ పడిన తపన ఫలితమే నేడు అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణం సాధ్యమైంది. బాలరాముడ్ని ప్రతిష్టించుకొని, దర్శించుకనే మహద్భాగ్యం మనకు దక్కింది. సుప్రీంకోర్టు ద్వారా న్యాయబద్ధంగా అయోధ్యలో శ్రీరామజన్మభూమిని దక్కించుకోవడంలో అశోక్ సింఘాల్‌జీ సాగించిన సుదీర్ఘమైన పోరాటం చిరస్మరణీయమైనది. అయోధ్యలో బాలరాముడి దర్శనం చేసుకునే ప్రతీ భారతీయుడు ఆనాడు వారు పడిన తపనను, చేసిన త్యాగాన్ని ఎప్పటికీ మరచి పోలేరు. 1961లో జన్మాష్టమి పర్వదినాన ప్రారంభమైన విశ్వహిందూపరిషత్ కేవలం ఒక సంస్థ కాదు. అది హిందూ సమాజ చైతన్య వేదిక. విశ్వహిందూపరిషత్‌ను దేశం నలుమూలాల వ్యాపింపజేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. హిందువులందరూ సమానులే. మనం అందరం ఒకే మాతృభూమిలో జన్మించివారము అనే భావనను దేశంలో గ్రామగ్రామానికి చేర్చారు. శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్న ఈ తరుణంలో మనం గతాన్ని స్మరించుకోవడంతో సరిపుచ్చక, అశోక్ సింఘాల్‌జీ ఆలోచనాస్ఫూర్తిని నేటి సమకాలీన సవాళ్లకు ఎలా అన్వయించేది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. నేడు మన సమాజం సాంకేతికంగా పరుగులు పెడుతోంది. నైతిక విలువలు, సాంస్కృతిక మూలాల విషయంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కుం టోంది. సోషల్ మీడియా యాంటీ సోషల్ మీడియాగా తయారైంది. దాని ప్రభావంతో పాశ్చాత్య పోకడలు మన కుటుంబ వ్యవస్థను, యువత ఆలోచనావిధానాన్ని దెబ్బ తీస్తున్నాయి. సాంకేతికతను సాంస్కృతిక సంరక్షణ వ్యతిరేకించదు. సాంకేతికతను ప్రతి ఒక్కరు అందిపుచ్చుకోవాలి. సమాజం, సాంస్కృతిక సంరక్షణలో దానిని ఉపయోగించాలి. కులం, ప్రాంతం పేరుతో హిందువుల్లో చిచ్చుపెట్ట డానికి ప్రయత్నించే వారిని ఎదుర్కోవడంలో మనకు సామాజిక సమరసత ఒక అస్త్రం లాంటిది. అదే మనకు శ్రీరామరక్ష.





# కారణజన్ముడు అశోక్‌జీ

**వీహెచ్‌పీ ఉపాధ్యక్షులు చంపత్ రాయ్**

**ఆర్**ఎస్ఎస్ స్వయంసేవక్‌గా శ్రీ అశోక్ సింఘాల్‌జీ సేవలందించారు. జీవితంలో చివరి శ్వాస వరకు అదే సేవాభావనకు కట్టుబడి ఉన్నారు. సింఘాల్‌జీ జీవన ప్రస్థానం ఆసాంతం పరిశీలించినప్పుడు నింగి, నేల, నీరు మూడింట అపారమైన ఖ్యాతిని గడిస్తావు అని భగవంతుడు ఆయన నుదుటిపైన రాసి భూమిపైకి పంపించాడేమో అని అనిపిస్తుంది. అశోక్‌జీకి వారి అమ్మగారి ఆశీస్సులు కూడా ఉన్నాయి. ఏడుగురు సోదరుల్లో ఆయన ఒకరు. ఒకసారి వారి నాన్నగారు అనారోగ్యానికి గురి అయ్యారు. నాన్నగారి బాగోగులు చూసుకోవాలని అశోక్‌జీని అమ్మగారు కోరారు. అందుకు నాకు ఆర్‌ఎస్ఎస్ సేవాపనులు ఉన్నాయి. నా బదులుగా నాన్నగారి బాగోగులను తమ్ముడ్ని చూసుకోమను అని అమ్మగారితో ఆయన అన్నారు. ఆయన కుటుంబ సభ్యులు నాకు చెప్పినదాని ప్రకారం ఆ మాట విన్న వెంటనే ఆయన అమ్మగారు ఒక కత్తితో తన బొటనవేలిపై గాటు పెట్టుకున్నారు. అశోక్‌జీ నుదుటన నెత్తుటి తిలకం దిద్దారు. వెళ్లు.. సంఘ పని చూసుకో.. అని ఆశీర్వదించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో మైనింగ్, మెటలర్జీలో ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు మట్టి నుంచి ధాతువులను వెలికితీయడానికి బట్టి(కొలిమి)లో ఇంధనాన్ని ఆయన మండించాల్సి వచ్చేది. ఆ సందర్భంగా ఆయనను ఒక కల వచ్చింది. ఆ కలలో తాను ఇంధనానికి బదులుగా హిందూ ధార్మిక గ్రంథాన్ని మండిస్తున్న వైనం కనిపించింది. వెంటనే ఆయన నిద్ర నుంచి దిగ్గున లేచి కూర్చున్నారు. దీనికోసమేనా నేను చదువుతున్నది అని తనను తాను ప్రశ్నించుకున్నారు. చదువు మానేసి ఇంటికి వచ్చేశారు. అయితే ఇంట్లో అతిథులుగా ఉన్న సాధువుల్లో ఒక కేరళ సాధువు అలా అర్ధంతరంగా చదువును వదిలేసి రావడం మంచిది కాదు. చదువును పూర్తి చేసిన తర్వాత నీకు నచ్చిన మార్గంలో నడువు అని సింఘాల్‌జీకి హితబోధ చేశారు. సాధువు ప్రేరణతో ఆయన తిరిగి చదువు బాట పట్టారు. భగవంతుని ఆజ్ఞ కారణంగానే కావచ్చు, 1950లో ఇంజినీరింగ్ చదువును పూర్తి చేసిన తర్వాత ఆయన ఇంటికి తిరిగి రాకుండా ఆర్‌ఎస్ఎస్ కార్యక్రమాల వైపు సాగారు. 1950 నుంచి 1981 వరకు ఆర్‌ఎస్ఎస్ పనుల్లో నిమగ్నమైపోయారు. 1982లో విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) పనుల కోసం ఆయన నియుక్తులయ్యారు. నేడు లక్షలాదిగా యువకులు వీహెచ్‌పీలో పనిచేస్తున్నారంటే దాని వెనుక ప్రేరణగా అశోక్‌జీ ఉన్నారు. 1994లో ఆయన పిలుపు మేరకు ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు లక్ష మందికిపైగా యువకులు హాజరయ్యారు. ఆ సందర్భంగా గో రక్షణ సందేశాన్ని వారికి ఆయన ఇచ్చారు. మాననీయ రజ్జుభయ్యా కారణంగా రామజన్మభూమి ఉద్యమానికి నేతృత్వం వహించే అవకాశం ఆయనకు అనాయసంగా వచ్చింది.ఎలాంటి ప్రయత్నం లేకుండానే అలాంటి ఒక మహత్తరమైన అవకాశం ఆయనకు లభించింది. స్వయంగా భగవంతుడే ఆయనకు ఆ పనిని అప్పగించాడు. అప్పట్లో తనకు అందివచ్చిన మాధ్యమాల ద్వారా హిందూసమాజాన్ని ఏకీకృతం చేశారు. హిందువులను సమీకరించారు. దేశంలో మూడు లక్షల గ్రామాలను కదిలించారు. ఆ క్రమంలో ఆరంభం నుంచి ఒక మాటను ఆయన చెబుతూ వచ్చారు. మందిరాన్ని నిర్మిస్తాం.. మరెవ్వరూ కూల్చలేనంతగా, వెయ్యి సంవత్సరాల వరకు పటిష్టంగా ఉండే మందిరాన్ని నిర్మిస్తాం అని ధీమాగా చెబుతుండేవారు. నేడు ఆయన వాక్కు ఫలించింది. వెయ్యి సంవత్సరాల పాటు మనగలిగే పునాదితో వెయ్యేళ్లపాటు నిలిచిపోయే భవ్యమైన రామ మందిరం ఆయన ప్రేరణతో మన కనుల ముందు సాక్షాత్కరించింది. 1987లో పరమపూజనీయ సర్‌సంఘచాలక్ బాలాసాహెబ్ దేవరస్ ప్రేరణతోశాంతిని నెలకొల్పే దిశగా అశోక్ సింఘాల్‌జీ పంజాబ్ యాత్ర చేపట్టారు. ఆయన నిత్యం సామాజిక సమరసత గురించి ఆలోచించేవారు. నవంబర్ 9, 1989న రామజన్మభూమి శిలాన్యాస్ జరిగింది. బిహార్ వీహెచ్‌పీ సంఘటనా మంత్రి, ఎస్సీ వర్గానికి చెందిన కామేశ్వర్ చౌపాల్‌తో శిలాన్యాస్ చేయించారు. ఉత్తర భారతదేశంలో ఆరు ప్రాంతాలలో అశోక్‌జీ ప్రేరణతో హిందూ–బౌద్ధ సమ్మేళనాలు జరిగాయి. 1994 నుంచి ఉత్తరభారతదేశంలో వేదాల కంఠస్థీకరణ, శృతిపరంపరకు ఆయన నాంది పలికారు. దీనిలో అశోక్‌జీకి బాసటగా గోవింద్ దేవ్ గిరిజీ నిలిచారు. గోవులు, మఠాలు, మందిరాల రక్షణకు ఆయన పాటుపడ్డారు. పంజాబ్‌లో సద్భావన యాత్ర, ప్రపంచంలో అజేయశక్తిగా అవతరించడంలో హిందూ–బౌద్ధ ఐక్యతకు, ఊతమిచ్చారు. అశోక్‌జీ జీవనం, వారు చేపట్టిన కార్యక్రమాల పట్ల సమాజంలో అవగాహన కలిగించే దిశగా వారి జన్మ శతాబ్ది వేడుకలను నిర్వహించాలని వీహెచ్‌పీ నిర్ణయించింది.

* * *

“**దే**శవ్యాప్తంగా అశోక్ సింఘాల్‌జీ శతాబ్ది వేడుకలు జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా వారి లక్ష్య సాధనలో అసంపూర్ణంగా మిగిలి ఉన్న దానిని పూర్తి చేయడంపైన దృష్టి పెడదాం. ప్రపంచంలో ప్రతి 750 సంవత్సరాలకు ఒకసారి మతాల మధ్య, సంప్రదాయాల మధ్య గందరగోళం చోటు చేసుకుంటుంది. ప్రతి 2,000 నుంచి 3,000 సంవత్సరాలకు ఒకసారి ప్రకృతి లో మార్పు చోటు చేసుకుంటుంది. అలాంటి ఒక సంధికాలంలో ప్రస్తుతం మనం ఉన్నాం. ఆర్‌ఎస్ఎస్ అనేది లేనిపక్షంలో మనమంతా బాప్టిజం స్వీకరించి ఉండేవారం. యావత్ ప్రపంచంలో మానవాళికి ఆచార, వ్యవహారాలలో దిశానిర్దేశం చేసేదిగా హిందూ ధర్మం ఉంది. వారు వీరు అని లేకుండా అందరికీ అనువైన ఒక జీవన విధానాన్ని అందిస్తుంది. మానవులుగా మనం విజ్ఞానాన్ని పెంచుకున్నాం. సరికొత్త సాంకేతికతలను అభివృద్ధి చేసుకున్నాం. ప్రతి దానికి కృత్రిమ మేధ(ఏఐ)పైన ఆధారపడే పరిస్థితికి చేరుకుంటున్నాం. ఏఐ ఎంతకాలం ఉంటుందనేది మనకు తెలియదు. కానీ మనలను అన్ని విధాలుగా ఆదుకునే హిందూ ధర్మం చిరంజీవిగా వర్ధిల్లుతుంది. ప్రస్తుతం ప్రపంచంలో నాలుగు వ్యవస్థలు అగమ్యగోచరంగా ఉన్నాయి. అవి విద్యావ్యవస్థ, వైద్య, ఆరోగ్య వ్యవస్థ,

న్యాయవ్యవస్థ, పర్యావరణ వ్యవస్థ. ఈ నాలుగూ పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటిని బాగుచేయకుండా మనం సాంకేతికంగా ఎంత ముందుకు పోయినప్పటికీ మానవాళికి ఒరిగేది ఏమీ ఉండదు. ఒక విధంగా చెప్పాలంటే ఇప్పుడు సాంకేతికంగా చోటు చేసుకుంటున్న అభివృద్ధి చింతపండును తీసుకొనివెళ్లి బావిలో పిండినట్టు అవుతుంది. అశోక్ సింఘాల్‌జీతో నాకు అత్యంత సన్నిహితమైన సంబంధం ఉంది. వారితో అనేక పర్యాయాలు మాట్లాడాను. ఢిల్లీ, తిరుపతి లాంటి చోట్ల మేమిద్దరం ఒకే గదిలో నిద్రించిన సందర్భాలు ఉన్నాయి. అయోధ్యలో వివాదాస్పద కట్టడం కూలిపోయిన సమయంలో నేను అక్కడే ఉన్నాను. అంతా గందరగోళం. నాకు ఏర్పాటు చేసిన అంగరక్షకులు కనిపించకుండా పోయారు. అప్పుడు సింఘాల్‌జీ చేతిని నేను పట్టుకున్నాను. జరిగేది ఏదో జరిగి తీరుతుంది. ఆందోళన చెందవద్దు అని ఆయన నాకు ధైర్యం చెప్పారు. దేవాలయాలు, మఠాలు, గోవుల పరిరక్షణకు తోడు సామాజిక సమరసతకు అండగా అశోక్ సింఘాల్‌జీ నిలిచారు.”

**– శ్రీశ్రీశ్రీ సంగ్రామ్ మహరాజ్, సమర్థ రామదాస్ పీఠం, హనుమాన్ దీక్షాపీఠం**

“ఎవరైతే భారతదేశానికి ఆత్మ అయిన స్వామి వివేకానంద ప్రబోధాలకు ప్రభావితులై, జాతి జీవన పునర్ నిర్మాణానికి కృషి చేశారో అలాంటివారందరికీ పరస్పరం అవినాభావ సంబంధం ఉంటుంది. అప్పట్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్, ఇప్పటి మన అశోక్ సింఘాల్‌జీలను చూసి నప్పుడు మన అంతరాత్మలో నిలిచిపోయిన వారి సందేశం మనలను ముందుకు నడిపిస్తుంది. ఈ దేశాన్ని పునర్ నిర్మించుకోవాలనే వారికి వెన్నెముక, గుండె తరహాలో రెండు ముఖ్యమైన లక్షణాలు ఉండాలి. త్యాగం, సేవ అనేవి భారత్ పునర్ నిర్మాణానికి ముఖ్య లక్షణాలుగా ఉంటాయి. ఈ రెండు లక్షణాలను అశోక్‌జీ స్వీకరించారు. వారి జీవన పర్యంతం పాటించారు. వారు సన్యాసి లేదా యతీశ్వరుడు లేదా ప్రచారక్ అనేది వారికే తెలుసు. ఆధ్యాత్మిక జీవితానికి తొలి మెట్టుగా త్యాగం ఉంటుంది. దానిని పోతపోసుకున్న మానవరూపంగా అశోక్‌సింఘాల్ మనకు కనిపించారు. ఈ సందర్భంగా వర్తమాన భారతదేశంలో సగటు హిందువు ఆలోచనా విధానం ఎలా ఉందనేదానిపై మనం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనల్ని మనం ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. లక్షలాదిగా హిందు ఆడ బిడ్డలు ముస్లింలకు బలి అయిపోతున్నారు. అయినప్పటికీ మనకు హృదయం రగిలిపోవడం లేదు. ఈ రోజు అయోధ్యలో భవ్యమైన, దివ్యమైన రామమందిర నిర్మాణం జరిగింది. ఎందుకు జరిగింది అంటే రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో కొన్ని వేలమంది మందిర నిర్మాణం జరిగేంతవరకు పగిడిని, పాదరక్షలను ధరించేది లేదని, ఆహారం తీసుకునేది లేదని ప్రతినబూనారు కాబట్టి. వారి త్యాగాల ఫలితంగా రామమందిర నిర్మాణం జరిగింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో హిందువులు జాగృతం కావాల్సిన అవసరం ఉంది. కట్టూ బొట్టూ సహా హిందూ సంస్కృతీ సంప్రదాయాలను , ఆచార, వ్యవహారాలను కాపాడుకోవాలి. అలా చేసినప్పుడే అశోక్ సింఘాల్‌జీకి నిజమైన నివాళి అవుతుంది.”

**– శ్రీశ్రీశ్రీ దుర్గానందపురి స్వామీజీ, మాతా అన్నపూర్ణేశ్వరి కాశీవిశ్వనాథ పీఠం**




“ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా ఉన్న అశోక్ సింఘాల్‌జీ విశ్వహిందూపరిషత్(వీహెచ్‌పీ) బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఒక మధ్యమ నిర్మాణం జరిగింది. అందరిని ఏకం చేసే ఒక ప్రయత్నం జరిగింది. రామజన్మభూమిని కాపాడు కుంటేనే మన జన్మభూమిని కాపాడుకోగలం. ఆ క్రమంలో అనేక కార్యక్రమాలు జరిగాయి. వీట న్నింటికి ఆధారంగా అశోక్‌జీ నిలిచారు. భౌతికంగా వారు మన మధ్య లేకపోయినప్పటికీ వారు చూపిన మార్గం మన ముందు ఉంది. యావత్ భారతదేశం రామజన్మభూమి అనే భావనతో ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించే ప్రయత్నం చేద్దాం. ఆ ప్రయత్నంలో భాగంగా అశోక్‌జీ జన్మ శతాబ్ది వేడుకలను ఏడాది పాటు జరుపుకుందాం.”

**– ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలుగు విభాగం పూర్వ శాఖాధిపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం**





# సాహితీ విరాట్ కవి సమ్రాట్

ఆధునికాంధ్ర కవిత్వయుగ మహాకవుల్లో అగ్రగణ్యులు. ప్రాచీన కవిత్వ సంప్రదాయానికి శిఖరాయమానులు కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ.

ఆధునికాంధ్ర సాహిత్యంలో విరాడ్మూర్తి. ప్రాచీన ఆధునికాంధ్ర సాహిత్యంలో ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. గేయం, పద్యం, ముక్తకం,మహాకావ్యం...ఇలా ఏది రాసినా తమదైన వ్యక్తిత్వం ప్రతిబింబించింది. వాక్కులో, వాక్యంలో, శబ్దంలో, సమాసంలో, భావంలో, భావనలో, దర్శనంలో, విమర్శనంలో, భాషణలో,భూషణలో వైలక్ష్యం వెల్లివిరిసింది. అమేయమైన భావనాశక్తి, అమిత వేగవంతమైన ధారాశుద్ధి, అద్వితీయమైన లోక పరిశీలనాశక్తి వారి రచనలలో కనిపించే మేలిమి గుణాలు. తన ప్రతిభను గ్రంథాలలోకి దించి, జాతికి అందించిన మహానుభావుడు విశ్వనాథ. రాష్ట్ర ఆస్థాన కవి. సనాతన భారతీయ తత్త్వాన్ని త్రికరణశుద్ధిగా నమ్మిన జ్ఞాని. తెలుగులో 'జ్ఞాన్‌పీఠ్' పురస్కారం తొలి గ్రహీత. కవిగా ఎంత గొప్పవాడో, 'మాట పెళుసు'అనిపించినా, మనసున్న మనిషిగా మహోన్నతుడు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో హిమవన్నగము. సంప్రదాయాలు, కట్టుబాట్లు చెదరరాదన్న ధ్యేయంతో మడమ తిప్పక ముందుకు సాగిన సాహితీ దురంధరుడు, సాహిత్య సార్వభౌముడు. ఆయన సామాన్యుడు..ఆలోచనలు అసామాన్యాలు. భాషాశాస్త్రం, చరిత్ర, ధార్మిక, తాత్త్విక, సామాజిక, రాజకీయాది వైవిధ్యభరిత శాస్త్రాల నేపథ్యాలు, ఇతివృత్తాలతో చందోబద్ధమైన కవిత్వం రాశారు. ప్రాచీనాంధ్ర సాహిత్య ఉద్దండులు నన్నయ,తిక్కన, పోతన, శ్రీనాథుడివంటి వారి తరహాలో ఆధునిక సాహిత్యంలో తెలుగుకావ్యాలకు అంతటి స్థాయిని కల్పించిన విరాట్ స్వరూపం. కథానిక, నవల, నాటకం, గేయకావ్యం, విమర్శ, వ్యాసం, పద్యం, శతకం ఇలా తెలుగు సాహిత్యంలో చేపట్టని ప్రక్రియ లేదు. స్పృశించని అంశమూ లేదు..సాహితీక్షేత్రంలో పట్టినదంతా బంగారం కావడం ఒక విశ్వనాథ వారికే చెల్లింది. 'పద్యము వ్రాయుకవి గద్యము వ్రాయ లేకపోవచ్చును. గద్యము రచించు కవికి బద్యము సాగకపోవచ్చును. గద్యపద్య రచయితయైనను నాటకము రచించలేకపోవచ్చును. నాటకకర్త విమర్శకశక్తి కలవాడు కావకపోవచ్చును. సర్వతోముఖ సమర్థత కలవాడు దీక్షతో గ్రంథాలు వ్రాసి లోకమునకందీయజాలకపోవచ్చును. ఇవన్నియుబట్టినవారు సమగ్ర కళా పరిపూర్ణుడైన జాబిల్లి వంటివారు విశ్వనాథ'అని ప్రఖ్యాత కవి మధునా పంతుల సత్యనారాయణశాస్త్రి శ్లాఘించారు. తెలుగులో జాతీయ కవి ఎవరన్న ఒక ప్రశ్నకు 'నిస్సందేహంగా విశ్వనాథ' అని బదులిచ్చారు ప్రముఖ కవి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. సాహితీవేత్త డాక్టర్ అమరేంద్ర అన్నట్లు 'భారతదేశంలో తుది శ్వాస వరకూ కలం దించని సాహితీ వ్రతులలో రవీంద్రుని సరసన నిలవగలవారు.

విశ్వనాథ 'పూర్వకవుల కంటే భిన్నమైన వాతావరణంలో గడిపారు. కవిత్రయాది కవులు హయాంలోని 'పండిత పరిషత్తు'ల ప్రమేయాలతో పోలిస్తే, ఏ రకమైన సంశయం, భయంలేకుండా మనసుకు స్ఫురించినది, ఆవేశంలో వచ్చినది, తాను అనుకొన్నది కరాఖండీగా హాయిగా మాట్లాడి, రాసి... అంతటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించిన ఏకైక కవి ..'అని ఆచార్య బోతవోలు రామబ్రహ్మం నివాళులు అర్పించారు.

విశ్వనాథ వారి రచనా విధానం విచిత్రాతి విచిత్రంగా ఉండేదని చెప్పుకునేవారు. ఉదాహరణకు, వందకు పైబడి పద్యాలను మనసులోనే అనుకొన్న తరువాత కాగితంపై పెట్టేవారు. వచనమైతే వారు చెబుతూంటే ఇతరులు రాసుకోవలసిందే. రోజు వచ్చే సందర్శకులతో ముచ్చటిస్తూ, తాము రాస్తున్న రచనలల్లోని భాగాలను వినిపించడం మరో ప్రత్యేకత. అలా అప్పటికప్పుడు శ్రోతల/పాఠకుల స్పందన రాబట్టేందుకు వీలుండేదట. 'ఏకవీర' రచనా కాలంలో ప్రతి శుక్రవారం పూజచేసి, టెంకాయకొట్టి మిత్రులకు వినిపించేవారట. 'వేయిపడగల'ను స్వయంగా రాయడం ప్రారంభించగా, మూడు ప్రకరణాలకు మూడు నెలల సమయం పట్టిందట. ఇది సరికాదని గ్రహించి, వేయి పుటలను 29 రోజులలో చెబుతూ రాయించారట. నవలా రచన ఏదీ నాలుగు నాళ్లకు మించలేదట. ఆయన ప్రతిభ, వ్యుత్పత్తికి ఇది ఒక నిదర్శనంగా చెబుతారు.

**వ్యక్తిత్వంలోనూ ప్రత్యేకత**

విశ్వనాథ వ్యక్తిత్వం గురించి ప్రత్యేకంగా ముచ్చటించనవసరం లేదు. ఆయనంటే సరిపడని సమకాలికులు సయితం వారికి సంబంధించిన విశేషాలను మురిపంగా ముచ్చటించుకొనేవారు, ముచ్చటించుకుంటున్నారు. ఆ మహాకవి పరమపదం చేరి అయిదు దశాబ్దాలైనా ఆయన స్మృతులు సాహితీలోకంలో నిత్యనూతనాలే.

విశ్వనాథ పేరు స్మరించగానే జ్ఞప్తికి వచ్చేది...

*'అల నన్నయకు లేదు తిక్కనకు లేదా భోగ మస్మాదృశుం/దలఘుస్వాదు రసావతార ధిషణాహంకా సంభార దో*

*హల బ్రాహ్మీమయ మూర్తి శిష్యుదయినాడన్నట్టి దా వ్యోమపే/ శల చాంద్రీమృదుకీర్తి చెళ్లపిళ వంశస్వామికున్నట్లుగన్'* పద్యం. ఇందులో కనిపించే 'కవితాంహకారం'లో వాస్తవికత ఉందని, అది కేవలం కవితాపరమైనదే తప్ప లౌకిక అర్థంలో అన్వయింపతగదనే వారూ ఉన్నారు. మృదుస్వభావి అయిన ఆయన కోపగించుకోవడాన్ని 'ధర్మాగ్రహం' గానే భావించాలంటారు.

తన శిష్యత్వం గురించి చెప్పుకున్న విశ్వనాథ, తమ గురువు వేంకటశాస్త్రి వ్యక్తిత్వాన్ని....

*'తన యెద యెల్ల మెత్తన కృత ప్రతిపద్యము*




*నంతకంటె మెత్తన తన శిష్యు లన్న నెదదం గల ప్రేముడి చెప్పలేని మె*

*త్తన యయి శత్రుపర్వతశతారము సత్కవి చెళ్లపిళ్ల వేంకన గురువంచు జెప్పుకొనగా నది గొప్ప తెలుంగునాడునన్'* అని శ్లాఘించారు.

శత్రువుల పట్ల తమ గురువు చూపే 'పారుష్యాని'కి శిష్యుల పట్ల కల వాత్సల్యాన్ని ఉపమానంగా చెప్పారు కానీ, శాస్త్రి గారి శిష్య వాత్సల్యానికి 'ఇది సాటి' అని ప్రకటించకుండా, 'చెప్పలేనంత మెత్త' అని ముక్తాయించారు. 'చెప్పలేనంత' అనేది ఆలోచనామృతాన్ని అందించే పలుకుబడి. అలా గురు కృపను కూలంకషంగా చవిచూసిన, భావితరాలకు ఆదర్శ శిష్యుడు విశ్వనాథ.

*'పుడమిని బెక్కు సత్కవులు పుట్టిరి ముట్టిరి సత్కవిత్వపుం/దొడిమలు చెళ్లపిళ్ల కవితో దులతూగెదువారె? వానలో*

*దడియనివారు మద్గురువధానమృదూక్తిమరంద ధారలో/గదుగనివారు మా కెచట గానగరా రిల దెల్గునాడునన్'*...పద్యం విశ్వనాథ వారి గురుప్రశస్తికి మకుటాయమానం. (సత్కవులెందరో కవితలు అల్లినా వారు ఆ కవితా ప్రసూనంలోని తొడిమను మాత్రమే తాకకలిగారట. గురువు వేంకటశాస్త్రి కవితా మకరందాన్ని సేవించి అవధాన కవితా మాధుర్యాన్ని వర్షించారట. వానలో తడియని వాడూ, వారి మకరంద ధారలో మునగనివాడు తెలుగుదేశంలో లేడట.)

శిష్యుడు విశ్వనాథ పట్ల గురువు చెళ్లపిళ్లఅదే తీరులో స్పందిస్తూ...

**'నా మార్గంబున కాదు శిష్యుడైనన్ నాతత ముత్తాతలం/దే మార్గమున్ గాదు వీనిదెదియో ఈ మార్గమట్లౌటచే**

**సామాన్యుండనరాదు కవితా సమ్రాత్వమీ రీతిలో/ ఈ మచ్ఛిష్యుని తా వరించినది నేనెంతే ముదంబందెదన్'..** అంటూ, కవిసమ్రాట్ బిరుదు విశ్వనాథను తానై వరించింది కానీ ఎవరో ఇచ్చినది కాదని రూఢీ పరిచారు.

తన లాంటి శిష్యుడు ఉండడం గురువు అదృష్టంగా వ్యాఖ్యాంచిన విశ్వనాథ వారే, ఉత్తరోత్తర శిష్య వాత్సల్యాన్ని ప్రకటించారు. తమ సంస్కృత రచనలు 'గుప్త పాశుపతం, అమృతశర్మిష్ఠం'పై విశ్లేషించేందుకు వచ్చిన శిష్యులు దివాకర్ల వేంకటావధాని, మల్లంపల్లి శరభయ్యల గురించి....'ఇటువంటి వారికి గురువునవడం నా అదృష్టం...వారు నాకు శిష్యులు కావడం వారి ఖర్మ' అనీ తమదైన శైలిలో వ్యాఖ్యానించారు.

**భారతీయత ఆరాధకులు**

విశ్వనాథ భారతీయతను ఆరాధించారు. స్వీకరించిన సాహిత్య ప్రక్రియ ఏదైనా,అందులో భారతీయ సంప్రదాయ వైభవాన్ని చాటి చెప్పేందుకు తపించారు. తెలుగుభాష, తెలుగుజాతి పట్ల అలవి మాలిన అపేక్ష. తమ రచనల ద్వారా మాతృభాషను, సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఇరవై ఒకటో ఏట (1916) రాసిన 'ఆంధ్ర పౌరుషం'లో ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పారు. తమ తొలి రచనల్లో ప్రధానమైన వాటిలో 'ఆంధ్రజాతి వైభవం'అంటే వారి శరీరంలోని అణువణువుకు పులకింత. ఉత్తర భారతదేశంలో తెలుగువాణికి, తెలుగువానికి విశేష గౌరవం కట్టబెట్టిన పద్యం ...

*'గోదావరీ పావనోదార వాః పూర*
*మఖిల భారతము మా దన్ననాడు*
*తుంగభద్రాసముత్తుంగరావముతోడ*
*కవులగానము శ్రుతి గలయునాడు*
*పెన్నానదీ సముత్పన్నకైరవదళ*
*శ్రేణిలో తెన్గు వాసించునాడు*
*కృష్ణాతరంగ నిర్ణిద్రగానముతోడ*
*శిల్పమ్ము తొలిపూజ సేయునాడు*
*అక్షరా జ్ఞాన మెఱుగదో యాంధ్రజాతి?*
*విమనకృష్ణానదీ సైకతములయుందు*
*కోకిలపు (పా)బాట పిచ్చుకగూండ్లు కట్టి*
*నేర్చుకొన్నది పూర్ణిమానిశలయందు'*

తెలుగునాట నదులు ఇతివృత్తంగా చెప్పిన ఈ పద్యం తెలుగేతరులను ఆనందసంభ్రమాలలో ముంచెత్తింది. కాశీ విశ్వవిద్యాలయం సమావేశ మందిరం కిటకిటలాడుతోంది. సమావేశ మందిరం వెలుపల అదే సంఖ్యలో నిలబడి ఉన్నారు. వేదిక నుంచి మధుర గంభీరస్వరం వినపడింది. పరిసరాలు నిశ్శబ్దం. అధిక సంఖ్యలో ఉన్న బెంగాలీ,హిందీ

# ‘కల్పవృక్షం’తో అభినవ వాల్మీకి




‘నా రాముడ’ని తనివితీరా కలవరించి పలవరించి విశ్వనాథ, రామాయణాన్ని మళ్లీ తెలుగు సాహిత్య ఉద్యానవనంలో ‘కల్పవృక్షం’గా ప్రతిష్ఠించారు. గీర్వాణ వాఙ్మయంలో ఆది కావ్యం వాల్మీకి ‘రామాయణం’ భారతీయ సంస్కృతికి మణిదర్పణం. సందర్భోచితంగా వినూత్న కల్పనలతో వివిధ సాహిత్య ప్రక్రియల్లో విరాడ్రూపం దాల్చింది. తెలుగులోనూ ఎన్నో రామాయణాలు వచ్చాయి. ‘రామచరితంపై అన్ని కావ్యాలు, గ్రంథాలు వెలువడిన తరువాత ఇంకా రాయడం అవసరమా?’ అనే సందేహాలకు...

‘మరల నిదేల రామాయణంబన్నచో/ నీ ప్రపంచకమెల్ల నెల్లవేళ(ల)/ తినుచున్న అన్నమే తినుచున్న దిన్నాళ్లు తనరుచి బ్రదుకులు తనవిగాన/ చేసిన సంసారమే చేయుచున్నది తనదైన అనుభూతి తనది గాన/తలచిన రామునే తలచెద నేనును నా భక్తి రచనలు నావిగాన’అని (ప్రపంచమంతా ప్రతిరోజు అదే తిండి తినడంలేదా? ప్రతి దినం అదే జీవనం సాగించడంలేదా? ఎవరి అనుభవం వారిది. నేనూ అంతే.? నా రాముడిని నేను తలచుకుంటాను. ఇది నేను భక్తితో రచించేది వ్యాఖ్యానించారు. ‘కవి ప్రతిభలోన నుండును గావ్యగత/శతాంశముల యందు తొంబదిమైన పాళ్లు/ ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయిరెట్లు గొప్పది నవకథా ధృతిని మించి’ (తెలిసిన కథను మళ్లీ చెప్పడంలో కవి ప్రతిభ వ్యక్తమవుతుంది. కేవలం కథ చెప్పడం కాకుండా, కవి నూటికి తొంభయ్ పాళ్లు రసాన్ని ఎలా పండిస్తాడన్నదే ప్రధానం)అనీ అన్నారు. ఆ ప్రత్యుత్తరం సాధారణంగా కనిపించినా, అందులో అసాధారణ సందేశం దాగి ఉంది. ఎవరైనా రచనకు ఉపక్రమించినప్పుడు ఇతరుల నుంచి ఎదురయ్యే నిరాశ,నిస్పృహలను అధిగమించేందుకు ఈ మాటలు స్ఫూర్తినిస్తాయనడంలో సందేహం అవసరం లేదు. చెణుకులు విసరడంలో దిట్ట ఆయనతో ‘మీ కల్పవృక్షం చాలామందిని కదిలించింది. దాని ప్రేరణలో విషవృక్షం కూడా మొలిచిందండీ’ అంటే “ఔనౌను, ఎవరి మార్గం వారిది. నేను వెర్రివాడిని. నాకు ఏడు జన్మలకు గాని ముక్తి లేదు. వారిది వైరిమార్గం. జయవిజయులు చూపిన దారి. మూడు జన్మలకే ముక్తి!” అనేవారు

భాషీయులకు తెలుగు తెలియకపోయినా, ఆ స్వర మాధుర్యం (రసధుని) వారిని పరవశులను చేసింది. పది నిమిషాల పాటు కరతాళ ధ్వనుల కోలాహలం. “సంస్కృతాంధ్రాలు ఇంత సహజీవనం చేస్తాయని మాకు తెలియదు. ఇలాంటి కవి దేశంలో ఉన్నారని కూడా మేం ఎరుగము. ఈ కవి రచనా రీతి భారతదేశంలోనే విశిష్టమైనది. దీనిని ‘ఆంధ్రరీతి’ అని గాని, ‘విశ్వనాథ రీతి’ అనిగాని అందాము” అని విశ్వవిద్యాలయ ఉప కులపతి నరేంద్రదేవ్ లేచి ప్రణమిల్లారు.

**స్వభాషానురక్తి**

తెలుగు భాష పట్ల విశ్వనాథకు గల అనురాగం, దానిపై ఆయనకున్న సాధికారత, భాషను ఆయన ప్రయోగించిన తీరు ‘న భూతో న భవిష్యతి’ అని విమర్శకులు సోదాహరణగా చెప్పారు. ‘ఆయన వాడినన్ని తెలుగు మాటలు, పలుకుబడులు, వాక్యభేదాలను మరేకవి/రచయిత వాడలేదేమో! భారతదేశంలో ఇన్ని విధాలుగా సాంస్కృతిక మూలాలను వ్యాఖ్యానించిన మహా రచయిత ఎవరైనా ఉన్నారేమో నాకు తెలియదు. ఆయన వాడిన భాష పల్లెల్లో ఇంకా ఇంగ్లీషు వాసన సోకనిది’ అన్నారు ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య ఒక సందర్భంలో. విశ్వనాథను గ్రాంథికవాదిగా అభివర్ణిస్తారు కానీ, ఆయన రాసినంత వ్యావహారిక తెలుగును ఎవరూ రాయలేదని ఆచార్య చేకూరి రామారావు పేర్కొన్నారు.

రచన నుంచి పఠనం, విమర్శ దాకా కొన్ని నిర్దిష్ట లక్షణాలు ఉండాలనేవారు విశ్వనాథ. గ్రంథాన్ని త్వరగా చదివేందుకు అభ్యాసం కావాలి. శబ్ద,వాక్య విన్యాస వైఖరి పరిజ్ఞానం అవసరం అంటూ, దానిని ఆచరించి చూపారు. అన్ని రకాల భావాల వ్యక్తీకరణకు ఒకే శైలిని ప్రయోగించడం వారికి సమ్మతం కాదు. రచన, పదబంధం అర్థవంతం కానంత వరకు భావాన్ని సంపూర్ణంగా వ్యక్తీకరించలేరని భావించారు. లక్ష్య (గ్రంథం రాస్తున్న) భాషతో పాటు ఇతర భాషా పరిచయం, కవిత్వ భాషకు–ఇతర ప్రక్రియల భాషకు గల తేడా తెలిసి ఉండాలి. వీటి పట్ల అవగాహన ఉన్నప్పుడే కావ్యం/కవిత గురించి తెలుస్తుంది. ‘శిల్పము కానీ, సాహిత్యంకాని జాతీయమై యుండవలయును. విజాతీయమై యుండరాదు. వ్రాసిన వానికి ముక్తి, చదివినవానికి రక్తి–ముక్తి.



ఎంత సముద్రం మీద ఎగిరినను పక్షి రాత్రి గూటికి చేరును. అది జాతీయత. ఇది సంప్రదాయం’ అని వ్యాఖ్యానించారు. అంటే ఎవరు ఎన్ని భాషలు నేర్చినా, భారతీయతను, మాతృభాషను విస్మరించకూడదనే అంశాన్ని ‘పక్షి విహారం’ను ప్రస్తావిస్తూ చెప్పారని భావించాలి.

‘నేను ఏది చదివిననూ సర్వం కూలంకషముగా దానిలోని లోతులన్నియూ నా మనస్సుకు తృప్తి కలుగునట్లు చదివెదను. ఇట్లే...ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతము–మూడు భాషలను చదివితిని. అక్షరమెచ్చట నుండి పుట్టుచున్నది? ఎట్లు పుట్టుచున్నది? ఏ భాష యొక్క వర్ణ సమన్వయం మెట్లున్నది? దేని శక్తియెంత? వాల్మీకి, వ్యాసులు, నన్నయ–తిక్కనలు, అక్కడ హోమర్–వర్జిల్– షేక్స్‌పియర్ల దాకా...రచనలను తరచి తరచి చూచితిని’ అని వివరించారు. ఆంగ్ల సాహిత్యంపై ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, వారి సంస్కృతి, ఆచారాలు వారికి గిట్టవనే ప్రచారం ఉంది.

*‘భారత దేశాన మున్ను కొందరు తపస్సు*
*చేసి ఋషులైరి నేడు మా సీమ యందు*
*ఇంగిలీసు గ్రంథముల నిట్టె చదివి*
*యట్టె బ్రహ్మర్షులగు చుండి రద్భుతముగ’* అని

చమత్కరించారు

**‘పాషాణపాక ప్రభూ’!?**

‘నిరంతర కావ్య వ్యాసంగంతో విలక్షణత సంపాదిద్దామన్న అభినివేశంతో వారి రచన క్లిష్టతమైంది. అప్పటి బందరు కవులు, ఆయన ఎదుట

మెచ్చుకుంటూ వెనుక వెక్కిరించేవారట. 'పాషాణపాక ప్రభూ' అనీ సంబోధించారు' అని పాత్రికేయ ప్రముఖులు ఆచార్య తిరుమల రామచంద్ర ఒక వ్యాసంలో పేర్కొన్నారు. ఆ విమర్శలు, వ్యాఖ్యలకు విశ్వనాథ మనసు కొంత క్షోభపడినా 'నా మార్గం నాదే...నేను ఎందుకు ఒకరి వెంట పరుగు పెట్టాలి?' అనే నిశ్చయానికి వచ్చారట. 'నా కవిత్వం చాలా మందికి నచ్చకపోవచ్చు, నచ్చదు. అంతమాత్రం చేత నా కవిత్వానికొచ్చిన నష్టమేమీ లేదే!' అంటూ తన పంథాలో సాగుతూ,తమ రచనలపై వచ్చిన పొగడ్తలు, తెగడ్తలను ఒకేలా స్వీకరించారు. కాకపోతే...తమ రచనలను అరఠావు కూడా చదవకుండానే అవలీలగా ఆరేడు ఠావులు విమర్శలతో నింపగల వారంటేనే రుచించ లేదు.

**అందుబాటులో కొన్నే రచనలు!**

విశ్వనాథ వారి నవలేతర రచనలు ప్రస్తుతం అందుబాటు ఉన్నవాటి కంటే కొన్ని రెట్లు అదృశ్యమై ఉండవచ్చని ఆయన మాటలను బట్టే తెలుస్తుంది. వాటిని భద్రపరచడంలో 'నేను సోమరి'అని స్వయంగా చెప్పుకున్నారు. 'నేను శరపరంగా రాసిన పద్యాలను సంకలనం చేయలేదు. అక్కడక్కడ కొందరు స్నేహితులు వేశారు. నేను వ్రాసిన పద్యములకు సంబంధించి... ప్రకటింపబడిన వాటి సంఖ్య సుమారు ఇరువది వేలు ఉండవచ్చు. నేను చించివేసినవి ఒక ఏబది వేలుండవచ్చు. నేను వ్రాసిన గంథముల పేర్లన్నియు నాకు గుర్తుండవు. ఏవి అచ్చు చేయుదునో అవి మాత్రమే గుర్తు' అని ('మహతి') పేర్కొన్నారు.

**రమణీయం రామాయణం**

విశ్వనాథ వారి రచనలన్నీ విశిష్టమైనవే. కానీ వారి కావ్యరచనా ప్రస్థానంలో 'రామాయణ కల్పవృక్షానిది' ప్రత్యేక స్థానం. ఎందరో రామాయణాన్ని ఎంతో రమ్యంగా రాసినా, తనకు వ్యక్తిగతంగా 'రామాయణ కల్పవృక్షం' ఎంతో తృప్తిని ఇచ్చిందని, ఒక తెలుగు కుటుంబంలో జరిగిన కథలాగా రాశానని తన అభిప్రాయాన్ని కచ్చితంగా చెప్పేవారు. తెలుగువారి మాటతీరు, వ్యవహార రీతి, పలుకుబడులు, చమత్కారాలు, సకల జీవన విధానాన్ని ఈ కావ్యంలో ఆవిష్కరించారు. తెలుగు కుటుంబాలలోని మన్ననలు, ఆప్యాయతలు, పద్ధతులు ఈ కావ్యంలోని పాత్రలతో నడుస్తాయి. రామాయణ గాథ అతి ప్రాచీనమైనదైనా గాథగతమైన ఔచిత్యం చెడకుండా తమ కాలం నాటి అనేక విషయాలను, ప్రాభవాన్ని వ్యక్తీకరించారు. సమకాలీన అనేక రాజకీయ, సాంఘిక, శాస్త్రీయ విశేషాంశాలను తమ అభిమతానుసారం సమకూర్చారు.

మానవ సంబంధాలు..ముఖ్యంగా స్త్రీపురుషుల అనుబంధాలు/సంబంధాలు తడబడుతున్న సందర్భాలలో వాటిలోని సామరస్యతను నిలబెట్ట వలసిన ఆవశ్యకతను ఈ కావ్యం ప్రబోధించిందని విమర్శకులు పేర్కొంటారు. 'రామాయణ కల్పవృక్షాన్ని మించిన కవిత్వం ఉండదు. సర్వశక్తులూ పెట్టి వ్రాశాను. పరమేశ్వరుడు అనుగ్రహించాడు. నారాయణుడే పరమేశ్వరుడు. నేను అద్వైతిని. నాకు శివకేశవులకు భేదం లేదు. విష్ణువుకు రామునకు భేదం లేదు. నేను వ్రాసినది రామాయణం. అంకిత మిచ్చినది విశ్వేశ్వరస్వామికి' అన్నారు కవిసమ్రాట్. 'కల్పవృక్ష' సృష్టిపై ప్రత్యేక మమకారం ఉన్నా, ఇతర రచనలన్నీ సమానమే. 'మీ రచనలలో ఏది నిలుస్తుంది?' అని ప్రశ్నిస్తే..'అన్నీనూ...!తల్లికి సంతానమంతా సమానమే కదా?' అనే ప్రశ్నతో కూడిన సమాధానం వచ్చేది. "ఎవరో నా 'ఏకవీర' ఉత్తమమన్నారు. నేను ఉత్తమమని ఎందుకనాలి? ఒక తరం పోయి మరో తరం వచ్చినట్లు చెప్పిన 'వేయిపడగలు' గొప్పది కాదా? దాని గుణగణాలు ఎవరైనా పరిశీలించారా?ఎంతో సైకాలజీ గుప్పించిన 'చెలియలికట్ట' ఏమైనట్టు? పురాణవైరి గ్రంథమాలలో ఒక్కొక్క నవలలో ఒక్కొక్కశిల్పం చూపానే! ఎవరైనా చూచారా?అని ఎదురు ప్రశ్నించేవారు. ఒక లక్ష్యంతో




ఒక ప్రయోజనంతో రాసిన వాటిని చాలామంది ఆ విధంగా అర్థం చేసుకోలేదన్నది వారి భావన కావచ్చు.

కవులు, కావ్యాల విషయంలోనూ అదే పంథా. 'కవుల్లో ఎక్కువ తక్కువ ఏమిటోయ్! ఎవరి రుచి వారిది. మెంతిమజ్జిగ రుచి మెంతి మజ్జిగది. సేమ్యాపాయసం రుచి సేమ్యాపాయసానిది. ఈ రెండింటిలో ఏది బాగుందంటే ఏం చెప్పాలి' అన్నది ఆయన వ్యాఖ్య. కావ్యాన్ని ఆ కావ్యదృష్ట్యా ప్రత్యేకంగా చదవాలి కానీ అందరి కావ్యాల్ని కలిపి ఒకే సూత్రానికి ఎలా బంధిస్తావు? విమర్శకునికి ప్రక్రియ దృష్టి ప్రధానం. భాషలోనైనా ప్రధానంగా, సంస్కృతాంధ్రాల్లో సర్వకావ్యాలను ఒకే దృష్టితో చూడరాదు. కవిత్రయం రచనల మాదిరిగా ప్రబంధకవుల రచనలను చూడరాదనే వారు.

పాశ్చాత్యుల వ్యాఖ్యాల వల్ల భారతదేశ చరిత్ర వక్రీకరణ పాలవుతోందని, దానిని పునరుద్ధరించ వలసిన అవసరం ఉందని భావించి 'పురాణ వైరి గ్రంథమాల'ను నెలకొల్పారు.ఆయా రచనల్లో సమాజ హితం, చైతన్యం అంతర్లీనంగా కనిపిస్తాయి. మనస్తత్వ విశ్లేషణలతో ఆయన రాసిన నవలలన్నీ ఆణిముత్యాలుగా భాసిల్లాయి. వారి రచనల్లో స్త్రీ పాత్రలు వివేకవంతంగానూ, జ్ఞానవంతంగానూ, సంస్కార పూరితంగానూ చైతన్యంతో నిండి ఉంటాయి. అర్ధాంగిపట్ల అంతులేని ప్రేమ ఆయన రాతల్లో కనిపిస్తుంది.

విశ్వనాథవారి నవలల పేర్లు చూసీ చూడగానే ఆకట్టుకునేలా ఉంటాయి. తెఅచిరాజు (చదరంగపు టెత్తుకు తెలుగుపేరు), విష్ణుశర్మ ఇంగ్లీషుచదువు, పులుల సత్యాగ్రహము, ఆఱునదులు, హాహా హూహూ, శార్వరి నుండి శార్వరి దాక, దిండు క్రింది

## భోజన ప్రియత్వం

విశ్వనాథ వారు ఎంతపాటి యోగియో అంత భోగి. ఎంత శుచి తెలిసినవారో అంత రుచి తెలిసినవారు. 'ప్రతిదానిలో రసాన్ని తనివీతీరా గ్రోలిన నిత్యతపస్వి. అన్నం తిన్నా, అవకాయ నంజుకున్నా, కమ్మని నేయి వేసుకున్నా, కండ పెరుగు రుచి చూచినా, సన్న బియ్యం తప్ప ససేమిరా యన్నా, పంచామృతం గ్రోలినా, పరమాన్నం త్రాగినా సంబరపడేవారు' అని వారికి విందు ఇచ్చిన వారు ఆనందంగా చెప్పుకునేవారు. పాకశాస్త్రంలోనూ ప్రవేశం కలిగి స్వయంగా వంటచేసుకునేవారు.



పోకచెక్క, చిట్లీ చిట్లని గాజులు, దంతపుదువ్వెన, పాతిపెట్టిన నాణెములు, నందోరాజా భవిష్యతి..అలా అని కేవలం ఆకర్షణకు పెట్టినవి కావు. ప్రతి రచనలో ఒక విశిష్టత ఉంటుంది. వాటిని స్థాలీపులాయక న్యాయంగా స్మరించుకుంటే...

పరాయి పాలనతో వెన్ను విరిగిన వైనాలను కళ్లకు కట్టిన వెయ్యి పుటల నవల 'వేయిపడగలు'. పాశ్చాత్య ప్రభావం వల్ల నాగరికత, సంస్కృతి విధ్వంసం అయ్యే క్రమంలో అనేక అంశాలను ఎంతో ఆవేదనతో వర్ణించారు. ఇది కేవలం నవల కాదని, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వానికి మారుగా వెలసిన గ్రంథంగా మన్ననలు అందుకుంది. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిఫలింపచేసిన విధానం మనస్సుని ఆకట్టుకొంటుంది. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ నిర్వహించిన నవలల పోటీలో దీనితో పాటు, అడివి బాపిరాజు 'నారాయణరావు' నవల సంయుక్తంగా ఎంపికై చెరో అయిదు వందల రూపాయల బహుమతి గెలుచుకున్నాయి. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 'వేయిపడగలు'ను 'సహస్ర ఫణ్' పేరిట హిందీలోకి అనువదించారు.'

'ఏకవీర' తెలుగు కాల్పనిక సాహిత్యంలో విలక్షణమైనది. నాలుగు పాత్రలను నాలుగు స్తంభాలుగా మలచి మహామండపాన్ని నిర్మించారు. మధురై దగ్గరి వైగై నది చుట్టూ ఈ కథ తిరిగి, చివరకు వైగై నదిలోనే ముగుస్తుంది. సందర్భోచితంగా వర్ణితమైన కూచిపూడి భాగవతుల భామా కలాపం, గొల్లకలాపం వారి ప్రాచీన కళాత్మకతకు గురుతులుగా చెబుతారు. ప్రేమ, ప్రణయం ఎంతటి గొప్ప ఉద్వేగపూరితమైనవైనా, శృంగార భావాలు, మధురమైన కోరికలు ఎంతటి విశృంఖలమైనవి అయినా, హద్దు మీరకుండా నిగ్రహించుకోవడమే భారతీయ సంప్రదాయమని ఈ నవల తీర్మానిస్తుంది. విశ్వనాథను నవలాకారునిగా ఆవిష్కరించిన ఆ రచన మలయాళ, హిందీభాషల్లోకి (పుట్టపర్తి నారాయణాచార్యులు, అంబడిపూడి హనుమయ్య) అనువదితమైంది.

'చెలియలికట్ట' మానసిక పరిణామ దశలను విశ్లేషించిన ఒక సూత్ర గ్రంథం. సిగ్మండ్ ఫ్రాయిడ్ నుంచి భారతీయ మనో విశ్లేషణలన్నింటినీ పుక్కిలి




పట్టిన విశ్వనాథ దీనిని విశిష్టంగా రూపొందించారు. క్షీణిస్తున్న నైతిక సూత్రాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చెలియలి కట్ట.

స్వరాజ్యం వచ్చిన తొలినాళ్లలో జవహర్ లాల్ నెహ్రూ, వల్లభభాయ్ పటేల్ మధ్య కలిగిన విభేదాలను చర్చిస్తూ, 'వల్లభ మంత్రి' అనే నవల రాశారు. ఆంధ్ర పౌరుషము, ఆంధ్ర ప్రశస్తి వంటి తెలుగువారు రొమ్ము విరుచుకుని చెప్పుకునే పద్య కావ్యాలు రాశారు. విశ్వనాథ నాటకాలలో వేనరాజు, నర్తనశాల, అనార్కలి ప్రసిద్ధమైనవి.

ఆయన రచనలలో 'జీవుడి వేదన' అనే మాట తరచూ వినిపిస్తుందని, అది ఆయన స్వేచ్ఛా చింతనకు ఉదాహరణ అని రచయిత శ్రీరమణ ఒక సందర్భంలో అన్నారు. ప్రతి మనిషికీ తనవైన కొన్ని ఆలోచనలు, సొంత ఘోష ఒకటి ఉంటుందని, అదే విశ్వనాథ ప్రతిపాదించిన జీవుడి వేదన అని పేర్కొన్నారు.

**విలక్షణత**

'విద్వాన్ సర్వత్ర పూజ్యతే..'ఆర్యోక్తికి నిలువెత్తు నిదర్శనం. తమ విద్వత్తుతో సమకాలీనుల దూషణ భూషణలను సమానంగా చవిచూచి నిభాయించుకొచ్చిన విలక్షణ స్వభావి. రచన వ్యాసంగం ఆరంభం నుంచి అనేక విమర్శలు, అపవాదులను తట్టుకుంటూ స్థిరంగా 'గౌరీశంకరుల శిఖరం'లా నిలిచారు. తమ అభిప్రాయాలను, ఇష్టానిష్టాలను నిక్కచ్చిగా వ్యక్తం చేయడంలో రాజీలేని ధోరణి. సత్యంగా నమ్మినదాన్ని తమ రచనలలోనూ, సభావేదికలపై నిర్భయంగా, నిస్సంకోచంగా చాటారు. దాంతో ఆయనకు అభిమానులతో పాటు వ్యతిరేకులూ ఏర్పడ్డారు. విమర్శలకు వెరవలేదు. విమర్శను స్థూలంగా, కువిమర్శ, అసూయాగ్రస్త విమర్శ, సాహిత్య ద్రోహ విమర్శ, అకులత్వాన్ని సృష్టించే అసోష్ఠవ విమర్శ ...అని పేర్కొంటూ సమకాలీన విమర్శలను, విమర్శకులను దృష్టిలో పెట్టుకొని విమర్శ క్షేత్రంలో సుక్షేతనం తేవడానికి ప్రయత్నించారు.

తమ నవలల్లో కూడా విమర్శ అనిపించగలిగిన వాటిపై సాహిత్య చర్చలు చేయడం, మొహమాటం/మర్యాద కోసం రాయవలసిన ముందుమాట/పీఠికల్లో విమర్శ అంశాలు పొందుపరచడం వంటివి ఆయన ప్రత్యేకతలుగా బాగా ఎరిగిన వారు చెబుతారు. ఒక రచన చదివి దానిపై అభిప్రాయం ప్రకటించడం కాకుండా అందులోని భిన్నాంగాల ఔన్నత్యాన్ని, ఔచిత్యాన్ని వాటి సమన్వయాన్ని విశ్లేషించేవారు.

'స్వశక్తిని చెప్పుకుంటే అహంకారమనుకుంటారు. నాకు విరోధులెక్కువ మంది. ఎందుకో నాకర్థము కాదు. నన్నెరుగని వాండ్రు నేను దుర్జనడనందురు. ఎరిగిన వారు చాలా మంచి వాడందురు. నేను చాలా మందికి నా చేతనైనచో ఉపకారములే చేయుదును తప్ప అపకారములు చేయను. అవతలివానికి అపకారము జరిగెడి అబద్ధం చెప్పనే చెప్పను. ఎవరినైనా ఏదైనా అంటే వాళ్లు నాకు చాలా అపకారం చేస్తే అంటాను. ఒక్కటి మాత్రం ఉంది. నేను అనడం ఘాటుగా ఉంటుంది. కనుక తరువాత దానిని గురించి నాకు జ్ఞాపకముండదు' అని ఒక వ్యాసంలో పేర్కొన్నారు. అంతేకాదు...గర్వం, గాంభీర్యం మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. చాలామంది తెలియని వారు గాంభీర్యాన్నే గర్వం అనుకొంటూ ఉంటారని, గాంభీర్యం జ్ఞాన సంబంధితం కాగా, గర్వం అజ్ఞానానికి చెందినదని, జ్ఞానికి గాంభీర్యం సహజం, సౌందర్య లక్షణాలని వ్యాఖ్యానించారు. ఈ లెక్కన విశ్వనాథ వారి గర్వం నాటికీ నేటికీ అందరనుకున్నట్లు గర్వం కాదు... గాంభీర్యమని అభిమానులు భావన.

ఆయన మాట తీరు అలా ఉన్నా ఆయన ప్రసంగాలు, /ఉపన్యాసాల కోసం జనం విరగబడి రావడం ఆయన పాండితీ ప్రకర్షకు నిదర్శనం. ఆయన నిండు సభలో వేసే విసుర్లు, చెణుకులు, విమర్శలను భూషణాలుగానే తీసుకునేవారు ప్రేక్షకులు. ధిషణాహంకారిగా పేరు పొందిన ఆయనలోని బేలతనం పలువురిని కదిలించేది. 'జీవితాన్ని సంపూర్ణంగా తరచి చూసినవాడు, అర్థం చేసుకున్నవాడు విశ్వనాథ. హాలాహలం ఎలాంటిదో తెలుసు, అమృతమేమిటో తెలుసు. "బాల్యంలో తల్లిని, యవ్వనంలో భార్యని, వృద్ధాప్యంలో కొడుకుని పోగొట్టుకున్నవాణ్ని. వేదనకి అర్థం నాకు తెలిసినంతగా మరెవరికి తెలుస్తుంది" అన్న మాటలు విన్నవారి కళ్లు చమర్చాయి.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

'నిండు మనంబు నవ్య నవనీత సమానము పల్కు, దారుణాఖండం శస్త్రతుల్యము' అన్న పలుకు వారి పట్ల ప్రత్యక్షర సత్యం అనిపిస్తుంది. చాలామంది అనుకునేలా ఆయన 'అహంభావి' కాదని పలువురు స్వానుభావాలను వెల్లడించారు. తెలుగు భాషా మర్యాదలు పాటించిన రచయితలను అక్కున చేర్చుకొనేవారు. విద్వత్ రచయిత అయితే ఎంత చిన్నవాడైనా ప్రోత్సహించేవారు. ఒక ఉదాహరణకు, ఆయన కాలం చేయడానికి సరిగ్గా రెండేళ్ల ముందు (సెప్టెంబర్ 1,1974) పుట్టపర్తి నారాయణాచార్యులు అధ్యక్షతన కడపలో ఆయనకు జరిగిన సత్కారసభలో రైతుకవి బైరపురెడ్డి నారాయణరెడ్డి, తన 'రాయలసీమ రైతు' కావ్యానికి విశ్వనాథ వారి ఆశీస్సులు కోరారు. ఆ కవిని ఎంతో ఆప్యాయంగా పలుకరించి ఈ గ్రంథాన్ని అక్కడికక్కడే చదివి, తమ అభిప్రాయాన్ని చెప్పి, అభినందించారు. విస్తుపోయిన ఆ కవి, 'స్వామీ! విశ్వనాథ అహంభావి, ఎవరిని లక్ష్యపెట్టరని విమర్శిస్తారు. మీ తీరు అందుకు భిన్నంగా ఉందే!' అన్న మాటలకు, 'నన్నేం చేయమంటావు. అది నా ఖర్మ'అనే నిర్వేదనతో కూడిన సమాధానం. ఆయన మాటతీరుతో నిమిత్తం లేకుండా, వారి ప్రశంస దక్కడమే గొప్పగా భావించే కవులు, కళాకారులు కోకొల్లలు. అమరగాయకుడి ఘంటసాల వారి 'భగవద్గీత' రికార్డు ఆవిష్కరణ సభలో "సంగీతమే వృత్తిగా బ్రతికిన ఒక జీవి. జీవిత చరమదశలో భగవద్గీత పాడుతూ పోయినాడూ అంటే నిశ్చయంగా అతను ఉత్తమ లోకాలకే పోతాడు. కాదన్నవాడు నరకానికి పోతాడు' అని ఢంకా బజాయించారు.

'మీ సాహిత్య జీవితంలో మరపురాని సంఘటలను చెప్పండి' అని ఒకరు శ్రీశ్రీని అడిగినపుడు ...'కవితా! ఓ కవితా'అనే గీతం చదువుతుంటే విశ్వనాథ సత్యనారాయణ గారు అశ్రుసిక్త నేత్రులు కావడం ఒకటని చెప్పారు. విశ్వనాథ లోకం వీడినపుడు 'షెల్లీ మళ్లీ మరణించాడు' అన్నారు శ్రీశ్రీ.

మేలు చేసిన వారి పట్ల వారి కృతజ్ఞత భావనా అలాంటిదే. ఆయనకు ఉద్యోగంలేని సమయంలో ఇల్లు కూడా గడవని పరిస్థితిలో బందరు (మచిలీపట్నం)కు చెందిన బియ్యం వ్యాపారి చిట్టూరి రామారావు సహాయం చేశారు. దాదాపు ముప్పయ్యేళ్ల తరువాత విజయవాడలో కూతురుని చూసేందుకు వచ్చిన ఆయన, విశ్వనాథ దర్శనానికి వెళ్లారు. కుటుంబ సభ్యులతో కబుర్లు చెబుతున్న ఆయన వాకిలి గుమ్మం వద్ద నిలుచున్న వ్యాపారిని గుర్తించి ఆదరంగా ఆహ్వానించారు. 'ఈయన ఎవరో మీకు తెలియదు. మన కుటుంబ ప్రాణదాత. నాకు అన్నం పెట్టి బతికించినవాడు. ఆ రోజుల్లో ఈయన అన్నం పెట్టకపోతే ఎప్పుడే చనిపోయేవాడిని..' అంటూ చెమ్మగిల్లిన కళ్లతో, గద్గద స్వరంతో కుటుంబ సభ్యులకు పరిచయం చేశారు. ఆయనను నూతన వస్త్రాలతో సత్కరించారు. మరో సంఘటన... కళాశాలలో సహాధ్యాయి, 'హంపీక్షేత్ర'కర్త కొడాలి వేంకట సుబ్బారావు హఠాన్మరణంతో శోకతప్తులైన విశ్వనాథ, మిత్రుడి కావ్యాన్ని కళాశాల పాఠ్యాంశంగా నిర్ణయించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు

'ప్రపంచ ప్రఖ్యాత నాటకకర్త షేక్స్పియర్ గొప్ప నాటకాలు, కవితలూ రాశాడు. మహా కావ్య రచన చేయలేదు. మిల్టన్ మహాకావ్యం రచించినా నవల రాయలేదు. రవీంద్రనాథ్ ఠాగూర్ అనేక సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశారు. ఒక్క మహాకావ్యం తప్ప. కానీ, విశ్వనాథ వారి సాహిత్యంలో నవల, కథ, కవిత్వం, నాటకం, మహాకావ్యం, విమర్శ లాంటి సాహిత్య ప్రక్రియలు కొలువుదీరాయి'అని ఒక సాహితీవేత్త విశ్లేషించారు. 'వేయిపడగల పాపరేడూ, చెలియలికట్ట లేని పసిఫిక్ పాథోనిధి, మూడడుగలతో నేల కొలిచిన త్రివిక్రముడూ ..ఒక్క రూపంలో తెనుగు సాహిత్యం లోకంలో అవతరించినట్టు నాకు పొడగట్టుతారు విశ్వనాథ వారు' అన్నారు పాత్రికేయ ప్రముఖులు ఆచార్య తిరుమల రామచంద్ర.

అధ్యాపక వృత్తి, సంసారం, రచనా వ్యాసంగం, పర్యటనలు సభలు, సమావేశాలు, ప్రసంగాలు, ఉద్యోగ విరమణ అనంతరం 'పెద్దతనం..'..ఇలా ఇన్నింటి మధ్య ఒక మనిషి అన్ని రంగాలను అన్ని విధాలుగా, శోధించి, మథించి పలు ప్రక్రియలలో శతాధిక గ్రంథాలను వెలువరించడం సాధ్యమేనా?' అనిపిస్తుంది. 'కవిత్వమనే పవిత్రాగ్ని నుంచి పుట్టారా?' అనిపించుకున్న ఆయన, సమకాలికులు చాలా మంది దాదాపు కలం ఆపేసినా ఆయన తుదిదాకా రచన సాగించారు. అందుకే విశ్వనాథతో పోల్చదగినవారు విశ్వనాథ మాత్రమే! అందుకే ఒకడు విశ్వనాథ. కాదంటే ఒకే ఒక్కడు విశ్వనాథ.!! ★

## కవిసమ్రాట్ జీవిత ప్రస్థానం




సెప్టెంబర్ 10,1895న కృష్ణాజిల్లా నందమూరులో జన్మించిన విశ్వనాథ సత్యనారాయణ కరీంనగర్ సహా కొన్ని ప్రాంతాలలో ఉద్యోగించినా, తమ సాహితీ సేద్యాన్ని కడదాకా బెజవాడ కేంద్రంగానే సాగించారు. అధ్యాపకుడిగా ఎందరినో తీర్చిదిద్దారు. వారి తండ్రి శోభనాద్రి గారు వంద ఎకరాకు పైగా ఆసామి. మహాభోగి,అంతకు మించి త్యాగి. వారి ఇంట భుజించని వారు స్వగ్రామంలోనే కాదు.. జిల్లాలోనే లేరని ప్రతీతి. కుమారుడు పెరిగి పెద్దయ్యేనాటికి పిత్రార్జితం పూర్తిగా కరిగిపోయింది. ఆ పరిస్థితులు కూడా విశ్వనాథ పట్టుదల, స్వయంకృషికి మూల హేతువులుగా చెబుతారు. జీవితాన్ని అన్ని దృక్కోణాల నుంచి క్షుణ్ణంగా పరికించి, ఆకళింపు చేసుకొని, దానిని జీవితపరమార్థంతో జోడించి, తాత్త్విక దార్శనిక దృష్టితో సాహిత్య సారస్వతాలను సుసంపన్న చేసిన మహామనీషి. ఏ కవిని ఎక్కడ ఎలా దర్శించాలో తెలిసిన కవిసమ్రాట్. ప్రాచీన కవుల రచనలపై ఆయన విశ్లేషణ వ్యాసాలు భావితరం విమర్శకులకు పాఠ్య గ్రంథాలుగా అందించి అక్టోబర్ 18, 1976న సెలవంటూ తరలివెళ్లారు.




'విద్వాన్ సర్వత్ర పూజ్యతే..'ఆర్యోక్తికి నిలువెత్తు నిదర్శనం. తమ విద్వత్తుతో సమకాలీనుల దూషణ భూషణలను సమానంగా చవిచూచి నిభాయించు కొచ్చిన విలక్షణ స్వభావం.రచన వ్యాసంగం ఆరంభం నుంచి అనేక విమర్శలు, అపవాదులను తట్టుకుంటూ స్థిరంగా 'గౌరీశంకరుల శిఖరం'లా నిలిచారు. తమ అభిప్రాయాలను, ఇష్టానిష్టాలను నిక్కచ్చిగా వ్యక్తం చేయడంలో రాజీలేని ధోరణి.




# కరవుసీమకు

**మదనపల్లెలో రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రి నారా లోకేష్, రియలన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబేద్కర్‌లతో కలసి అక్టోబరు 2న శంకుస్థాపన చేశారు. ఈ 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటుకు అవసరమయ్యే నిధులలో దాదాపు రూ.40,352 కోట్లను కేంద్ర ప్రభుత్వం 'పూర్వోదయ' పథకం కింద వివిధ ప్రాజెక్టుల రూపంలో సమకూర్చనుండగా, మిగిలిన రూ.60 వేల కోట్లను ప్రైవేట్ కంపెనీలు పెట్టుబడిగా పెట్టనున్నాయి.**

రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు ప్రాంతాలకూ ఉద్యాన పంటల విస్తరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల రూపంలో ఈ హబ్ ఫలాలు అందనున్నాయి. ఒకప్పుడు 'రతనాల సీమ'గా కీర్తి గడించిన రాయలసీమ, గత కొన్ని దశాబ్దాలుగా 'కరవు సీమ'గా మారిపోయింది. వర్షం కోసం ఆకాశం వైపు, నీటి కోసం వందల అడుగుల లోతు బోర్ల వైపు చూడటమే ఇక్కడి రైతు జీవితమైంది. ఈ నేపథ్యంలో ఏర్పాటుకానున్న ఉద్యానహబ్ రైతాంగానికి గొప్ప ఊతం ఇవ్వనుంది. సీమ రైతాంగంలో కొత్త ఆశలు రేపుతోంది. తీవ్ర వర్షాభావంతో ఎడారీకరణకు దగ్గరవుతున్న ఈ ప్రాంతం పండ్ల తోటలు, దాని అనుబంధ పరిశ్రమలతో పంట పొలాలు కళకళలాడే మంచికాలం రానుంది. ప్రభుత్వ సలహాలు, సాంకేతిక సహాయంతో ప్రకృతి, సేంద్రియ ఉత్పత్తులు నాణ్యతతో గరిష్ఠ ఉత్పత్తి సాధించే అవకాశం ఏర్పడనుంది. రైతులకే కాదు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దనుంది.

రాయలసీమ కరవుకు ప్రధాన కారణం దాని భౌగోళిక స్థితి. ఈ ప్రాంతం రెయిన్ షాడో పరిధిలో ఉంది. నైరుతి రుతుపవనాలను పశ్చిమ కనుమలు అడ్డుకోవడంతో మేఘాలు ఇక్కడికి చేరేసరికి బలహీనపడతాయి. ఈశాన్య రుతుపవనాలు కోస్తా జిల్లాల మాదిరిగా సీమను తడపవు. ఫలితంగా ఏటా సగటున 500 నుంచి 700 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదవుతుంది. దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన జిల్లాల్లో అనంతపురం ఒకటిగా నిలవడమే ఇందుకు నిదర్శనం. కురిసే ఆ కొద్దిపాటి వర్షమూ సకాలంలో, సమానంగా ఉండదు. నేల స్వభావమూ రైతుకు ప్రతికూలమే. ఇక్కడి ఎర్రనేలలు, రాతి నేలలు లోతు తక్కువగా ఉండి నీటిని నిలుపుకోలేవు. గట్టి శిలలతో కూడిన భూగర్భం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకే అవకాశం తక్కువ. దీంతో భూగర్భ జలాలు వేల అడుగుల లోతుకు పడిపోయాయి. ఒక్క బోరులో నీరు పడాలంటే పది బోర్లు వేయాల్సి వచ్చి, అప్పుల ఊబిలో కూరుకు పోయిన రైతులు ఎందరో.

కృష్ణా, తుంగభద్ర, పెన్నా నదులు సమీపంలోనే ఉన్నా, సాగునీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పూర్తి కాకపోవడంతో భూములు క్రమంగా బీడులుగా మారుతున్నాయి. పచ్చదనం తగ్గి, మట్టి కోతకు గురై, సారం కోల్పోయిన భూములు ఎడారీకరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. వేరుశనగ వంటి వర్షాధార పంటలపైనే ఆధారపడిన రైతు, వరుస పంట నష్టాలతో పొలం వదిలి వలస బాట పట్టాల్సి వస్తోంది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరక ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల విషాదగాథలు సీమ పల్లెల్లో ఎన్నో. పిల్లలను, వృద్ధులను ఊళ్లో వదిలి కూలి పనుల కోసం పట్టణాలకు తరలిపోయిన కుటుంబాలతో అనేక గ్రామాలు బోసిపోతున్నాయి.

**పశుగ్రాసం కరవు-కబేళాలకు పాడి పశువులు**

కరవు ప్రభావం పంటలకే పరిమితం కాలేదు. పంటలు పండకపోవడంతో పశుగ్రాసమూ దొరకడం లేదు. గడ్డి ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో పశువులను పోషించడం రైతుకు తలకు మించిన భారమైంది. ఇంటి సభ్యుల్లా పెంచుకున్న పాడి పశువులను,ఎద్దులను తక్కువ ధరకే కబేళాలకు అమ్మేసుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఎన్నో గ్రామాల్లో కనిపిస్తోంది. వేసవి వచ్చిందంటే పశువుల సంతలు కిటకిటలాడటం సీమ కరవు తీవ్రతకు అద్దం పడుతోంది. పాడి ద్వారా వచ్చే స్థిర ఆదాయాన్నీ కోల్పోయి రైతు కుటుంబాలు మరింత కుంగి పోతున్నాయి.



**ఇప్పటికే ఉద్యాన సీమ**

ఇన్ని ప్రతికూలతల మధ్యే రాయలసీమ రైతు పట్టుదలతో ఉద్యాన పంటల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం ఇచ్చే ఉద్యానపంటలే సీమకు సంజీవనిగా మారాయి. యాపిల్ నుంచి స్ట్రాబెరీ వరకు, అరటి నుంచి అవకాడో వరకు, కివి నుంచి ఖర్జూరం వరకు 20 రకాల పంటలు సాగుచేస్తున్నారు. ఇలా ఒకే ప్రాంతంలో పండ్లు, పూలు, కూరగాయలు ఉత్పత్తి చేసే ప్రాంతం రాయలసీమ మాత్రమే. చిత్తూరు, అన్నమయ్య జిల్లాలు మామిడికి పేరుగాంచగా, మదనపల్లె టమోటా మార్కెట్ దేశంలోనే అతి పెద్ద వాటిల్లో ఒకటిగా నిలిచింది. అనంతపురం, శ్రీసత్య సాయి జిల్లాలు దానిమ్మ, బత్తాయి, అరటికి కేంద్రాలుగా మారాయి. కడప జిల్లా అరటి, బొప్పాయికి, కర్నూలు ఉల్లికి ప్రసిద్ధి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 8.41 లక్షల హెక్టార్లలో ఉద్యాన సాగు జరుగుతోంది. అయితే సరైన నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు లేక పంట పండినా ధర దక్కక, టమోటాను రోడ్లపై పారబోసే దృశ్యాలు తరచూ కనిపిస్తున్నాయి.

**హబ్ ప్రణాళిక-నిధులు, దశలు**

ఈ లోటును పూడ్చేందుకే ఉద్యాన హబ్ రూపుదిద్దుకుంటోంది. ప్రభుత్వ నిధుల్లో సింహభాగం రూ.20,884 కోట్లను సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించారు. వీటి ద్వారా కొత్తగా 3 లక్షల ఎకరాల ఆయకట్టు సృష్టించడంతో పాటు 4.3 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తారు. ఉద్యాన




# కలిసొచ్చే కాలం

అభివృద్ధికి రూ.15,000 కోట్లు, 5,721 కి.మీ. గ్రామీణ రహదారులు సహా రవాణా వసతులకు రూ.4,562 కోట్లు వెచ్చిస్తారు. 303 మండలాలు, 5,869 గ్రామాల్లో 201 క్లస్టర్లుగా ఆగస్టు 2026 నుంచి జులై 2029 వరకు మూడు దశల్లో ఈ ప్రాజెక్టు అమలవుతుంది.

ఈ హబ్ ప్రయోజనాలు రాయలసీమకే పరిమితం కావు. సీమను ఆనుకుని ఉన్న ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలూ తరచూ కరవు కోరల్లో చిక్కుకునేవే. ముఖ్యంగా మార్కాపురం ప్రాంతం నీటి కొరతతో పాటు ఫ్లోరైడ్ సమస్యతోనూ సతమత మవుతోంది. నెల్లూరు ప్రాంత రైతులకూ ఉద్యాన పంటల విస్తరణ, ప్రాసెసింగ్ యూనిట్లు కొత్త మార్కెట్ అవకాశాలను అందించనున్నాయి.

**రైతాంగానికి కలిగే ప్రయోజనాలు**

కొత్త ఆయకట్టు, సూక్ష్మ సేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్) విస్తరణతో ప్రతి నీటి చుక్కా సద్వినియోగమవుతుంది. బోర్లపై ఆధారపడటం తగ్గి, భూగర్భ జలాలు కూడా క్రమంగా పుంజుకుంటాయి. ఉద్యాన సాగును అదనంగా 6 లక్షల హెక్టార్లు పెంచి 14.41 లక్షల హెక్టార్లకు చేర్చడం,ఉత్పత్తిని 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు రెట్టింపు చేయడం లక్ష్యం. సంప్రదాయ మామిడి, అరటి, దానిమ్మలతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బెర్రీలు, ఖర్జూరం వంటి అధిక ధర పలికే పంటలు సీమ పొలాల్లో పండనున్నాయి. సుమారు 9.6 లక్షల మంది ఉద్యాన రైతులకు నేరుగా లబ్ధి చేకూరనుండగా, మూడేళ్లలో వ్యవసాయ రంగం నుంచి రూ.81,000 కోట్ల అదనపు స్థూల విలువ జోడింపు సాధ్యమవుతుందని అంచనా. ప్రైవేట్ పెట్టుబడులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, గ్రేడింగ్, ప్యాకింగ్ కేంద్రాలు ఏర్పాట వుతాయి. టమోటా సాస్‌గా, మామిడి గుజ్జుగా, పండ్లు జ్యూస్‌లుగా మారి విలువ పెరుగుతుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పంటను నేరుగా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే అవకాశం కలుగుతుంది. ధర పతనమైనప్పుడు పంటను పారబోయాల్సిన దుస్థితి తప్పుతుంది. 5,721 కి.మీ. మేర గ్రామీణ రహదారుల విస్తరణతో మారుమూల పల్లెల నుంచి కూడా పంటను త్వరగా మార్కెట్లకు, ప్రాసెసింగ్ కేంద్రాలకు చేర్చవచ్చు. రవాణా ఖర్చు తగ్గడమే కాక, త్వరగా పాడయ్యే పండ్లు, కూరగాయల నష్టమూ గణనీయంగా తగ్గుతుంది.

**'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ఊతం**

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో మదనపల్లెలో రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' సంస్థ ద్వారా కృత్రిమ మేధ, ప్రిసిషన్ ఫార్మింగ్, స్మార్ట్ ఇరిగేషన్ వంటి సాంకేతికతలు నేరుగా రైతు పొలానికి చేరతాయి. ఏ నేలలో ఏ పంట వేయాలి? ఎప్పుడు ఎంత నీరు పెట్టాలి? వంటి శాస్త్రీయ సలహాలు క్షేత్రస్థాయిలోనే రైతుకు అందుతాయి. వ్యవసాయ పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే ఈ సంస్థ, సీమ యువతను నైపుణ్యం గల వ్యవసాయ నిపుణులుగా, అగ్రి–స్టార్టప్ వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దే వేదికగానూ మారనుంది. ప్రాసెసింగ్, నిల్వ, గ్రేడింగ్, రవాణా రంగాల్లో 19.7 లక్షల మందికి కొత్తగా ఉపాధి లభించనుంది. పనుల కోసం బెంగళూరు, చెన్నై, గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న సీమ యువతకు సొంత ఊళ్లోనే పని దొరుకుతుంది. ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లలో పొదుపు సంఘాల మహిళలకూ ఉపాధి లభించి, గ్రామీణ కుటుంబాల ఆదాయం పెరుగు తుంది. సాగునీరు పెరిగితే పశుగ్రాసం సాగూ పెరుగుతుంది. ఉద్యాన పంటల ద్వారా వచ్చే స్థిర ఆదాయంతో రైతు పశువులను పోషించుకోగలుగుతాడు. పాడి పశువులను కబేళాలకు తరలించే దుస్థితికి తెరపడి, పాడి పరిశ్రమ కూడా పుంజుకుంటుంది.

**మారనున్న సీమ ముఖచిత్రం**

ఈ ప్రణాళిక సక్రమంగా అమలైతే రాయలసీమ ముఖచిత్రమే మారిపోతుంది. బీడు భూములు పండ్ల తోటలుగా, ఎండిన చెరువులు జలకళతో, ఖాళీ అవుతున్న గ్రామాలు జనసందడితో కళకళలాడ తాయి. పచ్చదనం పెరగడంతో ఎడారీకరణ ముప్పు తగ్గుతుంది. ఏళ్ల తరబడి నిలిచే పండ్ల తోటలు నేల కోతను అడ్డుకుని, మట్టిలో తేమను కాపాడతాయి. ఏటా వర్షంపై జూదం ఆడే వేరుశనగ సాగు స్థానంలో ఏళ్ల పాటు స్థిర ఆదాయం ఇచ్చే తోటలు రావడంతో రైతు భవిష్యత్తుపై భరోసా పెరుగుతుంది. వ్యవసాయాన్ని వదిలేస్తున్న యువత ఆధునిక సాంకేతికతతో మళ్లీ సాగు వైపు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల వైపు అడుగులు వేస్తారు. రాయలసీమ 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మాత్రమే కాక, ప్రపంచ ఉద్యాన పటంలోనూ ప్రత్యేక స్థానం సంపాదిస్తుంది.

అయితే ఈ ఫలాలు చివరి రైతు వరకూ చేరాలంటే కొన్ని చర్యలు అవసరం. సాగునీటి ప్రాజెక్టులు గడువులోగా పూర్తి కావాలి. ప్రైవేట్ పెట్టుబడుల లాభాల్లో చిన్న, సన్నకారు రైతులకూ న్యాయమైన వాటా దక్కాలి. పండిన పంటకు గిట్టుబాటు ధర భరోసా ఉండాలి. ప్రభుత్వాలు, అధికారులు, రైతులు కలిసి పనిచేస్తేనే ఈ కల సాకారమవుతుంది. నీటి చుక్క విలువ తెలిసిన రాయలసీమ రైతు, అవకాశం దొరికితే అద్భుతాలు సృష్టించగలడని ఇప్పటికే నిరూపించాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, కార్పొరేట్ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత ఒకే వేదికపైకి రావడం సీమ చరిత్రలో ఒక మలుపు. కరవుసీమను ప్రపంచ ఉద్యానవనంగా మార్చే ఈ లక్ష కోట్ల ప్రణాళిక, రాయలసీమకు మళ్లీ 'రతనాల సీమ' వైభవాన్ని తెచ్చి పెడుతుందని ఆశిద్దాం.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

# ఆలయాలపై ఆగని

**హైదరాబాద్‌లో దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలు షరా మామూలుగా మారాయి. ఒకటి, రెండు కావు.. తరచూ ఎక్కడో ఓచోట అలాంటి దుర్ఘటనలు హిందువుల విశ్వాసాలను దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా ఇలాంటి పరిణామాలకు అడ్డుకట్ట పడటం లేదు. మొన్నటికి మొన్న దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయంలో పూజారి పూజ చేస్తుండగా, భక్తుల సమక్షంలోనే, ఒక వ్యక్తి గర్భాలయంలోకి చొరబడి అమ్మవారి విగ్రహంపై కర్రలతో దాడి చేశాడు. తర్వాత తాపీగా బయటకు నడచి వెళ్లడం సీసీ కెమెరాల్లో నమోదైంది.**

**ఇదే మొదటిసారి కాదు...**

ఇలా మత విశ్వాసాలను దెబ్బతీసే ఉన్న సంఘటనలు ఇటీవలి కాలంలోనే అనేకం జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో మత విశ్వాసాలను రెచ్చగొట్టే ప్రయత్నం అక్టోబర్ 14,2024 తేదీన చోటుచేసుకుంది. ముంబైకి చెందిన సల్మాన్ సలీమ్ ఠాకూర్ (30) గుడి తాళం పగలగొట్టి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. ఆ దాడివల్ల రేగిన ఉద్రిక్తతలు చల్లారకముందే శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాలనీలోని హనుమాన్ ఆలయం ప్రాంగణంలోని నవగ్రహ విగ్రహాలు సహా మరికొన్నిటిని (నవంబర్ 5, 2024) ధ్వంసం చేశారు. ఆ సంఘటనకు సంబంధిచి మతిస్థిమితం లేని 50 ఏళ్ల వ్యక్తిని పట్టుకున్నట్లు పోలీసులు చెప్పారు కాని, ఆ అనుమానితుడి గుర్తింపును వెల్లడించలేదన్న విమర్శలు వచ్చాయి.



రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ, శివారు ప్రాంతాల్లోని దేవాలయాలపై కొన్నేళ్లుగా ఇలాంటి ఉద్దేశ్యపూర్వక దాడులు జరుగుతున్నాయి. ఇవి కేవలం సంఘటనలుగా కాకుండా, పక్కా ప్రణాళిక ప్రకారం జరుగుతున్నట్టుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. దిల్‌సుక్‌నగర్ సంతోషిమాత ఆలయంలో అక్టోబర్ 2వ తేదీన పూజారి పూజ చేస్తుండగా ఒక వ్యక్తి చెట్టు కొమ్మలతో లోపలికి వచ్చి అమ్మవారి విగ్రహంపై దాడి చేశాడు. ఆ తర్వాత ఏమీ పట్టనట్టు తాపీగా బయటకు నడిచి వెళ్లిపోయాడు. అక్కడున్న భక్తులు తొలుత నిశ్చేష్టులైనా.. తర్వాత తేరుకొని దుండగుడిని పట్టి పోలీసులకు అప్పగించారు. నిందితుడి పేరు మహమ్మద్ అన్సారీ అని, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన చైతన్యపురి పోలీసులు తెలిపారు. అయితే, అతను మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోందని చెప్పారు.

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న 2022లో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఖైరతాబాద్ సమీపంలోని చింతల్ బస్తీ రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని ఇద్దరు మహిళలు ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. అది గమనించిన స్థానికులు వారిని అడ్డుకోబోగా, ఆ మహిళలు వారిపై ఎదురు దాడికి దిగారు. ఆ తర్వాత స్థానికులు వారిని పట్టుకుని సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. అయితే, నిందితులు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని పోలీసులు చెప్పారు.

హైదరాబాద్ పాతబస్తీలోని సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భూలక్ష్మి ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం నాటి (ఆగస్టు 26,2024) అర్ధరాత్రి సమయంలో మరో దుశ్చర్య చోటు చేసుకుంది. ఆ సంఘటనలో అమ్మవారి విగ్రహం ధ్వంసమైంది. దుండగులు భూలక్ష్మిమాత, నల్ల పోచమ్మ విగ్రహాలను ధ్వంసం చేశారు. అమ్మవారి కిరీటాన్ని కింద పడేశారు. పూజా సామాగ్రిని చెల్లాచెదురు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, జునైద్ అనే ప్రధాన నిందితుడితో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ప్రధాన నిందితుడు మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు అతని కుటుంబసభ్యులు చెప్పారని పోలీసులు వెల్లడించారు. కాగా, పోలీస్ స్టేషన్‌కు కేవలం 50 గజాల దూరంలో ఉన్న ఆలయంలో గతంలో ఐదుసార్లు దాడులు జరిగాయని స్థానికులు చెప్పారు. ప్రణాళిక ప్రకారమే ఈ దాడులు జరుగుతున్నాయనే సందేహాలను వ్యక్తం చేశారు.

రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం జుకల్ గ్రామంలోని సోమయ్య, చౌడమ్మ, పోచమ్మ ఆలయాలపై కొందరు దుండగులు నవంబర్ 9,2024 న దాడికి తెగబడి మూడు విగ్రహాలను ధ్వంసం చేశారు. అర్ధరాత్రి ఆలయంలో శబ్దాలు రావడాన్ని గమనించిన స్థానికులు ఒక నిందితుడిని పట్టుకుని, దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడిని మహారాష్ట్రకు చెందిన సలీం అర్మాన్‌గా గుర్తించారు. షాద్‌నగర్ పరిధిలోని జానంపేట గ్రామంలో ఉన్న అతి పురాతన బసవన్న ఆలయంలోని శివలింగాన్ని నవంబర్ 22, 2024న



భూలక్ష్మి ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం



# అరాచకాలు

తేదీన గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు.

హైదరాబాద్ నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫిల్‌గూడ శ్రీ విజయదుర్గ కట్టమైసమ్మ ఆలయంలో అత్యంత అపవిత్ర చర్య వెలుగు చూసింది. జనవరి 10,2026 తేదీ రాత్రి ఒక వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి, అమ్మవారి విగ్రహం సమీపంలో అసభ్యకర, అపవిత్రమైన పనులకు పాల్పడ్డాడు. నిందితుడిని కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లాలోని హుగేరి గ్రామానికి చెందిన 26 ఏళ్ల అల్తాఫ్‌గా పోలీసులు గుర్తించారు. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 200 ఏళ్ల నాటి చారిత్రక శ్రీ ద్విముఖి ఆంజనేయ స్వామి ఆలయంపై దుండగులు దాడికి తెగబడ్డారు. హనుమంతుడి ప్రధాన విగ్రహాన్ని ధ్వంసం చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు కేవలం డబ్బు సంపాదించడం కోసమే ఈ దొంగతనానికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు.

విగ్రహాలను ధ్వంసం చేయడం, అపవిత్ర చర్యలకు పాల్పడటం హిందువులకు తీవ్ర వేదన కలిగిస్తోంది. కొన్ని ఆలయాలు పోలీస్ స్టేషన్లకు అతి సమీపంలోనే ఉన్నా, పదేపదే దాడులకు గురయ్యా యని స్థానికులు చెబుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రతి ఘటన తర్వాత ఉద్రిక్తత, రాస్తారోకోలు, నిరసనలు, అరెస్టులు, రాజకీయ ఆరోపణలు జరుగుతున్నాయి. కొద్ది రోజులకు వాతావరణం చల్లబడుతుంది. కానీ మళ్లీ ఇంకోచోట కొంతకాలానికి అలాంటి సంఘటనే పునరావృత మవుతోంది.

ఈ వ్యవహారంలో అత్యంత వివాదాస్పదమైన అంశం నిందితుల మానసిక స్థితి. చాలా కేసుల్లో పోలీసులు, లేదా నిందితుల కుటుంబసభ్యులు 'మతిస్థిమితం సరిగా లేదు' అని చెబుతున్నారు. ఇది కొన్నిసార్లు వాస్తవం కావచ్చు. మానసిక అనారోగ్యంతో బాధపడేవారిని నేరస్థులుగా కాక, చికిత్స అవసరమైనవారిగా చూడాలనేది చట్టం. మానవతా దృక్పథం చెప్పే మాట కూడా. కానీ, 'ఈ వాదనను వైద్య నివేదికలతో ధ్రువీకరించి, పారదర్శకంగా ప్రజల ముందుంచుతున్నారా? లేక ప్రాథమిక దశలోనే దర్యాప్తును ఆ దిశగా మళ్లిస్తు న్నారా?' అని హిందూ సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. కేసు తీవ్రతను తగ్గించి, లోతైన దర్యాప్తును నీరుగారుస్తున్నారని, వీటి వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ చేయడం లేదని ఆరోపిస్తున్నాయి. కొన్ని ఘటనలు ఉద్దేశపూర్వక దాడులుగా, కొన్ని మానసిక సమస్యల ఫలితంగా, మరికొన్ని కేవలం దొంగతనం కోసం జరిగినవిగా పోలీసులు చెబుతున్నారు. నేపథ్యం ఏదైనా, విశ్వాసాలకు విఘాతం కలిగినప్పుడు చాలాచోట్ల సమగ్ర దర్యాప్తు జరగడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**దాడులకు అడ్డుకట్ట పడదా?**

ప్రధానంగా తాజాగా జరిగిన సంతోషిమాత ఆలయంపై దాడిని 'మత చాందసవాదుల అనాగరిక చర్య'గా భారతీయ జనతాపార్టీ అభివర్ణించింది. రాజధాని సహా రాష్ట్రంలోని దేవాలయాలపై ఈ వరుస దాడుల వెనుక కుట్ర, ఒకే ప్యాటర్న్ కనిపిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ఆరోపించారు. ఆలయాన్ని సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిందితులకు మతిస్థిమితం లేదంటూ పోలీసులు కేసులను పక్కదారి పట్టించడాన్ని సహించబోమని హెచ్చరించారు. అసలు కుట్రదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బుజ్జగింపు రాజకీయాల వల్లే సంఘవిద్రోహ శక్తులు బరితెగిస్తున్నాయని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి 15కు పైగా ఆలయ ధ్వంసం ఘటనలు జరిగాయని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని దేవాలయాలపై, హిందువుల మనోభావాలపై దాడులు పెరిగాయని, బుజ్జగింపు రాజకీయాలు సర్వసాధారణమయ్యాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. దేవాలయాల పరిరక్షణ, శాంతిభద్రతల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సంతోషిమాత ఆలయంపై దాడి అత్యంత దారుణమైనదన్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్, తక్షణ దర్యాప్తు, కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కలిసి కోరారు.

**స్పందించేది కొందరే...**

ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు,భారతీయ జనతాపార్టీ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఇతర హిందూ సంఘాలే బహిరంగంగా స్పందిస్తూ, నిరసనలు చేపడుతున్నాయి, ఘటనా స్థలాలను సందర్శిస్తున్నాయి, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ సహా ఇతర రాజకీయపక్షాల స్పందన అంతంతమాత్రంగానే ఉందని, ఓటు బ్యాంకు రాజకీయాల భయంతో కఠిన చర్యలకు వెనకాడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తానికి దేవాలయాలపై దాడులకు కారణాలు ఏవైనా, ప్రజల విశ్వాసాలు గాయపడుతున్నాయన్నది కాదనలేని వాస్తవం. ఈ అలజడిని చల్లార్చాలంటే ప్రభుత్వం మాటల్లో కాకుండా చర్యల్లో నిబద్ధత చూపాల్సిన అవసరం ఉందన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. పోలీసులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నేతలు రాజకీయాలకతీతంగా స్పందించాలని, లేకపోతే ఇలాంటి ప్రతి సంఘటనా మరో వివాదానికి, మరింత అపనమ్మకానికి దారితీస్తూనే ఉంటుందన్న వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068



# ఏ వెలుగులకీ ప్రస్థానం?

**10**

“రమేష్! మీకు గౌరీ, ధరణిలు తెలుసు కదా? తను తన భర్త సోమన్నని వెతుక్కుంటూ వెళ్లిపోవడంతో నేను ఆమె కూతురు వనజను తెచ్చుకొని ‘ప్రియ’గా పెంచుకున్నాను. ఆ పిల్లే ఈమె” అంటూ ప్రియని చూపించాడు.

“ఆ విషయం నాకు తెలుసు మేస్టారు! మీరు వెళ్లిన తరువాత గౌరి నాకు అన్ని విషయాలూ చెప్పింది. ఔనూ...!ఇప్పుడు మీరు ఎక్కడికి వెళుతునారు?“ అడిగాడు రమేష్.

“ప్రియని చూడాలని ఉందనీ ధరణి ఉత్తరం రాసింది. ప్రియ కూడా వాళ్లమ్మని చూస్తాను అంటోంది. అందుకే ఇక్కడికి వస్తే ధరణి ఉండే ప్రదేశం గురించి గౌరి చెప్పింది” అన్నాడు శ్రీధర్.

ఈ మధ్యన ధరణికి ఒంట్లో బాగులేదని విన్నాను” చెప్పాడు రమేష్.

“రమేష్! సోమన్న ఆచూకీ ఏమైనా తెలిసిందా?”

“అతన్ని అన్నలు ఛత్తీస్‌ఘడ్‌లోని దండ కారణ్యం పంపించేశారని విన్నాను సార్. అతని కోసం పోలీసులు విపరీతంగా వెతుకుతుండటంతో వాళ్లు అక్కడికి పంపేశారని తెలిసింది. భర్త కోసమే ధరణి అన్నల వర్గంలో చేరింది. ఒకసారి వాళ్లతో కలిసిన తరువాత మరి బయటకు రాలేకపోయింది.రెండేళ్ల క్రితం అనారోగ్యం చేయడంతో ఉద్యమ కార్యకలాపాలకు దూరం పెట్టారనీ తెలిసింది.”

“అది సరే రమేష్! ఇందాక దూరంగా కొన్ని పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఏమిటవి?” అంతకు ముందు రామన్నను అడిగినట్లే రమేష్‌ను అడిగాడు ఉత్కంఠతో శ్రీధర్.

“సార్! ఈ ప్రాంతంలో నక్సలైట్లు ప్లీనరీ నిర్వహిస్తున్నారని పోలీసులకు తెలిసింది.దాంతో రెండు వ్యాన్‌లతో ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టారు.పోలీసులు వస్తే వాళ్ల వాహనాలను పేల్చివేయడానికి నక్సలైట్లు మందుపాతరలు పెట్టి ఉంటారు. ఇందాకటి శబ్దాలు మందుపాతర్ల పేలుడుకు సంబంధించినవే. కానీ పోలీసులు ఆ వాహనాల్లో లేరు. ఇప్పుడు రెండు వైపుల నుంచి కాల్పులు జరుగుతున్నాయి. ఆ ఎన్‌కౌంటర్ సమాచారాన్ని కవర్ చేసేందుకే ఇక్కడికి వచ్చాను. ఈ సమస్య రావణ కాష్టంలా రగిలిపోతోంది.దీనికి అంతం ఎప్పుడో? ఎన్నాళ్లో ఈ నరమేధం!” అన్నాడు రమేష్ ఆవేదనగా.

“మీరు చెప్పింది నిజం రమేష్! సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు, నక్సలైట్లు ఆలోచించుకోవాలి. లేకపోతే ఈ రావణ కాష్టం ఆరదు.దీని వల్ల ఎంతో మంది అమాయకులతో పాటు తెలివైన యువతీయువకులు పిట్టల్లా రాలిపోతున్నారు” అన్నాడు శ్రీధర్ బాధగా.

“సార్! జర్నలిస్టుగా పదిహేనేళ్లుగా ఈ గిరిజన ప్రాంతాలను ప్రత్యక్షంగా గమనిస్తూ వస్తున్నాను.



**‘జాగృతి’ నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

ఇక్కడ ఏ విధమైన అభివృద్ధి జరగడం లేదు. ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నా వాటిని అమలు చేయడానికి సరియైన యంత్రాంగం లేదు. నక్సలైట్లకూ, పోలీసులకు మధ్య ఘర్షణతో ఈ ప్రాంతం అభివృద్ధి లోలకంలా ఊగిస లాడుతోంది.

తుపాకీ పట్టుకుంటేనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని నక్సల్స్, తమ బలగంతో శాంతి భద్రతలను అదుపులో పెట్టగలమని పోలీసులు అనుకుం టున్నారు. ఇక్కడ శాంతి గగన కుసుమం అనిపి స్తోంది. మాస్టారూ! పదండి.ఇక్కడికి దగ్గర్లోని ఓ పోలీసు అవుట్ పోస్ట్ వరకూ మీతో వస్తాను. లేక పోతే వాళ్లు మిమ్మల్ని ఇబ్బంది పెట్టవచ్చు”అన్నాడు రమేష్.

ఆ నలుగురూ నడక ప్రారంభించారు.రానురాను ఎండ తీవ్రమౌతోంది. ఎండ పెరుగుతున్న కొద్దీ శ్రీధర్‌కు ఆయాసం ఎక్కువవుతోంది. అడుగులు భారంగా పడుతున్నాయి. శ్రీధర్ నిరాశగా ఆ కొండల వైపు చూస్తూ అడుగులేస్తున్నాడు. అతనిలో బయలుదేరినప్పుడు ఉన్న ఉత్సాహం ఇప్పుడు లేదు.

వాళ్ల అడుగుల చప్పుడు తప్ప ఆ ప్రాంతమంతా నిశ్శబ్దంగా ఉంది. ఇప్పుడు పేలుళ్ల శబ్దం వినిపించటం లేదు.

కొండల్లో రోజూ మరణ మృదంగ ధ్వనులు వినిపిస్తూనే ఉన్నాయి. మారణహోమ విస్ఫోటనాలు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. “ఏ వెలుగులకీ ప్రస్థానం? ఏం సాధిస్తున్నారు ఈ నక్సలైట్లు?ఏం సాధించారు ఈ పోలీసులు?పరిపరి విధాల ఆలోచనలతో నడుస్తున్న శ్రీధర్‌కి, తాను ఎప్పుడో రాసుకున్న కవిత.....



“ఎవ్వరి కోసం..ఎవరు ఎవరితో
సాగుతున్న ఈ మారణ హోమం
అడవితల్లి నుదుట దిద్దిన రక్తపు సిందూరం
అన్యాయాన్ని సహించని శౌర్యం
దౌర్జన్యాన్ని దహించే ధైర్యం?
శాంతి కోసం పోరాడే సైన్యం
ప్రజలను కాపాడే కర్తవ్యం
తుపాకీలు పట్టుకొని
కవాతు చెయ్యాలా?
వీళ్ల సమరం చూస్తున్న
సంఘం శిలలా నిలుచుంటే
నెత్తుటి అడవి సిగలో తురిమిన
అరుణ మందారం
ఈ సంధ్యా సిందూరం” గుర్తుకొచ్చింది.

అరగంట తరువాత వాళ్లు పోలీసు అవుట్ పోస్ట్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ప్రాంతం చదునుగా విశాలంగా ఉంది. అక్కడ రేకులతో రెండు షెడ్డులున్నాయి. అందులో తుపాకులు చేతపట్టిన పోలీసులు పదిమంది వరకు ఉన్నారు.

ఆ నలుగురిని చూసిన పోలీసుల్లో ఇద్దరు వాళ్ల దగ్గరకు వచ్చారు.

రమేష్ ఆ పోలీసులకు నమస్కారం పెట్టి “సార్! నా పేరు రమేష్.పత్రికా విలేఖరిని. వీళ్లు మా ఊరు వాళ్లే. రెబ్బ గ్రామం వెళుతునారు” అంటూ తన ఐడింటిటీ కార్డు వాళ్లకు చూపించాడు.

ఇంతలో అక్కడికి ఇంకో పోలీసు వచ్చాడు. ఆయన్ని చూడగానే రమేష్ “సార్! మీరేంటి ఇక్కడ ఉన్నారు?” అడిగాడు.

అతని పేరు నామ్‌దేవ్.అక్కడ అవుట్ పోస్టులో పనిచేస్తునాడు.

రమేష్‌ని పోల్చుకున్న ఆయన “రమేష్! నువ్వేంటి ఇక్కడికి వచ్చావ్? ఏదైనా విశేషమా?” అడిగాడు.

“అవును సార్! వీరి పేరు శ్రీధర్. పదేళ్ల క్రితం కెంగువ స్కూల్లో టీచరుగా పని చేశారు. అ అమ్మాయిని పెంచుకుంటున్నారు.ఈమె తల్లి రెబ్బ గ్రామంలో అనారోగ్యంతో ఉంది. ఆమెను



గన్నవరపు నరసింహమూర్తి

చూడటానికి వెళుతున్నారు." అని వివరించాడు రమేష్.

"అయినా ఈ సమయంలో ఎందుకు వెళ తునారు? మావాళ్లు వారం రోజుల పాటు ఇక్కడే క్యాంపు చేస్తునారు. నక్సల్స్ చింతపల్లి దళం ప్లీనరీ జరుపు కుంటున్నట్లు మాకు సమాచారం అందడంతో మేమంతా ఇక్కడికొచ్చాము. ఆ దళం వాళ్లు ఇప్పటికే రెండుసార్లు మా వాహనాలను పేల్చి పదిమంది మా పోలీసుల్ని చంపేశారు. ఈ సారి వాళ్లని వదలం" అన్నాడు నామ్‌దేవ్.

"సార్! ఆవిడకి ఒంట్లో బాగుండ లేదు. అందుకే చూడటానికి వెళుతున్నారు. వాళ్లని వెళ్లనివ్వండి. నేనిక్కడే ఉంటాను. అన్నట్లు... ఇందాక ఏదో ఎన్‌కౌంటర్ జరిగినట్లుంది. వివరాలు ఏమిటి సార్?" అడిగాడు అంతకు ముందే తనకు సమాచారం తెలియనట్టు రమేష్.

"ఔను రమేష్! మా వ్యాన్‌ను పేల్చాలనుకున్నారు కానీ మా వాళ్లు తప్పించుకొని ఎదురు కాల్పులకు దిగారు. నలుగురు నక్సల్స్ చనిపోయారు. మిగతా వాళ్లు తప్పించుకున్నారు. అందులో వాళ్ల నాయకుడు గణపతి ఉన్నాడు" చెప్పాడు నామ్‌దేవ్.

"సార్! ఇలా రెండు పక్షాలు పరస్పరం ఘర్షణలకు దిగుతూ, చంపుకుంటుంటే ఈ గొడవకు ముగింపు ఎప్పుడు? దీని వల్ల సాధించేది ఏముంది?" అన్నాడు రమేష్.

"దీనికి ముగింపు ఎన్నడో చెప్పలేం. ఈ పోరాటంలో మా కుటుంబానికి కూడా అన్యాయం జరిగింది. నాలాగే ఎందరో గిరిజన అమాయక బిడ్డలు హింసకు బలయ్యారు" చెప్పాడు నామ్‌దేవ్.

"సార్! మాది కూడా కెంగువ గ్రామమే. విశాఖపట్నంలో డిగ్రీ చదివాను సార్! నాకు ధరణి చెల్లెలు వరస అవుతుంది. అప్పట్లో మా నాన్న నక్సలైట్లకు సాయం చేశాడని పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. రెండు సంవత్సరాల తరువాత విడుదలయ్యాడు. పోలీసులకు తమ గురించి సమాచారం చెప్పాడన్న కోపంతో నక్సలైట్లు మా నాన్నని చంపేశారు. ఆ తరువాత నాకు పోలీసు ఉద్యోగం వచ్చింది. వృత్తిలో భాగంగా నక్సలైట్ల వ్యతిరేక పోరాటంలో భాగస్వామి నయ్యాను. ఈ ఉద్యోగంలో చేరి ఆరేళ్లవుతున్నది. ఈ ఆరేళ్లలో జరిగిన దాడులు, ఎదురుకాల్పుల సంఘటనల్లో కనీసం పాతిక మంది పోలీసులు,యాభయ్ మంది వరకూ నక్సలైట్లూ చనిపోయారు. అయినా ఈ సమస్యకు పరిష్కారం దరిదాపులో కనిపించటం లేదు.

ఒక పోలీసుగా నాకే ఈ పోరాటం నచ్చలేదు. వాళ్లేమో తుపాకీని వదలి కిందకు రారు. మా వాళ్లు అరెస్టులు ఆపరు. రాజకీయ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం ఈ గొడవలకి మరింత ఆజ్యం పోస్తున్నారు" ఆవేదనగా చెప్పాడు నామ్‌దేవ్.

"నామ్‌దేవ్ గారూ! పోలీసులు,నక్సలైట్ల మధ్య గొడవల్లో అమాయక జనం తీవ్రంగా నష్టపోతు న్నారు. ఒక్కొక్కసారి రెండు వైపుల జరిగే సంఘటన లకు అమాయక జనం నష్టపోతున్నారు. గౌరి, ధరణి కుటుంబమే అందుకు ఉదాహరణ. సోమన్నకు నక్సలైట్లతో సంబంధం ఉందని అరెస్ట్ చేసి ఎన్నో హింసలు పెట్టారు. దాంతో అతను భయపడి ఎక్కడికో వెళ్లిపోయాడు. తను నక్సలైట్లలో చేరిపోయా డని చెప్పుకుంటున్నారు. అతన్ని వెతుక్కుంటూ ధరణి కూడా అన్నల్లో కలిసిపోయింది. ఆమె కూతురే ఈ అమ్మాయి" వివరంగా చెప్పాడు శ్రీధర్.

"నక్సలైట్లు తలదాచుకోవడానికి మా ఊళ్లలోకి వస్తుంటారు. కాదంటే వాళ్లకు కోపం. ఆశ్రయం ఇస్తే పోలీసులకు కోపం. దీంతో గిరిజనుల పరిస్థితి అడ్డకత్తెరలో పోకచెక్కలా మారింది. ఈ విషయంలో తప్పొప్పుల సంగతి పక్కన పెడితే... మావాళ్లు చట్టప్రకారం నడవక తప్పదు. పోలీసులకు నక్సలైట్లు శత్రువులు కారు. మేము కేవలం ఉద్యోగులం. శాంతి భద్రతలను కాపాడటం మా బాధ్యత. కానీ వాళ్లు మమ్మల్ని శత్రువులుగా పరిగణిస్తున్నారు. అందుకే వాళ్లు మందుపాతర లాంటివి పేలుస్తూ, మమ్మల్ని లక్ష్యంగా చేసుకోవడం, ప్రతిచర్యగా మేము వాళ్లని ఎన్‌కౌంటర్ చెయ్యడం కొనసాగుతోంది. ఇందులో ఇద్దరిదీ తప్పు ఉంది"అన్నాడు నామ్‌దేవ్.

"సరే! సోమన్న విషయం ఏమిటి? అతన్ని ఎన్‌కౌంటర్ చేశారనీ ప్రచారంలో ఉంది. నిజమేనా?" అని అడిగాడు శ్రీధర్.

"అతడిని మా వాళ్లు ఎన్‌కౌంటర్ చెయ్యలేదు. అతని గురించి వాళ్లే చెప్పగలరు. ధరణి రెబ్బ గ్రామంలో ఉందని తెలుసు. అయినా ఆ విషయాన్ని వెల్లడించలేదు. మీరు వెంటనే ఆ ఊరుకి బయలు దేరండి. ఆలస్యం కావడం మంచిది కాదు. పోలీసుగా నేను ఇలా చెప్పకూడదు కానీ దాని అన్నగా ఒక గిరిజన బిడ్డగా చెప్పకుండా ఉండలేకపోతున్నాను.

"పోలీసుల్లో కూడా ఇంత మంచి వాళ్లు ఉంటారా?" అనుకున్నాడు శ్రీధర్

తిరిగి ఆ నలుగురూ రెబ్బ వైపు బయలుదేరారు.

ఊరు దగ్గర పడుతుండటంతో శ్రీధర్‌లో ఉత్సాహం కలగసాగింది. మనిషికి గమ్యం కనిపించనంత కాలం విసుగ్గా ఉంటుంది. ఒకసారి గమ్యం కనిపిస్తే పయనం జోరందుకుంటుంది

* * *

శ్రీధర్ మనస్సులో ఎన్నో ఆలోచనలు. తానేమిటి ఈ కొండల్లోకి రావడమేమిటి? ఎక్కడో స్కూలు టీచరుగా పనిచేస్తున్న తను ఇలా కొండల్లోకి ఎందుకు రావలసి వచ్చింది? అతనికి జరిగినదంతా కలలా అనిపించసాగింది. కొంత కాలం తరువాత మనిషికి గతం ఆశ్చర్యం కలిగిస్తుందనడానికి తన గతమే ఉదాహరణ అని అనిపించింది శ్రీధర్‌కి.

అన్నీ సవ్యంగా ఉండి, కౌసల్య తల్లి అయితే ఈ రోజు ఇలా రావలసిన అవసరం ఉండేది కాదు. అయితే తనకి పిల్లలు పుట్టి ఉంటే అన్న ఆలోచననే అతను భరించలేకపోయాడు. ఒకవేళ పుట్టి ఉంటే ప్రియని తాము పెంచుకునే వారు కాదు. ప్రియకి తల్లితండ్రులమయ్యే అదృష్టం దక్కేది కాదు. ప్రియ తమ కూతురు కావడం అదృష్టం. ఆమెతో ప్రతీక్షణం తమ దంపతులు ఆనందం అనుభవించాడు

ఎండ తీక్షణంగా తగులుతోంది. రమేష్ ఆలోచనల నుంచి బయటపడ్డాడు. దారి రాను రాను సమతలంగా మారుతోంది. ఇప్పుడు నడుస్తుంటే అలసట కలగటం లేదు. ఒక అరగంట ఓపిగ్గా నడిస్తే గమ్యం చేరుకోవచ్చు. ప్రియకి రామన్న రెబ్బ గ్రామాన్ని చూపించడంతో ఆమె అమ్మని చూడాలన్న ఉత్సాహంతో నడుస్తోంది. గ్రామ పొలిమేరలో గుబురు చెట్లు కనిపించాయి. అది ఒక కొండవాలు ప్రాంతం. అక్కడ నుంచి గ్రామం స్పష్టంగా కనిపిస్తోంది (శేషం)




SURYA
Shaping Structures That Shape Tomorrow
Steel is what turns plans into lasting structures. Surya provides high-quality steel solutions that support construction, infrastructure, and development. Engineered for strength and consistency, they help projects move forward with confidence.
Because the future is built on what holds firm today.
PRAKASH
SURYA
SURYA HAI TOH BHAROSA HAI
Lighting | Wires and Cables | Professional Lighting | Fans | Appliances | Water Pumps | PVC and Water Tanks | Steel Pipes
I am SURYA
50 YEARS OF TRUST
DURABLE PRODUCTS
ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | consumercare@surya.in | www.surya.co.in
TOLL FREE
1800 102 5657

# ఫ్లై దుబాయ్ సంఘటన

**ఫ్లై దుబాయ్ విమానంలో కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కో-పైలట్ హమామ్ అల్-హమామీ దాడి చేయడానికి గల కారణాలపై యూఏఈసౌదీ అరేబియా, ఇజ్రాయెల్ దేశాల భద్రతా సంస్థలు జరుపుతున్న సంయుక్త దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు కో-పైలట్ తీవ్రమైన ఇస్లామిక్ ఉగ్రవాద భావజాలం కలవాడని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. సామాజిక మాధ్యమాల్లోని అతడి పాత ఖాతాలను పరిశీలించగా, ఉగ్రవాద సంస్థ 'అల్-ఖైదా'కు సంబంధించిన అనుమానాస్పద లింకులు, ఫోటోలు లభ్యమయ్యాయి. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ వెళ్తున్న విమానాన్ని గాల్లోనే కూల్చేయాలనే (లేదా ఇజ్రాయెల్‌లోనే పేల్చేయాలనే) కుట్రపన్ని, ఈ దాడికి పాల్పడ్డాడని స్పష్టమైంది. అందుకే కాక్‌పిట్‌లో అత్యవసర సమయాల్లో వాడే క్రాష్ యాక్స్ (గొడ్డలి)తో కెప్టెన్‌పై దాడి చేసి, విమాన నియంత్రణను తన చేతుల్లోకి తీసుకోవడానికి ప్రయత్నించాడు.**

విమానంలో కో-పైలట్ హమామ్ అల్-హమామీ దుశ్చర్యంతో కాక్‌పిట్‌లోకి వచ్చిన ప్రయాణికులు, సిబ్బంది అతడిని పట్టుకుని కట్టేసిన తర్వాత.. 'నన్ను చంపేయండి' (కిల్ మి కిల్ మి)అని గట్టిగా అరవడాన్ని బట్టి అతడు ఆత్మాహుతికి సిద్ధపడే విమానం ఎక్కాడని స్పష్టమవు తోంది. ఈ కో-పైలట్ యూఏఈలో జన్మించి నప్పటికీ తండ్రి ఒమన్ దేశానికి, తల్లి సిరియాకు చెందినవారుగా దర్యాప్తులో తేలింది. అతడి తీవ్రవాద ధోరణ, భద్రతాపరమైన ముప్పును ముందే గుర్తించిన ఒమన్ ఎయిర్ సంస్థ, అతడు విమానాలు నడపకుండా గతంలోనే నిషేధం విధించింది. అయినప్పటికీ అతడు ఫ్లై దుబాయ్‌లో ఎలా చేరాడు? అనుమతి ఎలా లభించిందనే కోణంలో యూఏఈ అటార్నీ జనరల్ లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనను యూఏఈ 'ఉగ్రవాద దాడి యత్నం' గా పరిగణించి పూర్తి స్థాయి దర్యాప్తును వేగవంతం చేసింది.


హమామ్ అల్-హమామీ

**సంచలనం సృష్టించిన ఉదంతం**

సెప్టెంబర్ 30,2026న జరిగిన ఫ్లై దుబాయ్ విమాన ఉదంతం అంతర్జాతీయ విమానయాన రంగంలో పెను సంచలనం సృష్టించింది. భారతీయ పైలట్ సమయస్ఫూర్తి వల్ల ప్రయాణికులందరూ సురక్షితంగా బయట పడ్డారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఫ్లై దుబాయ్ బోయింగ్ 737 మ్యాక్స్ (ఫ్లైట్ ఎఫ్‌జెడ్ 1073) విమానం 174 మంది ప్రయాణికులు (వీరిలో ఎక్కువ మంది ఇజ్రాయెల్ పౌరులు, 27 మంది పిల్లలు ఉన్నారు), సిబ్బందితో బయలుదేరింది. విమానం గాల్లో ఉండగా, ఒమన్‌కు చెందిన కో-పైలట్ హమామ్ అల్-హమామీ ఒక్కసారిగా తీవ్రవాద ధోరణితో (ఆత్మాహుతి మిషన్) విమానాన్ని కూల్చివేయడానికి ప్రణాళిక వేశాడు. కాక్‌పిట్‌లో ఉన్న భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ పై గొడ్డలితో తీవ్రంగా గాయపరిచాడు. దాడి జరిగిన వెంటనే విమానం నియంత్రణ కోల్పోయి, కేవలం 30 సెకన్లలో 33 వేల అడుగుల నుంచి సుమారు 14 వేల అడుగుల కిందకు పడిపోవడం ప్రారంభించింది. కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్ర రక్తస్రావంతో కాక్‌పిట్ ఫ్లోర్‌పై పడిపోయి నప్పటికీ, ప్రాణాలను పణంగా పెట్టి చివరి ప్రయత్నంగా లోపలి నుంచి కాక్‌పిట్ డోర్‌లాక్‌ను తెరవగలిగాడు. ఆ వెంటనే కొందరు ఇజ్రాయెల్ ప్రయాణికులు, క్యాబిన్ సిబ్బంది లోపలికి దూసుకెళ్లి కో-పైలట్‌ను బంధించారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న ఫ్లై దుబాయ్ మరో పైలట్ విమాన నియంత్రణను చేతుల్లోకి తీసుకుని, సౌదీ అరేబియాలోని తబుక్ ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా, సురక్షితంగా ల్యాండ్ చేశారు.

**మోదీ, బెంజమిన్ నెతన్యాహుల స్పందన**

ఈ ఘటనపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా స్పందిస్తూ, భారతీయ పైలట్‌ను 'నిజమైన హీరో'గా అభివర్ణించారు. అలాగే, కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లి, కో పైలట్‌ను అణచివేసిన ఇజ్రాయెల్ ప్రయాణికుడు యానివ్ హయున్‌ను ఆలింగనం చేసుకుని అభినందించారు. ఇది జిహాదీ శక్తుల పనేనని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతీయ పైలట్ సాహసాన్ని ప్రశంసిస్తూ, ఈ ఘోర ముప్పు తప్పడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘటన తర్వాత ఇజ్రాయెల్‌లో కెప్టెన్ స్మిత్ మచ్చర్ పేరు మారుమోగి పోతోంది. 170 మందికి పైగా ఉన్న తమ దేశ పౌరులను (యూదులను) కాపాడినందుకు ఇజ్రాయెల్ మీడియా, ప్రజలు స్మిత్‌ను దేవుడిలా చూస్తున్నారు. లక్షలాది మంది ఇజ్రాయెల్ పౌరులు సోషల్ మీడియా వేదికగా భారతదేశానికి, పైలట్ స్మిత్‌కు ధన్యవాదాలు తెలిపారు. స్మిత్ మచ్చర్‌ను ప్రధాని నరేంద్రమోదీ జాతీయ హీరోగా కొని యాడారు. అక్టోబర్ 2న వీడియో కాల్‌లో మాట్లాడి, అతని ధైర్యసాహసాలను ప్రశంసించారు. 'నీ శౌర్యం, సమయస్ఫూర్తి వందలాది ప్రాణాలను కాపాడాయి. దేశం మొత్తం నీ పట్ల గర్విస్తోంది' అని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'నా కళ్లు మూసుకున్నా విమానానికి ఏం జరుగుతుందో చెప్పగలను' అని స్మిత్ ప్రధాని మోదీకి ఫోన్‌లో చెప్పారు. కో-పైలట్ దాడి చేసిన ఆ భయంకరమైన సమయంలో ధైర్యం కోసం హనుమాన్ చాలీసా పఠించానని మచ్చర్ ప్రధానికి వివరించారు. 'నాకు ఎప్పుడు బాధగా అనిపించినా, కష్టాల్లో ఉన్నా వెంటనే హనుమాన్ చాలీసా పఠిస్తాను. ఆ భగవంతుడే (హనుమంతుడే) నన్ను కాపాడాడని బలంగా నమ్ముతున్నాను' అని స్మిత్ భావోద్వేగానికి లోనయ్యాడు. 'మీరు హనుమాన్‌చాలీసా గురించి


కెప్టెన్ స్మిత్ మచ్చర్

# ఉగ్రదాడి యత్నమే!

చెప్పిన విషయాలు విన్నాక, మీకు ఇలాంటి గొప్ప సంస్కారాన్ని, విలువలను నేర్పించి పెంచినందుకు మీ తల్లి గీతాబెన్ గారికి నేను ప్రణామాలు చేస్తున్నాను" అని మోదీ కొనియాడారు. ఈ సంభాషణలో కెప్టెన్ స్మిత్‌ను ప్రధాని మోదీని తన "అతిపెద్ద రోల్ మోడల్ (ఆదర్శం)"గా అభివర్ణించారు. కెప్టెన్ స్మిత్ సాహసం పట్ల దేశం గర్విస్తోందని భారత పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ప్రకటించారు. చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను యూఏఈ యువరాజు హమ్దాన్




బిన్ మహమ్మద్ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ధైర్యసాహసాలను దుబాయ్ ప్రజల తరపున ప్రశంసించారు. ఈ గాయాలను పెద్ద సమస్యగా చూడట్లేదని, త్వరలోనే పూర్తిగా కోలుకుని మళ్లీ విమానం నడుపుతాను' అని స్మిత్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

**సౌదీ అరేబియా స్పందన**

విమానంలో ఉన్న ఇజ్రాయెల్ వైద్యులు విమానం ల్యాండ్ అయ్యేంత వరకు స్మిత్‌కు ప్రథమ చికిత్స అందించారు. విమానం తమ దేశంలోని తబుక్ ప్రాంతంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యేందుకు సౌదీ అరేబియా అనుమతించింది. స్మిత్‌కు తక్షణమే తమ దేశ ఆసుపత్రిలో అత్యవసర వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడింది. మెరుగైన వైద్యం కోసం యూఏఈ రాజధాని అబుదాబికి తరలించారు. అక్కడ ప్రత్యేక వైద్య బృందం ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించి పర్యవేక్షిస్తోంది. యూఏఈలో భారత రాయబారి డా. దీపక్ మిట్టల్ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి స్మిత్ మచ్చర్‌ను, ఆయన కుటుంబాన్ని కలిశారు.

కాగా,దాడికి పాల్పడిన ఒమన్ జాతీయుడిని సౌదీ అక్కడికక్కడే అరెస్ట్ చేసి విచారించింది. అయితే, పశ్చిమాసియాలో ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, ఈ ఘటనను రాజకీయ వివాదంగా మార్చకుండా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దర్యాప్తు సంస్థలకు నిందితుడిని అప్పగించే ప్రక్రియపైనే సౌదీ దృష్టి పెట్టింది.

**విమానాల భద్రతకు సరికొత్త సవాలు!**

ఈ భద్రతా ఉల్లంఘన నేపథ్యంలోఇజ్రాయెల్‌కు నడిచే తన అన్ని విమాన సర్వీసులను ఫ్లై దుబాయ్ సంస్థ తాత్కాలికంగా రద్దు చేసింది. ఇజ్రాయెల్ అంతర్గత భద్రతా సంస్థ 'షిన్ బెట్' కూడా విమానాశ్రయాల వద్ద భద్రతను అత్యంత కట్టుదిట్టం చేసింది. ఇకపై విదేశాల నుంచి (ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుంచి) ఇజ్రాయెల్‌కు వచ్చే అన్ని విమానాల పైలట్లు, సిబ్బంది గత చరిత్రను అత్యంత కఠినంగా తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఫ్లై దుబాయ్ ఎఫ్‌జెడ్1073 ఘటన అంతర్జాతీయ విమానయాన రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతి పరచింది. 2001 సెప్టెంబర్ 11 (9/11) దాడుల తర్వాత, బయటి వ్యక్తులు లేదా ఉగ్రవాదులు కాక్‌పిట్ లోకి చొరబడకుండా ఉండటానికి "కాక్‌పిట్ డోర్లను లోపలి నుండి గట్టిగా లాక్ చేసే" నిబంధనను తెచ్చారు. అయితే, తాజా ఘటనతో 'ముప్పు బయటి నుంచికాదు.. లోపల ఉన్న పైలట్ నుంచే వస్తే ఎలా?" అనే సరికొత్త సవాలు విమానయాన భద్రతా సంస్థల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా కాక్‌పిట్ భద్రతా నిబంధనల్లో కీలక మార్పులు రానున్నాయి.

నిందితుడు ఓమాన్ కో-పైలట్‌ను గతంలోనే ఒమన్ ఎయిర్ నిషేధించినా, ఫ్లై దుబాయ్ అతడిని చేర్చుకోవడంపై భద్రతా లోపాలను ఎత్తిచూపింది. ఇకపై పైలట్లను ఉద్యోగంలోకి తీసుకునేటప్పుడు, ప్రతి ఏటా వారి రాడికలైజేషన్ (తీవ్రవాద ధోరణులు), సోషల్ మీడియా ప్రవర్తన, ఇంటెలిజెన్స్ నేపథ్యాన్ని మరింత కఠినంగా తనిఖీ చేయనున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఇప్పటికే తమ దేశానికి వచ్చే అన్ని అంతర్జాతీయ విమానాల పైలట్లపై అదనపు భద్రతా తనిఖీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం కాక్‌పిట్ డోర్ లోపలి నుండి లాక్ చేస్తే బయట ఉన్న సిబ్బందికి అత్యవసర కోడ్ తెలిసినా లోపలికి రాలేరు (పైలట్ నిరాకరిస్తే). కాక్‌పిట్ లోపల అపశ్రుతి, లేదా దాడి జరుగుతున్నప్పుడు, బయట ఉన్న సీనియర్ క్యాబిన్ సిబ్బంది ప్రత్యేక బయోమెట్రిక్ లేదా అత్యవసర వ్యవస్థ ద్వారా బలవంతంగా తలుపు తెరిచే ఓవర్‌రైడ్ టెక్నాలజీని ప్రవేశపెట్టడంపై అంతర్జాతీయ నిపుణులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. పైలట్లకు సాధారణంగా జరిగే వైద్య పరీక్షలతో పాటు, వారి మానసిక స్థితి, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం, ఆత్మహత్య సదృశ్య ఆలోచనలను గుర్తించే అంతర్జాతీయ ప్రమాణాల స్క్రీనింగ్ పద్ధతులను తప్పనిసరి చేపట్టనున్నారు. కాక్‌పిట్‌లో ఉండే ఇలాంటి రక్షణ పరికరాలను పైలట్లకు సులభంగా అందుబాటులో లేకుండా, ప్రత్యేక లాకర్లలో భద్రపరిచే విధానాన్ని పరిశీలిస్తున్నారు. విమానంలో ఇద్దరు పైలట్లలో ఒకరు వాష్ రూమ్‌కు వెళ్లినా.. కాక్‌పిట్‌లో తప్పనిసరిగా మరొక క్యాబిన్ క్రూ మెంబర్ ఉండాలనే నిబంధన కొన్ని దేశాల్లో ఉంది. దీనిని అంతర్జాతీయంగా మరింత కఠినతరం చేయనున్నారు.

**రాజకీయ రగడ**

ఈ ఘోర ఉగ్రవాద యత్నాన్ని లేదా ఇజ్రాయెల్ ప్రయాణికులపై జరిగిన దాడిని కాంగ్రెస్ ముఖ్య నేతలు ఖండించకుండా వ్యూహాత్మక మౌనం పాటించడం వెనుక వారి ఓటు బ్యాంకు రాజకీయాలే కారణమని బీజేపీ ప్రతినిధులు విమర్శిస్తున్నారు. దేశానికి గర్వకారణంగా నిలిచిన భారతీయ పైలట్ సమయస్ఫూర్తిని రాహుల్ గాంధీ వంటి అగ్రనేతలు తగిన రీతిలో గుర్తించలేదన్నది వీరి ఆరోపణ.అయితే ఆ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు తోసిపుచ్చారు. ఈ ఘటన జరిగిన వెంటనే తమ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మన పైలట్ స్మిత్ మచ్చర్ సాహసాన్ని, ప్రాణాలు కాపాడిన తీరును అభినందించారని, ఒక కీలక ప్రతినిధి ద్వారా పార్టీ స్పందనను తెలియజేశారని వారు స్పష్టం చేశారు. తీవ్రవాద ముప్పు, విమాన రక్షణ వంటి అంతర్జాతీయ సున్నితమైన అంశాలను, ఒక వ్యక్తి సాహసాన్ని దేశీయ రాజకీయాల కోసం వాడుకోవడం సరికాదని ప్రతిపక్ష మద్దతుదారులు భావిస్తున్నారు.




**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# మొగలులతో పోరాడిన



వీర శిరోమణి మహారాణా ప్రతాప్ భారత దేశానికి చెందిన మహాయోధుడు. సూక్ష్మంగా చూసినప్పుడు రాణా ప్రతాపుడు కూడా త్రేతాయుగపు రాముడు, ద్వాపరయుగంలోని శ్రీకృష్ణుడితో సమానమైన నాయకత్వాన్ని ప్రదర్శించాడు. రాముడు రావణుడితో యుద్ధం చేసేందుకు జనసామాన్యులతో కలిసి భీషణమైన నిరంకుశుడితో పోరాటం చేసి ఎలా విజయం సాధించాడో, అదే తరహాలో ప్రతాపుడు కూడా తన సమయంలో నాటి ఆక్రమణదారుడు, నిరంకుశుడైన అక్బర్‌తో చేసిన యుద్ధంలో మేవాడ్‌కు చెందిన అన్ని వర్గాలను జాగృతం చేసి, జనశక్తిని సైన్యశక్తిగా పరివర్తన చేసి అభూతపూర్వమైన పరిణామాలను పొందాడు. భగవాన్ శ్రీకృష్ణుడు తన బాల్యమిత్రులతో కలిసి కంసుడి వంటి శక్తిమంతుడైన రాజును ఎలా నాశనం చేశాడో, అలాగే ప్రతాపుడు కూడా అహంకారంతో మునిగితేలుతున్న అక్బర్ సైనికులను ఇబ్బందులపాలు చేశాడు.

ప్రతాపుడు బాల్యం నుంచే మహళ్లలో నివసించకుండా కుంభల్‌గఢ్ మొదలుకొని చిత్తోడ్‌గఢ్ సమీపంలో ఉన్న అడవులు, గుహలలో, గ్రామాలు, కొండలలో నివాసం ఉండే భిల్లులు, వివిధ జాతి సమాజాల మిత్రులతో కలిసి సమయాన్ని గడుపుతుండేవాడు. తన తల్లి ప్రేరణతో అతడు కుంభల్‌గఢ్‌లోని పర్వతపాదాలలో నివాసం ఉండే భిల్లు సమాజపు బాలురతో కలిసి వేట మొదలుకొని రాజదర్బారు ఏర్పాటు వరకూ ప్రతి పనిని ఒక ఆటగా చేశారు. ఆ రోజుల్లో ప్రతాపుడి భోజనం కూడా భిల్లు కుటుంబాలలోనే చేసేవాడని, మేవాడ్‌లో ఒకే పళ్లెంలో భోజనం చేసే సంప్రదాయం కూడా ప్రతాపుడీలో వృద్ధి చేసి, పోషించాడని అంటారు. తన కౌమారంలో ప్రతాపుడు మహారాణా ఉదయ్‌సింగ్ ఆదేశాల అనుసారం వాగఢ్, గోడవాఢ్, ఛప్పన్ ప్రాంతాల గెలుపు కోసం చేసిన కృషి, అతని వ్యవస్థాపక నైపుణ్యాలు, సామరస్య పూర్వక ప్రవర్తన, యావత్ సమాజాన్ని కలుపుకొని వెళ్లడం, సామాన్య ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం వంటి వాటి సహాయంతో కూడా సాధ్యమైంది. అప్పటి ప్రభుత్వ వ్యవస్థలోని అలసత్వాన్ని పసిగట్టి చిన్నచిన్న బృందా లుగా ఏర్పడి ప్రజలను దోచుకోవడానికి పాల్పడు తున్న బందిపోట్లతో విసిగిపోయి, వారికి వ్యతిరేకంగా ఆ ప్రాంత ప్రజలు పోరాడారనడానికి ఛప్పన్ యుద్ధం ఒక నిదర్శనం. అప్పటికే విసిగిపోయి, బాధపడుతున్న ప్రజలకు, అటువంటి దోపిడీదారుల నుంచి ముక్తిని కలిగించేందుకు, ఈ యుద్ధాల ద్వారా మేవాడ్ రాజ్యాన్ని స్థిరంగా, బలంగా ఉంచేందుకు ఒక ప్రక్రియను ప్రతాపుడు ప్రారంభించాడు. తన బాల్యంలో ఒకసారి ఆటల్లో రాజదర్బారును ఏర్పాటుచేసి, సమీపంలోని గ్రామాలలోని గ్రామీణులను నరభక్షక చిరుతపులుల నుండి రక్షించడం కోసం, తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా, పదేళ్ల అతి పిన్న వయసులోనే తన స్నేహితులతో కలిసి ఒక చిరుతపులిని చంపడానికి అడవికి వెళ్లి, దానిని చంపి తిరిగి వచ్చాడు. తన ఈ చర్యకు తల్లి జయవంతీబాయి కోపగించుకుంటుందని అతను భయపడినప్పటికీ ఈ సాహసం చేశాడు. కానీ, తల్లి జనహితం కోసం బలిదానం వంటి సంస్కారాలను నేర్పడంతో ప్రతాపుడికి జీవన లక్ష్యం లభించింది.

'మనం యావత్ సమాజాన్ని కలుపుకొని ముందుకు సాగాలి, మాతృభూమి కోసం జీవితంలోని కష్టతరమైన మార్గాన్ని అనుసరించాలి.'

**సామంతులు, సర్దారుల ద్వారా పట్టాభిషేకం**

చిన్నతనంలోని ఇటువంటి సంస్కారాల కారణంగా ప్రతాపుడు యుక్తవయసు వచ్చేసరికి మొత్తం మేవాడ్ ప్రజలకు అత్యంత ప్రియమైనవాడు అయ్యాడు. అందుకే, సా.శ.1572 హోలీనాడు తండ్రి మహారాణా ఉదయ్‌సింగ్ మరణించినప్పుడు, స్మశానంలో స్వయంగా ఉన్నాడు. ఆయన అలా హాజరుకావడాన్ని చూసి నాటి సామంతులు, సర్దారుల మధ్య చర్చ ప్రారంభమైంది. ఎందుకంటే, మేవాడ్‌లో సింహాసనానికి వారసుడు మహారాణా అంత్యక్రియలకు హాజరుకాడు. తర్వాత, తన మరణానికి ముందే ప్రతాపుడి చిన్న తమ్ముడు జగ్‌మాల్‌ను తన ఉత్తరాధికారిగా ఉదయ్ సింగ్ నియమించాడు. కానీ మేవాడ్ ప్రజలు దానిని అంగీకరించలేదు. తక్షణమే రాజు ఇష్టాలను విస్మరించి సామంతులు, సర్దారులు అందరూ సర్వసమ్మతితో ప్రతాపుడిని మేవాడ్ మహారాణాగా ఆమోదించారు. మహాదేవుడి ఆలయం సమీపంలో గల మెట్ల బావి తీరంలో ఆ బావి నీటితోనే ప్రతాపుడికి పట్టాభిషేకం చేశారు. ప్రతాపుడికి గల ప్రజాదరణకు ఇంతకు మించిన ఉదాహరణ ఏముంటుంది? మేవాడ్‌లో ఎవరూ కూడా ప్రతాపుడు కాకుండా మరెవరూ సింహాసనం ఎక్కడాన్ని జీర్ణించుకోలేకపోయారు.

**ప్రతాపుడి భీష్మ ప్రతిజ్ఞ**

పట్టాభిషేకంతో పాటే మహారాణా ప్రతాప్ ఒక తీవ్రమైన నిర్ణయం తీసుకున్నాడు. ఒక భీష్మ ప్రతిజ్ఞ చేశాడు. ఒక కఠోర సంకల్పం తీసుకున్నాడు. కుంభల్‌గఢ్‌లో జరిగిన ఒక భారీ సభ మధ్యలో సమస్త మేవాడ్ ప్రజల మధ్య 'నేను నా మాతృభూమి మేవాడ్‌ను పూర్తిగా స్వతంత్రం చేసేవరకూ మంచంపై నిద్ర పోను, ఈ భూమే నాకు శయ్య అవుతుంది. అలాగే, వెండి, బంగారు పళ్లేల్లో భోజనం చేయను, గొడుగు వేసుకోను' అంటూ తన సంకల్పాన్ని ప్రకటించాడు.

**ప్రతాపుడి సేనల్లో అన్ని వర్గాల వీరులు**

మహారాణా ప్రతాపుడి సేనల్లో రాజపుత్రులు, భిల్లుల మధ్య అపూర్వమైన సమన్వయం జరిగిందన్న విషయం మనందరికీ తెలుసు, కానీ వాస్తవానికి హల్దీఘాటి యుద్ధం మేవాడ్ ప్రజల యుద్ధం. యుద్ధంలో బలిదానం ఇచ్చిన సైనికులు, ఆ తర్వాత మిగిలిన సైనికుల గురించి అధ్యయనం చేసిన తర్వాత అర్థమైందేంటంటే, ప్రతాపుడి సేనలో బ్రాహ్మణులు, ఖటికలు, కంసాలి, కమ్మరి, వైశ్యులు, కాయస్థులు, వాల్మీకులు, చమార్లు, చారణులు, జాట్లు మొదలుకొని ముస్లిం సమాజానికి చెందిన యోధులు కూడా ఉన్నారు. ప్రతాపుడి సేనలలో అతిపెద్ద సంఖ్యలో రాజపుత్ర సేనానాయకులు ఉన్నారు – రాజా రామ్‌షా తావర్, ఝాలాబీదా, రావత్ కిషన్‌దాస్ చుండవత్, మాన్‌సింగ్ అక్షజోత్, డోడియా భీమ్‌సింగ్, నేత్రసింగ్ సారంగ్ దేవోత్, సఖత్ సాంగా వంటి యోధులు ఉన్నారు. రాణా పూజా నేతృత్వంలో చంద్వాల్ బృందంలో భిల్లులు తమ ఉనికిని నమోదు చేసుకుంటున్నారు. పురోహిత్‌గోపీనాథ్ లేదా పురోహిత్ జగన్నాథ్ వంటి బ్రాహ్మణ యోధులు కూడా

# భిన్నవర్గాల యోధులు

ఉండగా, బఛావత్ మెహతా, భామాషా, తారాచంద్ కావడియా వంటి వైశ్య యోధులు తమ ఖడ్గ నైపుణ్యాన్ని శత్రువులపై చూపుతున్నారు. మహసానీ జగన్నాథ్, పంచోలీ లాల్‌దాస్ వంటి కాయస్థ యోధులు భుజం భుజం కలిపి పోరాడేవారు. చారణ్ జైసా, చారణ్ కేశవ్, రామా సందూ, కాన్హా సందూ అన్న చారణ యోధులు కూడా యుద్ధంలో ఉత్సాహంతో పాలుపంచుకున్నారు. పఠాన్ హకీమ్ సూర్, మహమ్మద్ ఖాన్ పఠాన్‌వంటి ముస్లింయోధులు కూడా హృదయపూర్వకంగా ప్రతాపుడి సంఘర్షణలో భాగమయ్యారు. భావూ సునార్, వాగడియా ఖటీక్, నాగరాజ్ లోహార్, రామలాల్ చమార్, జ్వాలా వాల్మీకీ, వైలనోత్ కానజీ బలాయీ వంటి యోధులు శత్రువులను అణచడంలో ప్రతాప్‌తోపాటు ఉన్నారు. అలాగే, పెద్ద సంఖ్యలో భిల్లు సమాజ యోధులు తమ భూమికను నిర్వహించారు. భగోరా వంశానికి చెందిన భిల్లులు సలుంబర్ వంశంతో కలిసి పోరాడారు.

హల్దీఘాటీ యుద్ధంలో ప్రతాపుడు కేవలం మేవాడ్ రాజు మాత్రమే కాదు, ప్రజల స్వాభిమానం, స్వతంత్రత, ప్రజల విశ్వాసానికి ప్రతీకగా ఉన్నాడు. అతడు సమస్త మేవాడ్ ప్రజలలో లోకప్రియుడు అవ్వడమే కాక సంపూర్ణ రాజ్‌పుతాణే, మాల్వా, గుజరాత్ మొదలుకొని దేశంలోని విభిన్న ప్రాంతాలలో కూడా అతడికి ప్రజాదరణ పెరిగింది. ప్రతిచోట నుంచి అతడికి సమర్థన లభించడం మొదలైంది. గ్వాలియర్ నుంచి రాజా రామ్ షా తావర్, ఇందోర్ నుంచి రావ్ నారాయణదాస్, బాగ్ నుంచి ఆసకరణ, మార్వాడ్ నుంచి రావ్ చంద్రసేన్ వంటి వారందరి సంస్థానాల నుంచి అతడికి సమర్థన లభించింది.

చరిత్రకారుడు గౌరీశంకర్ హీరాచంద్ ఓఝా తన ఉదయపూర్ రాజ్య చరిత్రలో , 'ప్రతాపుడు విపత్తులలో కూడా మేవాడ్ స్వాతంత్ర్యాన్ని వదిలిపెట్టలేదు. అందువల్లే ప్రజల హృదయంలో అతడి పట్ల అద్భుతమైన శ్రద్ధ ఉత్పన్నమైంది. ఈ శ్రద్ధ కేవలం భావనాత్మకం కాదు, సంఘర్షణలో ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా దానిని ప్రదర్శించేవారు' అంటూ రాశారు.

కవి శ్యామలదాస్ రచించిన వీర వినోద్‌లో విభిన్న జాతులు, సముదాయాల సేనలు సమ్మిళితమై యుద్ధం చేయడం గురించిన వర్ణన కనిపిస్తుంది. భిల్లుల సమాజంలోని వీరులు ఆరావళిలోని దుర్గమ క్షేత్రాలలో ప్రతాపుడికి రక్షణ కల్పించడం, రహస్య సమాచారం, సామాగ్రిని అందించిన వివరాలున్నాయి. భిల్లుల సర్దారు రాణా పూంజా పేరును అత్యంత గౌరవంతో పిలిచేవారు. ప్రతాపుడు భిల్లులకు ఇచ్చిన గొప్ప గౌరవం, అతడి ప్రజానాయకత్వానికి నిదర్శనం.

ముహణోత్ నైణసీ రచించిన నైణసీ రీ ఖ్యాత్‌లో ప్రతాపుడి పట్ల ప్రజలలో ఉన్న భక్తి శ్రద్ధలను ప్రస్తావిస్తూ, మేవాడ్ ప్రజలు అతడిని కేవలం పాలకుడిగానే కాదు తమ గౌరవచిహ్నంగా భావించేవారు. అక్బర్ వంటి శక్తిమంతుడి ఎదుట కూడా ప్రజలు ప్రతాప్‌ను వదిలిపెట్టలేదు.

డా॥ కె.ఎస్. గుప్తా తన పుస్తకం మహారాణా ప్రతాప్ వ్యక్తిత్వ ఏవం కృతిత్వ అన్న పుస్తకంలో 'ప్రతాపుడి అతిపెద్ద శక్తి అతడి ప్రజలు. మేవాడ్‌కు చెందిన సామాన్య వ్యక్తి కూడా తనను తాను ప్రతాప్ చేస్తున్న యుద్ధంలో భాగస్వామిని అనుకుంటాడు' అంటూ రాశారు.

''ప్రతాప్ దృష్టిలో జెండాలు ఎగురవేయడం, వర్గ భేదాలు ద్వితీయమైనవి; ఆయనకు మాతృభూమి స్వేచ్ఛ మాత్రమే సర్వోన్నతమైనది'' అంటూ, డా॥ చంద్రశేఖర శర్మ తన పుస్తకంలో రాశారు.

'చేతావణీ రా చూంగటియా' వంటి డింగల్ సాహిత్యంలో కూడా ప్రతాపుడి పరంపరను ప్రజలను గౌరవించడానికి ప్రతీకగా చెప్పారు. ''మహారాణా మేవాడ్, హిర్దే బసియా హింద్ రే' (మేవాడ్‌కు చెందిన మహారాణా భారతీయుల మనస్సుల్లో ఉన్నాడు). ప్రతాపుడు చరిత్రలోని ఒక పాత్ర కాదు, భారత ప్రజల చైతన్యంలో పాతుకుపోయిన ఒక ఆదర్శం అని ఈ పంక్తులు పట్టి చూపుతున్నాయి.

చారణ్, భట్ అన్న కవులు తమ గీతాలు, డింగల్ కావ్యాల ద్వారా ప్రతాపుడి శౌర్యాన్ని గ్రామగ్రామానికి వ్యాప్తిచేశారు. 'మాయీ ఎహడా పూత్ జణా, జెహడా రాణా ప్రతాప్' (అమ్మా రాణా ప్రతాప్‌లాంటి కొడుకుని కను) అన్న లోక ప్రసిద్ధ పంక్తులు ప్రతాప్ పట్ల ప్రజల మనస్సుల్లో ఉన్న లోతైన భావాలను వ్యక్తం చేస్తాయి. ప్రతాపుడి సంఘర్షణ ప్రజల ఆధారిత స్వాతంత్ర్య ఆందోళన అని రచయిత శ్రీకృష్ణ జుగ్ను పేర్కొంటారు. ఆయన ప్రకారం, ప్రతాపుడి జీవనం , ఏ సంఘర్షణనైనా కేవలం ఆయుధాలతోనే కాదు ప్రజల విశ్వాసంతో గెలువవచ్చు అనడానికి ప్రమాణమని ఆయన అంటారు.

ప్రతాపుడు మేవాడ్ సామూహిక చేతనకు ప్రతీక అయ్యాడు, ప్రతాపుడు మహలుల వైభావాన్ని వదిలిపెట్టి అడవుల్లో తిరగడాన్ని స్వీకరించాడు. కానీ, పరాధీనతను స్వీకరించలేదు. ఆయన ఈ త్యాగమే అతడిని ప్రజల మనస్సుల్లో అమరుడిని చేసిందని దేవీలాల్ పాలీవాల్ రాశారు.

మహారాణా ప్రతాప్ చరిత్రలో ఒక పాత్ర కాదు, భారతీయ స్వాభిమానానికి శాశ్వత ప్రతీక. అందుకే, నేడు కూడా మేవాడ్‌లో ప్రతి వ్యక్తీ ప్రతాపుడిని తమ వాడనుకుని, శ్రద్ధాభక్తులతో 'రాణా రో నామ్, మేవాడ్ రో మాన్' (రాణా పేరును స్మరిస్తాడు, మేవాడ్ గౌరవాన్ని స్మరిస్తాడు) అంటాడు.

మహారాణా ప్రతాప్‌కున్న ప్రజాదరణ ఆయన యుద్ధ పరాక్రమం కంటే ఆయన ప్రజానాయకుడి స్వభావం వల్లే ఎక్కువగా వచ్చింది. హల్దీఘాటీ యుద్ధం కేవలం రాజులు చేసిన యుద్ధం కాదు, అది మొత్తం సమాజ భాగస్వామ్యంతో పోరాడిన ఒక అద్భుతమైన స్వాతంత్ర్య సంగ్రామం. అందుకే, నేడు కూడా ప్రతాప్ కేవలం చారిత్రిక పుటల్లోనే కాక, ప్రతి ఒక్కరి మనస్సులో సజీవంగా ఉన్నాడు.

**- అనురాగ్ సక్సేనా, ప్రతాప్ గౌరవ కేంద్ర నిర్దేశకులు, ఉదయ్‌పూర్**


భామాషా


చారణ జైసా


చారణ కేశవ్


డొడియా భీంసింగ్


హకీంఖాన్ సూరీ


శాలివాహన్ తంవర్


భవానీసింగ్ తంవర్


ప్రతాపసింగ్ తంవర్


ఝాలా మాన్


ఝాలా మాన్ సింగ్


కళ్యాణ్ పడిహార్




# సర్‌ను

**కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు ఒక ఆంగ్ల దినపత్రికలో వచ్చిన కథనం ఇప్పుడు ప్రతిపక్షాలకు అందివచ్చింది. అయితే కథనంలో వాస్తవమెంతో బయటపడే లోపలే అసత్యాలతో విపక్షాలు వీధుల్లోకి వచ్చాయి. ఇప్పుడు వీటికి కొత్తగా కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) బొద్దింకలు కూడా తోడయ్యాయి. ముగ్గురు కమిషనర్లతో కూడిన ఎన్నికల సంఘం(ఈసీ)లో ప్రతి అంశాన్ని చర్చించిన తర్వాతే నిర్ణయాన్ని ప్రకటిస్తారు. ముగ్గురిలో మెజార్టీ సభ్యులు వ్యతిరేకిస్తే ఆ నిర్ణయం వెలువడదు. ప్రస్తుత సర్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కమార్‌కు ఇద్దరు కమిషనర్‌లు సుక్బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి 14 సార్లు అభ్యంతరాలు చెప్పారని పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారం చేసుకొని, మొత్తం ఎన్నికల వ్యవస్థనే ప్రతిపక్షాలు తప్పు పడుతున్నాయి. ఈ కథనంపై ఎన్నికల సంఘం స్పందించింది. ఉమ్మడి నిర్ణయం మేరకే దేశంలో ఓటర్ల జాబితాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ కొనసాగుతున్నట్టు తెలిపింది. అయినప్పటికీ విపక్షాలు ఉద్దేశపూర్వకంగా అలజడి సృష్టిస్తున్నాయి. ఒకవేళ కథనంలో పేర్కొన్నట్టు అది ఏకపక్ష నిర్ణయమైన పక్షంలో దానితో విభేదించిన వారు ఎందుకు బయటపడటం లేదనేది ప్రతిపక్షాలకే తెలియాలి.**

"ఓటు చోరీ" అనే పదాన్ని రాహుల్ గాంధీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించే ముందు భారత ఎన్నికల సంఘంతో గాంధీ కుటుంబానికి ఉన్న ఘర్షణల చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవడం సముచితం. 1984లో ప్రధానిగా రాజీవ్ గాంధీ బాధ్యతలు చేపట్టాక ఎన్నికల సంఘంలో వివాదాలు మొదలయ్యాయి. ఆయన హయాంలో నాటి ఎన్నికల కమిషనర్ ఆర్.వి.ఎస్. పేరిశాస్త్రిపై ఎన్నికల తేదీల విషయంలో ప్రభుత్వం నుంచి ఒత్తిడి వచ్చినట్లు నాడు పలు నివేదికలు పేర్కొన్నాయి. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడానికి పేరి శాస్త్రి నిరాకరించడంతో అక్టోబర్, 1989లో ఇద్దరు అదనపు ఎన్నికల కమిషనర్లను రాజీవ్‌గాంధీ ప్రభుత్వం నియమించింది. వివాదాలకు శ్రీకారం చుట్టింది. అయితే తర్వాత వచ్చిన వి.పి.సింగ్ ప్రభుత్వం ముగ్గురు కమిషనర్ల స్థానంలో ఒకే కమిషనర్ ఉండేలా పాత నిర్ణయాన్ని పునరుద్ధరించింది. అనంతరం పి.వి.నరసింహారావు నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాజీవ్‌గాంధీ ప్రభుత్వం తరహాలో 1993–95 మధ్యకాలంలో నాటి సీఈసీ టి.ఎన్.శేషన్ అధికారాలను కుదిస్తూ, ఎం.ఎస్.గిల్, జి.వి.జి కృష్ణమూర్తిలను కమిషనర్లుగా నియమించడంతో ముగ్గురి మధ్య తరచూ విభేదాలు బహిర్గతమవడమే కాకుండా న్యాయపోరాటాలు కూడా జరిగాయి. ఇక్కడ మరో విషయమేమిటంటే శేషన్ తన పదవీకాలం ముగిసిన తర్వాత ఒకసారి స్వతంత్ర అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి పోటీ చేశారు. మరోసారి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గాంధీనగర్ నుండి బీజేపీ అగ్రనేత అద్వానీపై పోటీ చేసి ఓడిపోయారు. మరో కమిషనర్ గిల్ అయితే పదవీకాలం ముగిసిన అనంతరం మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా పనిచేశారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషనర్లను కాంగ్రెస్ ఎలా ప్రలోభాలకు గురిచేసింది చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు చాలు. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను బీజేపీ వ్యక్తిగా ప్రచారం చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది. 2009లో సీఈసీ ఎన్. గోపాలస్వామి, ఆయన సహచర కమిషనర్ నవీన్ చావ్లా మధ్య తరచూ వివాదాలు రేగినప్పుడు సీఈసీకి వ్యతిరేకంగా మన్మోహన్‌సింగ్ సర్కారు వ్యవహరించింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో సీఈసీ సునీల్ అరోడా, కమిషనర్ అశోక్ లవాసాల మధ్య విభేదాలు రావడంతో తన పదవికి అశోక్ రాజీనామా చేశారు. భారత ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాలు రావడం ఇది మొదటిసారి కాదు. గతంలోనూ పలుమార్లు వెలుగు చూశాయి. ఒక సంస్థలో ఇలాంటివి సహజమే. అయితే ఇదే తొలిసారి అన్నట్టు, దీనిపై స్వరాజ్య సమరం తరహాలో ఉద్యమించాలని విపక్షాలు పిలుపు ఇవ్వడం హాస్యాస్పదం.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో మరో ఇద్దరు కమిషనర్లు విభేదిస్తున్నారంటూ పూర్తి ఎన్నికల సంఘం వ్యవస్థనే ప్రతిపక్షాలు తప్పు పట్టడం వాటి అవగాహనారాహిత్యానికి నిదర్శనం. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ మరో అడుగు ముందుకేసింది. జ్ఞానేశ్ కుమార్ అండదండలతో సర్‌లో అవకతవకలకు బీజేపీ పాల్పడిందని, తద్వారా 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని కాంగ్రెస్ చెప్పడం విడ్డూరం. 2024లో ఈసీ కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ ఉన్నారు. అనంతరం ఫిబ్రవరి, 2025లో సీఈసీగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2025లో సీఈసీగా ఉన్న జ్ఞానేశ్ కుమార్ 2024 ఎన్నికలను ఎలా ప్రభావితం చేశారనేది కాంగ్రెస్ పార్టీకే తెలియాలి. సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే మరో అడుగు ముందుకేసి, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చొరవతోనే బీజేపీ గెలిచిందని చెప్పారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు 2023లో జరిగాయని, అప్పుడు సీఈసీ రాజీవ్ కుమార్ అని, నాడు ఎన్నికల సంఘంలో జ్ఞానేశ్ కుమార్ లేరనే విషయం తెలియకుండా విమర్శించడం, భారత రాజకీయాల పట్ల దీప్కే అవగాహనా రాహిత్యానికి ప్రత్యక్ష నిదర్శనం.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ భారత ఎన్నికల వ్యవస్థను నీరు గారుస్తున్నారని చెబుతున్న కాంగ్రెస్ సర్‌ను నిలిపేయాలని డిమాండ్ చేస్తోంది. దేశవ్యాప్తంగా 13 కోట్లకుపైగా ఓటర్లను తొలగించారని ఆరోపిస్తోంది. వీరంతా అర్హులైన ఓటర్లే అని వాదిస్తోంది. అయితే ఆ పార్టీ వాస్తవాలను విస్మరిస్తోంది. 2002–2004 తర్వాత దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టలేదు. ఎప్పటికప్పుడు ప్రతి సంవత్సరం ఓటర్లను చేర్చుకోవడం, ఆ సమయంలో ఎవరైనా లేనివారి గురించి సమాచారం ఇస్తే తొలగించడం మాత్రమే చేశారు కానీ ప్రత్యేకంగా కార్యాచరణ చేపట్టలేదు. దీంతో రెండు దశాబ్దాలకుపైగా దేశ ఓటర్ల జాబితాలో పేరుకుపోయిన మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులు, గుర్తించలేని ఓటర్ల వివరాలను సరిచేసే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ నిలిచిపోయింది. ఇలాంటి పేర్లు జాబితాల్లో కొనసాగితే ఒకే వ్యక్తి పేరుతో బహుళ నమోదులు ఉండే అవకాశం ఉంటుంది. మరణించిన వ్యక్తుల పేర్లు కూడా ఎన్నికల




# సంపూర్ణం చేయాలి

జాబితాల్లో ఉండటం వల్ల జాబితా విశ్వసనీయత దెబ్బతినడమే కాకుండా దొంగ ఓట్లకు అవకాశాలుంటాయి. ఓటు లేనివారు ఫారమ్ –6తో కొత్తగా నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ఫారమ్ –6పై గతంలో ఉన్న నిబంధనలను సడలించేందుకు ఈసీ ముందుకు రావడంతో సర్ ప్రక్రియ మరింత సులభంగా మారుతుంది. గతంలో 40 నుండి 60 శాతం ఓట్లు నమోదైన స్థానాల్లో సర్ అనంతరం 90 శాతానికిపైగా ఓటింగ్ నమోదైనట్టు పలు రాష్ట్రాల ఎన్నికల్లో తేలింది. అంటే అనవసరమైన ఓట్లను తొలగించి, అర్హులైన వారినే జాబితాలో ఉంచడంతో ఓటింగ్ శాతం కూడా పెరుగుతోందని స్పష్టమవుతోంది. సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తోంది. 2018లో ఓటర్ల జాబితాల్లో తప్పులు, డూప్లికేట్ పేర్లు, అనర్హుల నమోదుపై కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో అప్పట్లో సుమారు 70 లక్షల తప్పు నమోదులను వారు ప్రస్తావించారు. గతంలో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, కేరళ, తదితర రాష్ట్రాల్లో డూప్లికేట్, నకిలీ ఓటర్ల నమోదుపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. సూటిగా చెప్పాలంటే గతంలో ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని వేలెత్తి చూపిన పార్టీలే ఇప్పుడు వాటిని సరిచేసే ప్రక్రియనే 'ఓటు చోరీ'గా పిలుస్తున్నాయి.తద్వారా అనర్హులైన వారి ఓట్ల తొలగింపునకు అడ్డుపడుతూ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయి. ఇది ఆయా పార్టీల ద్వంద్వ వైఖరికి నిదర్శనం.

ఎన్నికల సంఘం(ఈసీ)లో అంతర్గతంగా అధికారులు లేదా కమిషనర్లు ప్రశ్నలు లేవనెత్తడం సంస్థ వైఫల్యానికి నిదర్శనం కాదు. అది స్పష్టతకు నిదర్శనం. బహుళ సభ్యుల రాజ్యాంగ సంస్థలో చర్చ, పరిశీలన, భిన్నాభిప్రాయాలు సహజమే. ఈసీలో అంతర్గత నోట్స్, పరిశీలనలు, సాంకేతిక సూచనలు నిర్ణయ ప్రక్రియలో సర్వసాధారణం. తుది నిర్ణయాలను ఈసీ సమష్టిగా తీసుకుంటుంది. ఈ నేపథ్యంలోనే ఎలాంటి విభేదాలు లేవని, సర్‌పై నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల సమ్మతితోనే జరిగాయని ఈసీ అధికారికంగా ప్రకటించింది. అయినప్పటికీ ఈసీపై బురదజల్లడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ఈ అంశాన్ని ఉద్దేశపూర్వకంగానే వివాదాస్పదం చేస్తోంది.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అంశాన్ని అడ్డం పెట్టుకొని కుటిల రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ తెర తీసింది. ఆయన అభిశంసనకు తొలుత నిర్ణయించింది. ఇతర పార్టీల మద్దతుకు ప్రయత్నించింది. అయితే పార్లమెంట్‌లో సంఖ్యా బలం లేని తనకు అభిశంసన అసాధ్యమని కాంగ్రెస్ పార్టీకి తెలుసు. సీఈసీని తొలగించడం అంత సులభం కాదని కూడా తెలుసు. అయితే తాను ప్రభుత్వంపై పోరాడుతున్నట్లు కనిపించడానికి ఆ పార్టీ తాయత్రయపడుతోంది. ప్రతిపక్షాలపై పట్టుకు, స్వలాభానికి ప్రయత్నిస్తోంది. అందుకే ఇండీ కూటమి సమావేశంలో సర్ కంటే ఎక్కువగా కూటమికి ఎవరు నాయకత్వం వహించాలనే అంశంపైనే చర్చ జరిగినట్టు వార్తలు కూడా వచ్చాయి. సమావేశంలో అభిశంసన అంశాన్ని ప్రస్తావించకుండా సీఈసీతో పాటు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలపై విపక్ష నేతలు విమర్శలు చేశారు. కాంగ్రెస్ పన్నాగాలను పసిగట్టిన ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ సమావేశానికి రాలేదు. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), డీఎంకే పార్టీలు కూడా ముఖం చాటేశాయి. కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా ఆప్‌కు లబ్ధి చేకూరేలా విడిగా ఉద్యమానికి సీజేపీ సిద్ధమవుతోంది. మొత్తం మీద అసత్యాలతో కూడిన ఈ అంశం ఆధారంగా ప్రతిపక్షాలపై పెత్తనం చెలాయించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే, ఆ పార్టీతో సంబంధం లేకుండా స్వప్రయోజనాలకు ఇతర పార్టీలు ప్రాధాన్యతను ఇస్తున్నాయి. అసత్యాలను మళ్లీ మళ్లీ చెబుతూ, అవే నిజమనేలా కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తుంది. వరుసగా మూడు లోక్ సభ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతున్న కాంగ్రెస్ పార్టీ తన పరాజయాలకు సాకులు వెతుకుతూ ప్రజా తీర్పును అపహాస్యం చేస్తోంది. 2019లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు)పై బురదజల్లిన కాంగ్రెస్ 2024 నుండి 'ఓటు చోరీ' అంటూ, ఇప్పుడు సర్ ప్రక్రియను తప్పుపడుతోంది. ఎన్నికల్లో వరుస పరాజయాలపై ఆత్మవిమర్శ చేసుకోకుండా ఎన్నికల ప్రక్రియనే వేలెత్తి చూపుతోంది. ఈవీఎంలు తీసేసి బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికల నిర్వహణకు డిమాండు చేసే స్థాయికి ఆ పార్టీ దిగజారింది. పరాజయాలు ఎదురైనప్పుడల్లా భిన్న డిమాండ్లతో ఈసీ చేపడుతున్న ఎన్నికల ప్రక్రియను తక్కువ చేస్తూ, వీధులకు ఎక్కుతున్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల తీరు చూస్తుంటే, మరోసారి మోదీ చేతిలో ఓటమి తప్పదనే భయంతో అసలు ఎన్నికలే వద్దు అని ఇవి భవిష్యత్తులో అన్నా ఆశ్చర్యం లేదు.

ఆలస్యమైనా ఒక మంచి పనికి నడుం బిగించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం(ఈసీ) వెనకడుగు వేయకుండా సర్ ప్రక్రియను పూర్తి చేయాలి. ఈసీ కమిషనర్లలో భిన్నాభిప్రాయాలు వచ్చాయనే సాకుతో, ఈ ప్రక్రియకు ముగింపు పలకించేలా కుట్రల పనుతున్న ప్రతిపక్షాల వ్యూహాలు పారకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఈసీ కమిషనర్లు ఏకతాటిపైకి వచ్చి ఆరోపణలు తిప్పికొట్టాలి. ఈసీలో విభేదాలకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ ఇప్పుడు అదే సాకుతో సృష్టిస్తున్న గందరగోళాన్ని ప్రజలు గమనించాలి.

గత అనుభవాల దృష్ట్యా, సమష్టిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, ఎప్పటికప్పుడు అసత్య ఆరోపణలను తిప్పికొడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. అలా కాకుండా సమస్యను కాలానికి వదిలివేసిన పక్షంలో బొద్దింకలు వంటి చీడపురుగులకు అవకాశమిచ్చినట్టవుతుంది. మరోసారి జంతర్ మంతర్ సమస్యను కొనితెచ్చుకున్నట్టు అవుతుంది.

అసత్యమే నిజమనేలా సర్వత్రా వ్యాపించక ముందే, నకిలీ ఓట్లన్నింటినీ తొలగించి, అర్హులైన ఓటర్లతో దేశ ప్రజాస్వామ్యం చల్లగా ఉండా లంటే, అత్యంత అప్రమత్తతో సర్‌ను సంపూర్ణం చేయాల్సిన ఆవశ్యకత అటు ప్రభుత్వానికి, ఇటు ఈసీకి ఎంతైనా ఉంది.

– శ్రీపాద




# రామాయణాన్ని మరువని

పురాతన కాలం నుంచి ఇండోనేషియా భారతదేశంతో మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కళింగప్రాంతాలతో, సముద్రమార్గం ద్వారా సుసంపన్నమైన వ్యాపార సంబంధాలు కలిగి ఉండేది. శాతవాహనులు, కాకతీయుల కాలంలో సముద్ర వ్యాపారం అత్యున్నత స్థాయికి చేరింది. టక్కోలా, కెడా వంటి ఇండోనేషియా ఓడరేవులు నాటి భారతీయ నావికులకు ముఖ్య వాణిజ్య కేంద్రాలుగా ఉండేవి. ఇండోనేషియా భారత్ మధ్య గల వ్యాపార చారిత్రక సంబంధాలను గురించి చరిత్రకారులు, నేతలు 'మా భాషలో సగం సంస్కృతం నుంచే వచ్చిందే, మా పేర్లు అనేకం సంస్కృత పేర్లే, అందుకే ఇంత సాన్నిహిత్యం ఉంది. మేం సహకార నాగరికతను ఆహ్వానిస్తాం' అని అన్నారు.

భౌగోళిక సర్వే ప్రకారం ఇండోనేషియా దేశంలో మొత్తం 17,508 దీవులు ఉన్నాయి. ఇటీవల ఐక్యరాజ్యసమితి ప్రమాణాల ప్రకారం ఇండోనేషియా ప్రభుత్వం అధికారికంగా పేరు పెట్టి నమోదు చేసిన దీవుల సంఖ్య 16,671. వీటిలో ప్రధాన దీవులు సుమత్రా, జావా, బాలి, బోర్నియో (ఇందులో కొంతభాగం ఇండోనేషియా) సులవేసి, న్యూ గినియా, ఇండోనేషియా రాజధాని జకార్తా. ఇది జావాదీవిలో ఉంది కాని అది మునిగిపోతుందని శాస్త్రవేత్తల పరిశీలనలో తేలడంవల్ల రాజధానిని బోర్నియోలోని 'సు సంతారా'కు మారుస్తోంది.

ఈ ఆలయం (ప్రంబన్ త్రిమూర్తి), భారతదేశం –ఇండోనేషియా మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక, నాగరిక సంబంధాలకు ప్రతీకగా నిలుస్తుంది, అంటూ ఇండోనేషియా సాంస్కృతికశాఖ మంత్రి పేర్కొనడం గమనార్హం. పురాతన కాలంలో ఇండోనేషియా, భారతదేశం (ముఖ్యంగా ఆంధ్రా తీరం) మధ్య వర్ధిల్లిన ప్రసిద్ధ సముద్రయాన మార్గాలు, వాటి నావికులు ప్రధానంగా ప్రకృతి శక్తులపై ఎలా ఆధారపడేవారు. కళింగ, సుమత్రా మార్గం, నావికులు విశాఖపట్నం లేదా ఒడిశా తీరం నుండి ప్రయాణం ప్రారంభించి, బంగాళాఖాతం దాటి, అండమాన్ నికోబార్ దీవుల మీదగా ప్రయాణించి సుమత్రా చేరుకొనేవారు.

**కృష్ణా గోదావరి డెల్టా మార్గం:** ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం,ఘంటసాల రేవుల నుండి ప్రయాణించి నేరుగా ఆగ్నేయాసియా దేశాలకు నౌకలు చేరేవి. మలక్కా జలసంధి సుమత్రా, మలేషియా, మధ్య ఉండటమే కాదు, ఇది సరుకు రవాణాకు అత్యంత కీలకమైనది. చైనా, ఇండోనేషియా, భారతను కలిపే ప్రధాన సముద్ర కూడలి. నాటి కాలంలో ఇంజన్లు లేవు కనుక, ఓడలు ప్రయాణించ డానికి గాలి దిశ (రుతు పవనాలు) చాలా ముఖ్యమైనది. ఒక పొడవాటి కర్రకు ఒక పొడవైన గుడ్డను కట్టి నిలబెట్టేవారు. గుడ్డ ఏ దిశగా ఎగురుతుందో దానిని బట్టి ఓడలు బయలుదేరేవి. ఆంధ్రాతీరం నుండి ఇండోనేషియాకు వెళ్ళాలంటే సుమారు 30 నుండి 45 రోజులు పట్టేది. తూర్పు గాలులు వీచేవి, ఓడలను ఇండోనేషియా వైపు నెట్టేవి. తిరుగు ప్రయాణం మే, జూన్ నెలలో వచ్చే నైరుతి రుతుపవనాలు సానుకూలంగా ఉండేవి, పడమట గాలి ఓడలను భారత్ తీరాలకు చేర్చేవి. రుతు పవనాలు దిశ మారడానికి కొన్ని నెలల సమయం పట్టేది. అందువల్ల భారతీయ వ్యాపారులు ఇండోనేషి యాలోని శ్రీ విజయ సామ్రాజ్యంలో (సుమత్రా) రేవులో దాదాపు 5 నుండి 6 నెలలు బస చేయాల్సి వచ్చేది. వీరు ఈ కాలంలో అక్కడ సంస్కృతి, వ్యాపారాలను విస్తరించారు.

నావికులు నాడు ఉపయోగించిన ఓడలను ముఖ్యంగా శాతవాహన రాజులలో చివరి వాడైన యజ్ఞశ్రీ శాతకర్ణి ఓడ గుర్తుగల నాణాలు ఎక్కువగా ముద్రించాడు. దానిలో రెండు స్థంభాలు కలిగిన పెద్ద ఓడల గుర్తులు స్పష్టంగా కన్పిస్తాయి. ఈ నాణాలు దేశీయ వ్యాపారానికేగాక ఇండోనేషియా, రోమ్ వంటి దేశాలతో చేసిన వ్యాపారాలలో కూడా చలామణీలో వుండేవి.

**ఓడల రకాలు**

**ద్వీశృంగ ఓడలు (డబుల్ మాస్టెడ్ షిప్స్):** ఇవి కూడా శాతవాహనులు చేసినవే. ఈ ఓడలు కూడా సుదూర ప్రాంతాలకు, ఇండోనేషియాకు ప్రధానంగా (సుమత్రా జావా) సముద్ర తీర ప్రాంతాలకు సరుకును చేరవేసేవి.

**మధ్యమ ఓడలు:** సాధారణ సముద్రతీర ప్రాంతాలకు (దేశీయంగా) సరుకును చేరవేసేవి.

**సామాన్య ఓడలు:** ఇవి సముద్రం నుండి నదులలోగల పడవలకు సరుకును చేర్చేవి.

శ్రీ విజయరాజ్యంపై చోళరాజైన మొదటి రాజేంద్రుడు 1025 సి.ఇ. ఆగ్నేయ ఆసియాలోని శ్రీ విజయ చక్రవర్తి సంగ్రామ విజయ తుంగవర్మన్‌ను ఓడించి బంధించాడు. దానికి కారణం చైనా–భారత్ మధ్య సిల్క్ రోడ్ వ్యాపార మార్గాలపై, మలక్కా జలసంధిలో వర్తక నౌకలకు పదే పదే అడ్డంకులు సృష్టిస్తు న్నాడు. దీనితో, అండమాన్–నికోబార్ దీవులను కేంద్రంగా చేసుకొని శ్రీ విజయ రాజధాని పాలెం బాంగ్‌ను ముట్టడించాడు. తరువాత పనై మలయూర్, కడారం (నేటి మలేషియా) రేవులను తన ఆధీనంలోనికి తెచ్చుకున్నాడు. ఆ తరువాత శ్రీ విజయరాజు చోళులకు కప్పం కట్టడానికి అంగీక రించాడు. తద్వారా మణిగ్రామం, అయ్యావోలేవంటి తమిళవర్తక సంఘాలు తమ వ్యాపారాన్ని విస్తరించాయి. ఇండోనేషియాను పరిపాలించిన ప్రధాన రాజవంశాలలో (హిందూ) శైలేంద్ర రాజవంశం ప్రముఖమైంది. వీరు ఆంధ్రాలోని శ్రీశైల ప్రాంతానికి చెందినవారని చరిత్రకారుల అభిప్రాయం. తారుమా నగర సామ్రాజ్యం. ఈ వంశంలో జయ సింహవర్మన్ తెలుగురాజుగా గుర్తింపు పొందాడు. మాతరం రాజవంశం, సంజయ రాజవంశం, మజాపాహిత్ సామ్రాజ్యం – వీరు ప్రధాన పాలకులు.



నేడు కూడా అంతర్జాతీయ సరుకు రవాణాకు కూడలిలాంటి మలక్కా జల సంధికి సమీపంలో ఇండోనేషియా వుంది. అక్కడ కొన్నేళ్ళుగా చైనా నౌకాదళ ఉనికి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సముద్ర భద్రతకు సమిష్టిగా పరిశ్రమించడానికి, తీరరక్షక దళాల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఢిల్లీ – జకార్తా అంగీకరించడం డ్రాగాన్ దుస్సాహసాన్ని నిలువరించడానికి తోడ్పడుతుంది.

ప్రాచీన నౌకాయానం గురించి వివరించే అద్భుతమైన విజ్ఞానాన్ని తెలుగులో నౌకాశాస్త్రం లేక

# ఇండోనేషియా



నావ శాస్త్రం అంటారు. వేల సంవత్సరాల క్రితమే భారతీయులు సముద్రాలపై సుదూరప్రాంతాలు ప్రయాణం చేసి ప్రపంచదేశాలతో వాణిజ్యం సాగించారు. ఇంగ్లీషు పదం "నావిగేషన్" సంస్కృత పదం "నౌగతి:" నుండి, అలాగే 'నావీ' అనే పదం నౌ అనే పదం నుండి పుట్టాయి.

ఆధునిక జి.పి.ఎస్. సాంకేతికత లేని రోజుల్లో దిక్కులు కనుగొనే పద్ధతులు (ఎ) నక్షత్రాల పరిశీలన, రాత్రి వేళల్లో ధ్రువ నక్షత్రం (పోల్‌స్టార్), ఇతర నక్షత్ర మండలాలను బట్టి దిక్కులను అక్షాంశాలను గుర్తించేవారు. దీనికోసం "వృత్తశంగ భాగ్' (సెక్స్టాన్ లాంటి పరికరం) ను వాడేవారు. ఆకాశం మేఘావృతమై నక్షత్రాలు కనిపించకపోతే మరో పద్ధతి ''మత్స్య యంత్రం'' వాడారు. దిక్కులు తెలుసుకోవడానికి దీనిని వాడేవారు. చింతపండుతో బాగా తోమిన రాగి పాత్రలో నువ్వుల నూనె పోసి దానిలో అయస్కాంత గుణమున్న ఇనుప చేపను పాత్రలో ఉంచగా అది ఉత్తర – దక్షిణ దిక్కులను చూపేది. వేరే పద్ధతి పక్షులను గాలిలోకి వదిలేవారు. ఆ పక్షులు భూమి ఎటువైపు ఉంటే అటే ఎగిరిపోయేవి (ముఖ్యంగా కాకులను వదిలేవారు). రుతుపవనాల అవగాహన బాగా తెలిసుండాలి. అందుకే భారతీయులకు సింధునాగరికతలోనే (క్రీ॥పూ॥ 2500) లోథాల్ ఓడరేవు కలదు. ఆ సమయంలో రోమ్, ఈజిప్టు, గ్రీసు, ఇండోనేషియా, ఆఫ్రికా వంటి దేశాలతో పెద్ద ఎత్తున నౌకాయానం సాగింది. నాడే సుగంధ ద్రవ్యాలు, వస్త్రాలు, ముత్యాల, రత్నాలను ఓడల ద్వారా ఎగుమతి చేసారు.

ఇండోనేషియాలో వేలకొద్ది దేవాలయాలున్నాయి. వీటిని "పురా" అని పిలుస్తారు. భారతీయ సంస్కృతి పురాణాల ప్రభావంతో క్రీ॥శ॥ 8–10 శతాబ్దం మధ్య నిర్మించిన పురాతన దేవాలయాలు జావా ద్వీపం లోనూ, దాదాపు 90 శాతం హిందువులు నివసించే బాలీ ద్వీపంలోనూ అత్యంత ప్రసిద్ధి చెందాయి. వీటిలో ప్రధానమైనది యోగ్యకర్తా నగరంలో 9వ శతాబ్దానికి చెందిన ప్రంబనన్ హిందూ దేవాలయం, త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు అంకితం చేశారు. యునెస్కో ఈ దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది.

ఈ ఆలయం ఆగ్నేయాసియాలోనే అత్యంత ప్రసిద్ధ, పురాతన హిందూ దేవాలయ సముదాయం. ఈ ఆలయాన్ని క్రీ॥శ॥ 9వ శతాబ్దంలో (క్రీ॥శ॥ 850 ప్రాంతంలో) జావా దీవిని పాలించిన సంజయ్ రాజవంశానికి చెందిన రాజులు నిర్మించారు. ఇది త్రిమూర్తుల ఆలయం ఈ సముదాయం అన్నింటికంటే మధ్యలో ఉండే ప్రధాన ఎత్తైన ఆలయం శివాలయం. స్థానికులు దీనిని "శివగృహ" అని పిలిచేవారు. హిందూ నిర్మాణ శైలి భారత్‌లోని హిందూ దేవాలయ విధానాన్ని అనుకరించారు. దీనిలో వందలాది ఉపాలయాలు ఉండేవి, కాని కాలక్రమేణా సరియైన పోషణ లేక, భూకంపాలు, అనేక ఇతర ప్రకృతి విపత్తుల వలన శిథిలమవ్వగా ప్రస్తుతం ప్రధాన ఆలయాన్ని పునరుద్ధరించారు.

రామాయణ శిల్పాలు ఆలయం లోపల రాతిగోడపై ఉన్నాయి. రామాయణం , కృష్ణలీలలకు సంబంధించిన కథలను ఎంతో అద్భుతంగా చెక్కించారు. సీతాపహరణం, హనుమంతుడు లంకను దహనం చేయడం వంటి ఘట్టాలు ఇక్కడ శిల్పాల రూపంలో కన్పిస్తాయి. ఇండోనేషియాలో రామాయణాన్ని 'కకావిన్ రామాయణ' అని పిలుస్తారు. నేడు ఈ ప్రదర్శనలు ఇండోనేషియన్, జావానీస్ లేదా బాలీస్ భాషల్లో జరుగుతాయి. ప్రధానంగా యోగ్యకర్తలోని ప్రంబనన్ దేవాలయం, బాలి ద్వీపంలో రామాయణ నాటకాలు ప్రదర్శితం అవుతాయి. అలాగే కేకక్ ఫైర్ డాన్స్' బాలిలోని ఉలువతు ఆలయంలోను, వయాంగ్ కులిలో తెలుగు తోలుబొమ్మలాటతో రామాయణం కథ చెప్తుతారు. ఇండోనేషియాలో ప్రతీ వారు రామాయణ కథను వింటారు.

శివాలయంలోని ఉత్తర భాగంలో దుర్గాదేవి విగ్రహాన్ని స్థానికులు "రారా జోంగ్ గ్రాంగ్" (స్లెండర్ వర్జిన్) అని పిలుస్తారు. రారాజోంగ్ గ్రాంగ్ అంటే జావానీయులు భాషలో సన్నని నడుము గల కన్య అని అర్థం. ఈ విగ్రహం వెనుక ఒక రసవత్తరమైన ప్రేమ కథ ఉంది.

బాలి ద్వీపంలో ఉన్న అత్యంత పవిత్రమైన అతి పెద్ద, ముఖ్యమైన హిందూ దేవాలయ సముదాయం, అగుంగ్ పర్వతంలో  గల గుడి సముదాయము. ఇక్కడ 86 కంటే ఎక్కువ విడి ఆలయాలు ఉన్నాయి. దీనిని స్థానికంగా "మదర్ టెంపుల్ ఆఫ్ బాలి" అని పిలుస్తారు. వీటిలో "పురా పెనతారన్ అగుంగ్" అనేది అతి పెద్ద ఆలయం. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం బాలి హిందువుల ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రం. 1963లో అగ్ని పర్వత విస్ఫోట నంతో లావా ప్రవహించి బాగా పాడైంది.

ఇండోనేషియాతో వ్యాపారం చేయాలంటే వ్యూహాత్మక మలక్కా, సుండా జలసంధిల గురించి తెలియాలి. మలక్కా, సుండా జల సంధులు ప్రపంచ కూడలి. భారతదేశం, చైనా, అరేబియా, రోమ్ దేశాలతో వ్యాపారం చేసే వారంతా మలక్కా జలసంధిని దాటాలి.

తెలుగు వ్యాపారస్తులు సుమత్రాలోని పాలెంబాగ్ శ్రీ విజయ సామ్రాజ్య రాజధానిగా, ప్రధాన ఓడరేవుతో వ్యాపారం చేసేవారు. ఘంటసాల, మోటుపల్లి రేవుల నుండి బయలుదేరిన ఓడలను పాలెంబాగ్ ఓడరేవులో నిలిపి సరుకు అమ్ముకునే వారు. శ్రీ విజయరాజు ఓడ దొంగల నుండి రక్షణ కల్పించి పన్ను వసూలు చేసేవాడు. భారతదేశం నుండి ఏనుగు దంతాలు, రంగురంగుల వస్త్రాలు తీసుకువెళ్ళేవారు. చైనా నుండి పట్టు, పింగాణి పాత్రలను తీసుకు వెళ్ళేవారు. సుగంధ ద్రవ్యాలతో వస్తు మార్పిడీ విధానంలో వ్యాపారం జరిగేది. వాతావరణం అనుకూలించకపోతే పాలెం బాగ్ రేవులోనే విడిది చేసేవారు.

శ్రీ విజయ కేవలం వ్యాపారం కేంద్రంగానేగాక గొప్ప విద్యాకేంద్రంగా కూడా విలసిల్లింది. "మువారోజింబి"లోని బౌద్ధ విద్యా కేంద్రంలో చైనా యాత్రికుడు ఇత్సింగ్ నలందా విశ్వవిద్యాలయంలో చేరే ముందు చాలాకాలం ఇక్కడ సంస్కృతం నేర్చుకున్నాడు. బోరోబుదూర్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద బౌద్ధ ఆలయం ఉంది. వైశాఖ పౌర్ణమిరోజు వేడుకలు జరుగుతాయి. ప్రపంచం నలుమూలల నుండి దీన్ని చూడ్డానికి భక్తులు వస్తారు. ఇంతకీ ఇండోనేషియా ముస్లిం దేశం. ఇండోనేషియా జాతీయ నినాదం "భిన్నేక తుంగల్ ఇల్" అంటే భిన్నత్వంలో ఏకత్వమని నేటికీ ఇండోనేషియాలో కన్పిస్తుంది.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు



# కృత్రిమ మేధ వి

కృత్రిమ మేధ(ఏఐ) నైతిక విలువలు నేర్పదని, అది కేవలం గురువుతోనే సాధ్యమని, గురు పరంపరను గౌరవించుకోవడం మనదేశం అనాదిగా ఆచరిస్తున్న సత్ సంప్రదాయమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) సహ సర్కార్యవాహ సీఆర్ ముకుంద అన్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం), శైక్షిక్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన 11వ శిక్షాభూషణ్ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) మాజీ ఛైర్మన్ ప్రొ. ఎం.జగదీశ్ కుమార్, ఐఐఎం, బెంగళూరు విశ్రాంత ప్రొఫెసర్, డీన్ బి.మహదేవన్, విజ్ఞాన విహార విద్యా సంస్థలు, గుడిలోవ, వైజాగ్ మాజీ ప్రిన్సిపల్ డి.రామకృష్ణారావు లకు శిక్షాభూషణ్ పురస్కారాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామీ అందించారు. ఈ సందర్భంగా ముకుంద ప్రసంగిస్తూ అనాదిగా భారతీయ విద్యావ్యవస్థ వేళ్లూనుకున్న గురు పరంపరను మనం గౌరవిస్తున్నాం. ఆ క్రమంలోనే ముగ్గురు గురువులను నేడు పురస్కారాలతో సన్మానించుకున్నాం అని అన్నారు. 'ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా ఈ గురుపరంపర మన దేశంలో యుగయుగాలుగా కొనసాగుతూ వస్తున్నది. సంఘ కార్యకర్తలుగా మేము దేశమంతటా పర్యటిస్తుంటాం. ఇప్పటికీ అనేక చోట్ల గురువులు పొందుతున్న మన్నన, మర్యాదలను ప్రత్యక్షంగా చూస్తుంటాం. నేను చెప్పినట్టుగా అది యుగయుగాలుగా కొనసాగుతున్న సంప్రదాయం' అని తెలిపారు. ఇతర రంగాల తరహాలోనే విద్యావ్యవస్థపైన కూడా ఏఐ తన ప్రభావాన్ని చూపుతున్నది. విద్యార్థులు మొబైల్ ఫోన్ ద్వారా చాట్ జీపీటీ లాంటి ఏఐ ఆధారిత సాంకేతికతతో సమస్త సమాచారాన్ని పొందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్తమానంలో గురుపరంపర తన ప్రాధాన్యతను నిలబెట్టుకుంటుందా? అనే ప్రశ్న ఉత్పన్నమైంది. అయితే ఇలా అందివచ్చిన సమాచారం, నైపుణ్యంతో విద్యార్థి జీవనోపాధిని పొందవచ్చు కానీ నైతిక విలువలను సంపాదించుకోలేరు. ఇక్కడే గురువు ప్రాముఖ్యత తెలిసివస్తుంది. విలువలతో కూడిన విద్యను ఏఐ లాంటి సాంకేతికత, మొబైల్ ఫోన్ తదితర అధునాతన పరికరాలు అందించలేవు. ఆ పనిని ఒక్క గురువు మాత్రమే చేయగలరు అని తెలిపారు. ఏఐతో గణితంలో క్లిష్టమైన సమస్యలకు సమాధానాలు పొందవచ్చు. కోడింగ్ చేయవచ్చు. అల్గారిథమ్స్‌కు రూపకల్పన చేయవచ్చు అని అన్నారు. అదే సమయంలో విద్య అనేది ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి లేదా ఒక యంత్రం నుంచి మరొక యంత్రానికి సమాచారాన్ని బదలాయించడం కాదు అనే విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. అది అంతకన్నా అధికమైనది అని చెప్పారు. విద్యా బోధనను ఉన్నత స్థానంలో నిలబెట్టడంలో గురువు కీలకమైన పాత్ర పోషిస్తారు. విద్య, నైపుణ్యాలు, నైతిక విలువలను నేర్చుకోవడంలో విద్యార్థిని గురువు జాగృతపరుస్తారు. జీవిత పరమార్థాన్ని ఎరుకపరుస్తారు. ఇది సమాచారాన్ని, నైపుణ్యాలను సాంకేతికత నుంచి అందిపుచ్చుకోవడంతో వచ్చే జ్ఞానం కాదని తెలిపారు. అధునాతన సాంకేతికత ఆలంబనగా, ఉజ్వలమైన భవిష్యత్తు దిశగా వడివడిగా ముందుకు సాగుతున్న మానవాళికి నైతిక విలువల ఆవశ్యకతను స్పష్టం చేశారు. వెల్లువెత్తుతున్న సాంకేతికతల ప్రవాహాన్ని ఆపడం ఎవరికి సాధ్యం కాదని, ఇలాంటి సమయంలోనే విద్యార్థుల అంతర్ ప్రపంచంలోకి అడుగుపెట్టడం ద్వారా వారిలో నైతిక విలువలను పాదుగొల్పాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

**లక్షణమైన శిష్యులు లేరు**

అనాదిగా లక్షణమైన శిష్యులు దొరకడం దుర్లభంగా ఉండేదని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామీజీ అన్నారు. సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, గురువుగా ఉండటం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఎందుకంటే గురు స్థానంలో ఉన్నవారికి ప్రతి ఒక్కరు నమస్కరిస్తారు. సన్మానిస్తారు. పురస్కారాలు అందజేస్తారు. అందుకనే గురువుగా ఉండాలనే ఆశ అందరిలోనూ ఉంటుంది. అస్త్ర, శస్త్రాలను ప్రయోగించడంలో శ్రీరామచంద్రుడికి గురువుగా విశ్వామిత్ర మహర్షి నిలిచారు. అంతటా గౌరవ, మర్యాదలను అందుకున్నారు. ఆంజనేయస్వామిని కూడా గురువుగా పరిగణించాలి. శ్రీరాముడు, సీతామాతకు మధ్య వారధిగా మారుతి నిలిచారు. సీతామాత యోగక్షేమాల సమాచారాన్ని శ్రీరాముడికి అందించారు. ఇంతటి ఉపకారం చేసిన నిన్ను ఆలింగనం చేసుకోవడం ద్వారా నన్ను నేను నీకు సమర్పించుకుంటున్నాను అని ఆంజనేయుడితో రాముడు అన్నారు. హనుమాన్‌ను గురువుగా భావించారు. తదుపరి అవతారంలో గురువుగా జన్మించాలని శ్రీరామచంద్రుడు ఆకాంక్షించారు. భక్తితో పాటుగా ఆనందాన్ని కలిగించే శ్రీమద్ రామాయణాన్ని అందరికీ చేరవేయడంలో ముఖ్యమైన భూమికను మారుతి పోషించారు. శ్రీరామచంద్రుడు ఆకాంక్షించినట్టుగానే తదుపరి అవతారంలో శ్రీకృష్ణుడుగా జన్మించారు. "కృష్ణం వందే జగద్గురుం" అని అనిపించుకున్నారు. అలా గురువు కావాలనే ఆశ అందరిలోనూ ఉంటుంది. కానీ అలా అనుకునేవారి మాట వినే శిష్యులు కావాలి కదా? గతంలో గురుకులాల్లో గురువుగారి ముందు శిష్యులు కూర్చునేవారు కాదు. గురువు కూర్చుని ఉంటే శిష్యులు నిలబడి ఉండేవారు. కానీ నేడు అలాంటి పరిస్థితి లేదు. శిష్యులు కూర్చుని ఉంటే గురువు నిలబడి పాఠాలు చెబుతున్నారు. ఇది మీ అందరికి(సభలో ఉపాధ్యాయులను ఉద్దేశించి) అనుభవంలోకి వచ్చిన విషయమే. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు ఇదే పరిస్థితి. మనదేశంలో ఇప్పటికీ గురువుల పట్ల కాస్తో కూస్తో గౌరవ,మర్యాదలు ఉన్నాయి. అదే విదేశాల్లో అయితే తరగతి గదిలో గురువు పాఠాలు చెబుతుంటే విద్యార్థులు వారికి తోచిన భంగిమల్లో, గురువు పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా కూర్చొని కనిపిస్తారు. అయినప్పటికీ అదే వాతావరణంలో గురువు పాఠాలు చెప్పాలి. అలాంటి వారిని గురువు సరిచేసే పరిస్థితి విదేశాల్లో ఏ మాత్రమూ లేదు. లక్షణమైన శిష్యుడు దొరకడం చాలా కష్టమైపోయింది. జగద్గురువుగా అవతరించిన శ్రీకృష్ణ భగవానుడ్ని మాకు ఉపదేశం





# లువలు నేర్పదు

చేయండి అని ఒక్కరు కూడా అడగలేదు. చెరసాలలో జన్మించినప్పుడు తల్లిదండ్రులు దేవకీ వసుదేవులు అడగలేదు. గోకులంలోని వారు బాలకృష్ణుని లీలలకు పరమానందభరితులయ్యారే తప్ప ఉపదేశం చేయమని ఆయన్ను అడిగిందిలేదు. ఉజ్జయినిలో సాందీపని గురువు కూడా ఆ పని చేయలేదు అని స్వామీజీ అన్నారు.

**భారతమాత సేవలో**

**15 లక్షల మంది గురువులు**

ఏబీఆర్ఎస్ఎం ప్రస్థానాన్ని సంస్థ అధ్యక్షుడు ప్రొ. నారాయణ్‌లాల్ గుప్తా వివరించారు. దేశవ్యాప్తంగా 15 లక్షల 8 వేల మంది ఉపాధ్యాయులు ఏబీఆర్ఎస్ఎంలో సభ్యులుగా ఉన్నారు. అలాగని ఇదేదో ఉపాధ్యాయులకు మాత్రమే పరిమితమైన సంస్థ కాదు. ఇది జాతి హితానికి ఉద్దేశించిన ఒక పవిత్రమైన సంకల్పం నుంచి ఉద్భవించింది. దేశానికి స్వరాజ్యం సిద్ధించిన తర్వాత అనేక ఉపాధ్యాయ సంఘాలు ఏర్పడ్డాయి. అయితే అవి దురదృష్టవశాత్తూ పాశ్చాత్య భావనలు స్ఫూర్తిగా ఆవిర్భవించాయి. ఎక్కడైతే ఉపాధ్యాయ సంఘాలు కార్మిక సంఘాల తరహాలో వ్యవహరిస్తుంటాయో అలాంటి చోట ఉపాధ్యాయుల పాత్ర కార్మికులు, ఉద్యోగుల పాత్రకు పరిమితమైపోతుంది. ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అనుసరించే అనేక మంది ఉపాధ్యాయులను ఆవేదనకు గురిచేసింది. ఎందుకంటే అనాదిగా భారతీయ సమాజానికి మార్గదర్శకులుగా గురువులు ఒక ఉన్నతమైన స్థానంలో సముచితమైన గౌరవాన్ని పొందుతున్నారు. సమాజానికి నేతృత్వం వహిస్తున్నారు. అలాంటి వారిని కార్మికులు, ఉద్యోగులుగా చూడటం భారతీయ గురు పరంపరకు తగినది కాదు. విద్యా వ్యవస్థలో గురువులకు గౌరవం, విద్యాబోధనలో భారతీయత, దేశ హితం లక్ష్యంగా 1988లో ఏబీఆర్ఎస్ఎం ఆవిర్భవించింది. ప్రస్తుతం ప్రీ ప్రైమరీ పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు దేశవ్యాప్తంగా విద్యారంగంలో ప్రత్యేకించి విద్యాబోధనలో విశేష కృషి చేస్తున్న లక్షలాది ఉపాధ్యాయులు ఏబీఆర్ఎస్ఎంలో సభ్యులుగా ఉన్నారు. భారతమాతకు జై నినాదంతో ముందుకు సాగుతున్నారు అని నారాయణ్‌లాల్ గుప్తా తెలిపారు.

**ఉపాధ్యాయులకు పురస్కార గ్రహీతల సందేశం**

పురస్కార గ్రహీతలలో ఒకరైన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజీసీ) మాజీ ఛైర్మన్ ప్రొ.ఎం.జగదీశ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల ఒక విశ్వవిద్యాలయంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు నేను సమాధానాలు ఇచ్చాను. వారు మానవాళిపై కృత్రిమ మేధ(ఏఐ) ఆధిపత్యం, దేశానికి సేవ చేసే దిశగా ఉండవలసిన నైపుణ్యాలు, ప్రశాంతమైన జీవనానికి కావలసిన విలువలు లాంటి అంశాలపై ప్రశ్నలు అడిగారు. ఇవి నవతరం ఆలోచనాధోరణికి అద్దం పడుతున్నాయి. విద్యార్థుల ఆలోచనా ప్రక్రియను రూపుదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైంది. అభివృద్ధి చెందిన భారత్‌కు మూల స్థంభాలుగా యువతీయువకులు నిలుస్తారు అని





తెలిపారు. భారతీయ సమాజానికి ఉపాధ్యా యులు పునాది. ప్రతి ఒక్కరికి గోత్రం ఉంటుంది. గోత్రం అనేది మన గురువును సూచిస్తుంది. మాత, పిత, గురువు అనే వారు ముగ్గురు గురువులుగా సమ సమాజనిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారు. విద్యార్థులకు జీవన విలువల బోధించడం ద్వారా నిజమైన గురువులుగా ఉపాధ్యాయులు కృషి చేయాలి అని ఐఐఎం, బెంగళూరు విశ్రాంత ప్రొఫెసర్, డీన్ బి.మహదేవన్ పిలుపునిచ్చారు. విజ్ఞాన విహార విద్యా సంస్థలు, గుడిలోవ, వైజాగ్ మాజీ ప్రిన్సిపల్ డి. రామకృష్ణారావు ప్రసంగిస్తూ ఉపాధ్యాయ సమాజానికి ప్రతినిధిగా ఈ పురస్కారాన్ని అందుకున్నాను. ఇటీవల ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కి) నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యాను. ఆ కార్యక్రమానికి ఇంగ్లండ్ నుంచి ఒక ఉపాధ్యాయుడు హాజరయ్యారు. మన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) గురించి గొప్పగా మాట్లాడారు. ఎన్ఈపీ ద్వారా యావత్ ప్రపంచానికి మానవీయ విలువలను బోధించే ఒక నవ్యతతో కూడుకున్న భారతీయ విద్యా వ్యవస్థ రూపుదిద్దుకుంటుందని అన్నారు.

ప్రసంగం అనంతరం వేదిక మీద నుంచి ఆయన నేరుగా నా దగ్గరకు వచ్చారు. అయితే విధానం అమలులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనది. అమలు సక్రమంగా జరిగిన పక్షంలో ఆశించిన ఫలితాలను అందుకోవచ్చు అని తెలిపారు. ప్రభుత్వ విధానాన్ని కార్యాచరణకు తీసుకురావడంలో తరగతి నుంచే పాటుపడే మొదటివరుస యోధులుగా ఉపాధ్యాయులు నిలుస్తారు. మన దేశంలో 1.3 కోట్ల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల విద్యలో 95 లక్షల మంది, ప్రీ ప్రైమరీ విద్యలో 14.5 లక్షల మంది, ఉన్నత విద్యలో 18 లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ 1.3 కోట్ల మంది ఉపాధ్యాయులే కనుక ఎన్ఈపీని కార్యాచరణకు తీసుకురావడంలో కంకణబద్ధులైన పక్షంలో వచ్చే మూడు లేదా నాలుగు సంవత్సరాలలో ఆశించిన ఫలితాలను మనం కనులారా చూడవచ్చు అని అన్నారు.

ఏబీఆర్ఎస్ఎం జాతీయ సంస్థాగత కార్యదర్శి మహేంద్ర కపూర్, ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి ప్రొ. గీతా భట్, ఏబీఆర్ఎస్ఎం తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు డా. భాస్కర్, ఏబీఆర్ఎస్ఎం తెలంగాణ కన్వీనర్ డా. ఏలూరి యాదయ్య, ఏబీఆర్ఎస్ఎం తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి డా.జగన్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వి.రాజశేఖర్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

– జాగృతి డెస్క్

# ఒంటరిగా ప్రపంచాన్ని చుట్టేయొచ్చు



**నాలుగు గోడలకే పరిమితం కాకుండా ఆత్మవిశ్వాసంతో ప్రపంచాన్ని చుట్టి రావాలనేది అనేకమంది మహిళల స్వప్నం. కానీ, రక్షణ, భద్రతా సందేహాలు వారిని వెనక్కి తగ్గేలా చేస్తుంటాయి. ఈ భయాలను పటాపంచలు చేస్తూ, మహిళల కోసం ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న ‘ఉమెన్ ఓన్లీ టూర్స్’ ప్రయాణరంగంలో సరికొత్త విప్లవాన్ని తీసుకొస్తున్నాయి.**

ప్రశాంతంగా, సురక్షితంగా ప్రయాణించాలనుకునే మహిళల కోసం దేశవ్యాప్తంగా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సంస్థల నుంచి జాతీయ స్థాయి ట్రావెల్ కంపెనీల వరకు మహిళల భద్రతే ధ్యేయంగా టూర్లను నిర్వహిస్తున్నాయి. ఉమెన్ ఓన్లీ టూర్స్ పేరున ఒంటరి ప్రయాణాలు చేయాలనుకునే మహిళలకు అభయం ఇస్తూ, కొత్త ప్రదేశాలను అన్వేషించాలనే తపన ఉన్నవారికి సరికొత్త మార్గాన్ని చూపిస్తూ కొందరు టూర్ ఆపరేటర్లు ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకువచ్చారు. కేవలం ప్రయాణ ఏర్పాట్లే కాకుండా, పూర్తి భద్రత, సురక్షితమైన వసతి, అనుభవ జ్ఞులైన మహిళా గైడ్‌లు మాత్రమే కాక తోటి ప్రయాణీకులతో అనుబంధాన్ని ఏర్పరిచే ఒక నమ్మకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

రాజస్థాన్ చారిత్రక కోటల నుంచి కేరళ ప్రశాంతమైన బ్యాక్‌వాటర్స్ వరకు, లడఖ్ సాహసవంతమైన పర్వతాల నుంచి ఈశాన్య భారత ప్రకృతి సౌందర్యం వరకు ప్రతీ ప్రయాణాన్ని మహిళల సౌకర్యానికి, అభిరుచులకు అనుగుణంగా ప్రయాణాలను రూపుదిద్దడమే ఈ యాత్రల ముఖ్య ఉద్దేశం. వావ్ క్లబ్, ఎఫ్షైవ్ఎస్కేప్స్, వీగోబాండ్ వంటి ప్రముఖ సంస్థలు మహిళలు స్వేచ్ఛగా విహార యాత్రలు చేసేందుకుప్రత్యేక సౌకర్యాలను అందిస్తున్నారు.

సాహసాలను ఇష్టపడే మహిళల కోసం లడఖ్, స్పితి వ్యాలీవంటి పర్వత ప్రాంతాల టూర్లుఏర్పాటు చేస్తారు. ప్రశాంతమైన బీచ్‌లు, హౌస్‌బోట్ ప్రయాణాలు, ఆయుర్వేద రిసార్ట్‌లు ఇష్టపడే వారి కోసంకేరళ,అండమాన్ వంటి ప్రాంతాలను ఎంచుకుంటారు. తెలుగు మహిళల కోసం కేరళ, లడఖ్, కాశ్మీర్, రాజస్థాన్, గోవా వంటి ప్రదేశాలకు ప్రత్యేక గ్రూప్ టూర్లను హైదరాబాద్ లేడీస్ ట్రావెల్ క్లబ్ నిర్వహిస్తోంది. మహిళా టూరిస్టుల కోసం ప్రత్యేకంగా మహిళా గైడ్‌లు, డ్రైవర్ల సదుపాయంతో సేఫ్ టూర్ ప్యాకేజీలను ‘వోవాయేజ్’ అందిస్తోంది. ఒంటరి మహిళా ప్రయాణికులు, గ్రూపుల కోసం ప్రత్యేక సోలో, అడ్వెంచర్ యాత్రలను వాండరింగ్ ఉమెన్ పేరిట లడకి ఉమెన్ ట్రావెల్ కంపెనీ అందుబాటు లోకి తెస్తోంది. అలాగే వాండర్ ఉమానియా కంపెనీ దేశీయ, అంతర్జాతీయ పర్యటనల కోసం మహిళలకు ప్రత్యేక యాత్రలను తక్కువ బడ్జెట్‌లో అందిస్తాయి.

ఇటువంటి సోలో ప్రయాణాల్లో మహిళలు సులువుగా, సురక్షితంగా, తేలికగా లగేజ్ సర్దుకొనేప్పుడు గుర్తు పెట్టుకొని తమతోపాటు ఉంచుకోవాల్సిన వస్తువులు ముందుగానే లిస్ట్ తయారుచేసుకోవాలి. లగేజ్‌లో ఎమర్జెన్సీ కిట్ ఒకటి తప్పనిసరిగా ఉంచుకోవాలి. కిట్‌లో పెప్పర్ స్ప్రే, పర్సనల్ అలారమ్ కీచైన్, హోటల్ గది తలుపులకు వేసుకునే పోర్టబుల్ లాక్ లేదా ఎమర్జెన్సీ సౌండ్ అలారమ్, చిన్న మెడికల్ కిట్, పెయిన్ కిల్లర్స్, బ్యాండ్–ఎయిడ్స్, యాంటాసిడ్లు, ప్యాడ్స్, టాంపన్లు తోపాటు రోజువారీ మందులు కూడా కిట్‌లో ఉంచుకోవాలి. నైట్ వాకింగ్ లేదా పవర్ కట్ సమయాల్లో ఉపయోగపడే చిన్న టార్చ్, కీలకమైన పత్రాలు, అవసరానికి సరిపడే డబ్బు దగ్గర ఉంచుకోవాలి. అలాగే ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ ఫోటోకాపీలు సర్దుకోవడం మర్చిపోకూడదు. ప్రయాణానికి అవసరమైన డిజిటల్ కాపీలు అన్ని గూగుల్ డ్రైవ్ లేదా ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి.

తక్కువ బట్టలతో ఎక్కువ కాంబినేషన్లు వేసుకునేలా ప్లెయిన్ టీ–షర్టులు, జీన్స్ లేదా కుర్తీలు ప్లాన్ చేసుకోవాలి. ఆలయాల కోసం ప్రత్యేకంగా సంప్రదాయ దుస్తులు ఒక జత పెట్టుకోవాలి. త్వరగా ఆరిపోయే మైక్రోఫైబర్ టవల్స్ లగేజ్ స్పేస్‌ను ఆదా చేస్తాయి. లగేజ్ బరువును 10–12 కేజీలలోపు ఉండేలా చూసుకోవాలి. బ్యాగ్‌ను స్వయంగా సులభంగా మోయగలగడం భద్రత పరంగా ముఖ్యం.

మహిళా సోలో ప్రయాణీకులు హోటల్ లేదా హోమ్‌స్టేను ఎంచుకునేటప్పుడు, బుక్ చేసుకునే ముందు, గదిలో చెక్–ఇన్ అయిన తర్వాత కొన్ని ముఖ్యమైన భద్రతా అంశాలు గమనించాలి. బుకింగ్‌కు ముందు ప్రాంతం, లొకేషన్ గమనించాలి. హోటల్ ప్రధాన రహదారికి లేదా నగర కేంద్రానికి దగ్గరగా ఉందో లేదో చూసుకోవాలి. చీకటిగా, నిర్జనంగా ఉండే సందులు లేదా రాత్రివేళల్లో రాకపోకలు తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉన్న హోటళ్లను నివారించాలి.గూగుల్ మాప్స్ , ట్రిప్ అడ్వైజర్, మాక్ మై ట్రిప్ వంటి యాప్‌లలో ప్రత్యేకంగా సోలో లేదా ఉమెన్ అనే ఫిల్టర్/సెర్చ్ వర్డ్ ఉపయోగించి ఇతర మహిళా ప్రయాణికులు ఇచ్చిన రివ్యూలను చదవడం మర్చిపోవద్దు. సీసీటీవీ, కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిర్ధారించుకోవాలి.

గ్రౌండ్ ఫ్లోర్ లేదా కారిడార్ చివరి మూలన ఉండే రూములను తీసుకోకుండా ఉండటంమంచిది. మొదటి లేదా రెండో అంతస్తులోని గదులు మరింత సురక్షితం. అలాగే లిఫ్ట్ లేదా రిసెప్షన్‌కు సమీపంలో ఉండే గదులను కోరడం మంచిది. ఇంటర్‌కామ్ సదుపాయం చెక్ చేసుకొని అత్యవసర సమయంలో రిసెప్షన్ నంబర్ స్పీడ్ డయల్‌లో ఉందో లేదో చూడండి. హిడెన్ కెమెరాలుఇన్ఫ్రారెడ్ లైట్లను ఉపయోగిస్తాయి. ఇవి ఫోన్ కెమెరాకు కనిపిస్తాయి. ఫోన్ కెమెరా ఆన్‌చేసి, స్క్రీన్ వైపు చూస్తూ, అనుమానం ఉన్న ప్రదేశాల వైపు ఫోన్‌ను తిప్పండి. స్క్రీన్‌పై ఏవైనా తెల్లటి మెరిసే చుక్కలు కనిపిస్తే, అక్కడ కెమెరా ఉండే అవకాశం ఉంది. ఇలాహోటల్ బుకింగ్‌లో జాగ్రత్తలు, హిడెన్ కెమెరాల తనిఖీ, అత్యవసర కిట్ అమర్చుకోవడం లాంటి చిన్నచిన్న అంశాలపై అవగాహన ఉంటే సోలో ప్రయా ణాలు ఎంతో సులభమవుతాయి. మన భద్రత మన చేతుల్లోనే ఉంచుకుంటూ, తోటి మహిళలతో కొత్త స్నేహబంధాలను బలపరుచుకుంటూ సోలో ప్రయాణాన్ని మనసారా ఆస్వాదించవచ్చు.



**జయశ్రీ అచంట**
సీనియర్ జర్నలిస్ట్

# వందే వాల్మీకి కోకిలమ్



**'నానృషిః కురుతే కావ్యం ...'అనే ఆర్యవాక్కుకు ప్రత్యక్షర నిదర్శనం వాల్మీకి మౌని. చతుర్విధ పురుషార్థాలనే స్తంభాలపై శ్రీమద్రామాయణ కావ్యసౌధాన్ని నిర్మించి, ఆదర్శపురుషుడి ఆవిష్కరణతో విశ్వమానవునికి సన్మార్గం చూపిన క్రాంతిదర్శి. మనిషి మనుగడ ఎలా సాగాలి? ప్రకృతిని, పరిస్థితులను ఎలా సద్వినియోగం చేసుకోవాలి? జీవితపథంలో ఎదురయ్యే అవరోధాలను దృఢచిత్తంతో ఎలా అధిగమించాలి? భారతీయ సమాజంలో ఆదర్శకుటుంబ సంబంధ బాంధవ్యాలు ఎలా ఉంటాయి?ఎలా ఉండాలి? లాంటి అనేకానేక అంశాలను ఈ కావ్యం ద్వారా లోకానికి వివరించారు.దర్శనం,వర్ణనం కలవాడే నిజమైన కవి, రుషి. వాల్మీకి అక్షరాల ఆ కోవకు చెందినవాడు.**

సమాజం ఆధ్యాత్మికంగా, భౌతికంగా సాధించిన వికాసం తరతరాల వారికి అందాలంటే కుటుంబ జీవన స్వరూప స్వభావాలు స్పష్టంగా,ఒక ప్రమాణంగా నిలవాలి. శ్రీరాముడికి పూర్వం గల ఆరు అవతారాలను పురాణ యుగానికి పరిమితం చేసి, ఆయనతో ప్రారంభమయ్యే అవతారాలను చారిత్రకమైనవిగా చిత్రీకరించి జగద్ధితం కోసం పాటుపడేలా ఒక ప్రబోధాత్మక ప్రక్రియ చేపట్టవలసిన ఆవశ్యకతను రుషులు ముందే గ్రహించారు.

శ్రీమద్రామాయణం కర్త వాల్మీకి రుషి కారణజన్ముడని విశ్వాసం. వల్మీకం (పుట్ట)ను ఛేదించుకొని బయటికి రావడం వల్ల 'వాల్మీకి'గా లోక ప్రసిద్ధుడయ్యాడు.ఆయన జన్మవృత్తాంతం గురించి అనేక గాథలు ఉన్నాయి. ఆయన బ్రహ్మ వంశంలో పుట్టినట్లు స్కంద పురాణం పేర్కొంటోంది. కృణుడు అనే గంధర్వునికి, నిలూచి అనే నాగకన్యకు పుట్టినవాడని, అడవిలో ఒక పొదలో దొరికితే నిషాదులు (బోయవారు) పెంచి పెద్ద చేశారని కథనం ఉంది. ఆయనకు రత్నాకరుడు, రుక్షుడు అనే పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. కృతయుగంలో దుష్టసాంగత్యంతో హింసకు పాల్పడుతున్న అగ్నిశర్మ అనే విప్రకుమారుడికి అత్రి మహర్షి హితోపదేశం చేయగా, అతను ఒక చెట్టు కింద పదమూడేళ్ల పాటు కఠోర దీక్షలో నిమగ్నమయ్యాడు.అటుగా తిరిగి వస్తున్న అత్రిమహర్షి అతని చుట్టూ పుట్ట (వల్మీకం)ను తొలగించి, 'ఇక మీదట వాల్మీకి పేరుతో లోక ప్రసిద్ధుడవు అవుతావని ఆశీర్వదించాడని కథనం. తాను ప్రాచేతసుడి పదవ పుత్రుడనని శ్రీరాముడితో వాల్మీకి అన్నట్లు ఉత్తరకాండ (98వ సర్గ, 19వ శ్లోకం) చెబుతోంది.

ఒకనాడు వాల్మీకి తన శిష్యుడు భరద్వాజతో తమసా నదీతీరంలో సంచరిస్తుండగా..అనురాగ రసాస్వాదనలో ఉన్న క్రౌంచపక్షుల జంటలో మగపక్షిని ఓ వేటగాడు బాణంతో కొట్టడం,అది నేల కొరిగి గిలగిలకొట్టుకోవడం, ఆడపక్షి ఆక్రందనతో మౌని హృదయం కరుణార్ద్ర మైంది.అలా..ఆయనకు కలిగిన శోకం శ్లోకరూపం దాల్చింది. 'ఓ నిషాదుడా! కామమోహితమైన పక్షి జంటలో ఒకదానిని చంపిన నీవు ఎక్కువ కాలం జీవించలేవు (మానిషాద ప్రతిష్ఠాంత్వం ఆగమః శాశ్వతీస్సమా:/యత్ క్రౌంచ మిథునాదేకమ్ అవధీః కామ మోహితమ్') అని శపించాడు. ఆ శ్లోకం జనావళిని తరింపచేసే మహాకావ్యానికి, బీజం వేసింది.

**'జాతే జగతి వాల్మీకౌ కవి రిత్యభిధా భవత్**
**కవీ ఇతి తతో వ్యాసే కవయ స్త్వయి దండినే'**

...వాల్మీకి అవతరించాక 'కవిః'అనే ఏకవచనం, వ్యాసుడిని కలిపితే 'కవీ'అనే ద్వివచనం, దండీ మున్నగువారి వల్ల 'కవయః'అనే బహువచనం వచ్చింది. 'మధుమయిఫణితీనాం మార్గదర్శీ మహర్షి' (మధుర శబ్దాలకు మార్గదర్శిగా నిలిచిన మహర్షి) అని భోజరాజు శ్లాఘించారు.

బ్రహ్మదేవుడి ఆదేశం, నారద మహర్షి ప్రోత్సాహంతో కావ్యరచనకుసిద్ధమైన వాల్మీకి, తన కావ్యనాయకుడి పాత్రకు తగిన ఉన్నత వ్యక్తిత్వం, అసాధారణ లక్షణాలు గల వారు ఉన్నారా? ('కోన్వస్మిన్ సాంప్రతంలోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్, ధర్మజ్ఞశ్చ, కృతజ్ఞశ్చ, సత్యవాక్యో దృఢవ్రతః?') మనసులో సందేహాన్ని వెల్లడించాడు. అలాంటి సద్గుణాలన్నీ ఒక వ్యక్తిలో మూర్తీభవించడం కష్టతరమే నని, అయినా ఇక్ష్వాకు వంశీయుడు రాముడు ఆ శుభలక్షణాలు కలిగి ఉన్నాడంటూ రామకథను క్లుప్తంగా చెప్పాడు నారదుడు. 'శ్రీరాముడి వృత్తాంతం తానికి సంబంధించిన విశేషాలన్నీ సహజంగానే కరతలామలకములు అవుతాయి' అన్న బ్రహ్మ వర ప్రభావంతో కథాంశాలన్నీ ఆ మౌని మనస్సుకు స్పష్టంగా గోచరించాయి. అలా శ్రీమద్రామాయణ కావ్యం రూపుదిద్దుకుంది.గాయత్రీ మంత్రంలోని ఒక్కొక్క అక్షరానికి వెయ్యి శ్లోకాల వంతున 24 వేల శ్లోకాలను రచించాడు.

**'వృత్తం రామస్య వాల్మీకేః సుకృతిః కిన్నర స్వరౌ!**
**కింతత్? యేన మనోహర్తుమ్! అలంస్వాతాం**
**న శృణ్వతామ్!!** (చరిత్రా! శ్రీరామునిది. రచనా! వాల్మీకిది. గానము చేసేవారా! కిన్నర కంఠస్వరులైన లవకుశులు. ఇక ఇందులో శ్రోతల మనసులను అలరించని అంశం ఏముంది?) అని మహాకవి కాళిదాసు రామాయణాన్ని శ్లాఘించాడు.

'భారతదేశం వాల్మీకి దేశం– రామాయణ దేశం'అని మాక్స్‌ముల్లర్ మహాశయుడు కీర్తించాడు.

భారతీయ భాషలలో భిన్న ప్రక్రియలతో పాటు ప్రపంచంలోని వివిధ భాషల్లోని వందల కొద్దీ రామాయణ గాథలకు వాల్మీకి రామాయణమే మాతృక. రామాయణంపై ఇన్నీ గ్రంథాలు అవసరమా? అన్న ప్రశ్నకు అనేక మంది కవులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. 'రాముని వంటి ధీరోదాత్త నాయకుడు మాకు మరొకరు కనిపించ లేదు. కనుక, ఈ కథనే తిరిగి వెలయించుటలకు రాముని కల్యాణగుణములు దోషం కారణములు కాని మా దోషం కాదు'(యది క్షుణ్ణం పూర్వైః ఇతి జహతి రామస్య చరితమ్/ గుణై రేతావద్భిః జగతి పున రన్యో జయతి కః)అని సంస్కృత కవి మురారి వ్యాఖ్యానించాడు. వ్యక్తి, కుటుంబం, సంఘ ధర్మాలతో త్రివేణి సంగమంలా ఈ మహా కావ్యం తరతరాలుగా మానవజాతిని పునీతం చేస్తోంది. ఈ రసమయ కావ్యంలో ఆధ్యాత్మిక విద్యా రహస్యాలను కూడా అంతర్వాహినిగా ప్రవహింప చేశాడు. ఉత్తమ మానవతా విలువలు కలిగిన దీని మాధుర్యాన్ని ఆస్వాదించిన పాశ్చాత్య పండితులు అనేకులు తలలూపారు. 'ఎన్నిజన్మలకు వాల్మీకి రుణం తీర్చుకోగలం?' అని విశ్వనాథ సత్య నారాయణ శ్లాఘించారు. వాల్మీకి ఈ ఏకైక రచన ఆచంద్రతారార్కం నిలవగలిగే మహా కావ్యం.

**– డాక్టర్ ఆరవల్లి**

# లడఖ్‌లో 28 ప్రదేశాలు




భారత్‌-చైనా వివాదాస్పద సరిహద్దు వెంబడి ఉన్న ప్రాంతాలలోని ప్రదేశాల పేర్లను మార్చడానికి చైనా చెయ్యని ప్రయత్నం లేదు. అటు అరుణాచల్‌ప్రదేశ్‌, ఇటు లడఖ్‌లలో సరిహద్దు వెంట ఉన్న గ్రామాలు తమవంటూ చైనా పేర్లు పెట్టిన, పెట్టేందుకు ప్రయత్నించిన విషయం సర్వవిదితం. ఈ క్రమంలో, లడఖ్‌లో తన ప్రాదేశిక గుర్తింపును నొక్కిచెప్పే చర్యలో భాగంగా, కేంద్రపాలిత ప్రాంతంలోని 28 ప్రదేశాలను, భౌగోళిక స్వరూపాలను భారత అధికారిక పటాలలో కేంద్ర ప్రభుత్వం లాంఛనంగా గుర్తించింది. తన ప్రాదేశిక వాదనలను బలోపేతం చేసుకునే ప్రయత్నంలో, భారత్‌-చైనా సరిహద్దు వెంబడి ఉన్న ప్రాంతాలలోని ప్రదేశాల పేర్లను మార్చే ప్రయత్నాన్ని తిరస్కరిస్తూ భారతప్రభుత్వం ప్రామాణిక పేర్లతో వాటిని గుర్తించింది.

ఈ పేర్లలో లడఖ్‌ అంతటా విస్తరించి ఉన్న శిఖరాలు, పర్వతాలు, కనుమలు, హిమానీనదాలు, లోయలు, నదులు, సరస్సులు, ఇతర భౌగోళిక స్వరూపాలు ఉన్నాయి. పేర్కొన్న శిఖరాలు, పర్వతాలలో అతిషా గిరి, కనిష్క శిఖరం, కరుణ్‌ పిర్‌, మార్తాండ్‌ గిరి, జోరావర్‌ శిఖరం, డ్రాక్‌ కార్పో, రించెన్‌ జాంగ్పో, శాక్యశ్రీ గిరి, మార్పా లత్సవరి, మిలారెపా కాంగ్రి, శివ రి, మహేశ్వర రి ఉన్నాయి.

ఈ జాబితాలో చావ్‌చింగల్‌ కనుమ, షాచ్‌మిర్క్‌ కనుమ, పార్పిక్‌, స్కామి హిమానీనదాలు, షోర్గా లోయ, యాంగ్పా నది కూడా ఉన్నాయి. గురు రింపోచేను ఒక సరస్సుగా గుర్తించగా, అనేక ఇతర ప్రదేశాలను భూభాగాలుగా వర్గీకరించారు. కేంద్రపాలిత ప్రాంత పరిపాలనతో సంప్రదించి ఈ పేర్లను గుర్తించి, వాటి 'ఖచ్చితమైన గుర్తింపు'ను సులభతరం చేయడానికి, ప్రజలలో మరింత అవగాహన కల్పించడానికి లడఖ్‌ సర్వే ఆఫ్‌ ఇండియా మ్యాప్‌లో అధికారికంగా చేర్చినట్లు ప్రభుత్వం తెలిపింది. తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి భారత్‌, చైనాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. చైనా కల్పిత పేర్లను పెట్టడం వల్ల

# సున్నిత సమాచారం లీక్‌: నావీ అధికారి అరెస్టు




తమకిచ్చిన స్వేచ్ఛను, తమకు నచ్చినది చేసే స్వాతంత్ర్యంగా యువత పొరబడకూడదని, జాతి ప్రయోజనాల కోసం పని చేయాలని ఎన్‌ఎస్‌ఎ అజిత్‌ దోవల్‌ చేసిన ఉద్బోధ చాలామంది బుర్రలకు ఎక్కలేదని మరోసారి రుజువైంది. సున్నితమైన రక్షణ సంబంధిత సమాచారాన్ని ఒక పాకిస్తానీ ఏజెంట్‌కు లీక్‌ చేశాడన్న ఆరోపణలపై, భారత నావికాదళానికి చెందిన 31 ఏళ్ల నావికుడిని తమిళనాడులోని కోయంబత్తూరులో అరెస్టు చెశారు. అరెస్టు అయిన నావికుడిని ప్రదీప్‌ ముఖర్జీగా గుర్తించారు. అధికారుల ప్రకారం, ముఖర్జీ విశాఖపట్నంలోని తూర్పు నావికా దళంలో పని చేస్తున్నారు.

కోయంబత్తూరులోని నావికా నాయకత్వ శిక్షణా కేంద్రమైన ఐఎన్‌ఎస్‌ అగ్రానిలో అతడు అరెస్టు అయ్యారు. 2014లో భారత నావికాదళంలో చేరిన పశ్చిమబెంగాల్‌కు చెందిన ముఖర్జీ, సోషల్‌ మీడియా ద్వారా ఒక పాకిస్తానీ మహిళా ఏజెంట్‌ చేత 'హనీట్రాప్‌'కు గురయ్యాడు. గత కొన్ని నెలలుగా వారిద్దరి మధ్య సంభాషణలు జరుగుతున్నాయి.

ఈ సమయంలో ముఖర్జీ, వ్యూహాత్మక నావికా ఆస్తులు, నౌకాదళ కదలికలు, విశాఖపట్నం స్థావరం కార్యాచరణ విధానానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నారు. సరిహద్దు గూఢచర్యం, ఉగ్రవాద బెదిరింపులను ఎదుర్కోవడానికి ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్‌ పోలీసుల ప్రత్యేక విభాగమైన కౌంటర్‌ ఇంటెలిజెన్స్‌ సెల్‌, అతని డిజిటల్‌ జాడలను గుర్తిస్తూ అతనిపై నిఘా ఉంచింది.

పాకిస్తాన్‌ గూఢచార సంస్థ ఐఎస్‌ఐకి సమాచారం లీక్‌ చేసినందుకు మరో భారత నావికాదళ అధికారి, లాన్స్‌ నాయక్‌ ఆదర్శ్‌ కుమార్‌ అలియాస్‌ లక్కీని అరెస్టు చేసిన కొన్ని నెలల తర్వాత ముఖర్జీ అరెస్టు జరిగింది. ఉత్తరప్రదేశ్‌ ఏటీఎస్‌ ప్రకారం, కుమార్‌ సదరన్‌ నావల్‌ కమాండ్‌లో పోస్టింగ్‌పై ఉంటూ ఒక ఐఎస్‌ఐ ఏజెంట్‌తో సంబంధాలు కలిగి ఉన్నాడు. రాష్ట్రంలో ఒక గూఢచర్య నెట్‌వర్క్‌ను ఏటీఎస్‌ ఛేదించిన తర్వాత అతన్ని అరెస్టు చేశారు.భారత్‌కు హాని కలిగించేందుకు ఐఎస్‌ఐ ఎంతో ధనాన్ని వెచ్చించి, ఉగ్రవాదులను ప్రోత్సహిస్తుందని అనేక ఘటనల ద్వారా రుజువైన నేపథ్యంలో, ఇటువంటి సున్నితాంశాలు బయటకు వెళ్తే దేశానికి ఎంత చేటు జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

# అమెరికాలో హిందూ



అమెరికాలో హిందువుల పట్ల అసహనం పెరిగిపోతోంది. అందుకు తార్కాణమే అమెరికాలోని ఒహాయోలోని గ్రేటర్‌ క్లీవ్‌ల్యాండ్‌ ప్రాంతంలో ఉన్న ఒక హిందూ దేవాలయంపై ఇటుకలతో దాడి. ఈ దాడిలో భవనం దెబ్బతిని, కిటికీలు పగిలి పోయాయని అమెరికాకు చెందిన ఒక హిందూ హక్కుల సంఘం తెలిపింది. కోయలేషన్‌ ఆఫ్‌ హిందూస్‌ ఆఫ్‌ నార్త్‌ అమెరికా ప్రకారం, ఇటీవల వద్తల్‌ధామ్‌లోని శ్రీ స్వామినారాయణ హిందూ ఆలయంలో పూజారులు, కొంతమంది భక్తులు ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది.

అయితే, ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా? లేదా అనే విషయాన్ని ఆ సంస్థ వెల్లడించలేదు. ఈ ఘటనను ఖండించాలని, పోలీసు తక్షణ చర్య తీసుకోవాలని ఆ సంస్థ రిచ్‌మండ్‌ హైట్స్‌ మేయర్‌ కిమ్‌ థామస్‌, నగర అధికారులను కోరింది.

హిందూ అమెరికన్‌ ఫౌండేషన్‌ (హెచ్‌ఏఎఫ్‌)

# భారత్‌వే: కేంద్రం

భూభాగం హోదా మారదని పేర్కొంటూ, భారతదేశం ఇటువంటి నామకరణ చర్యలను తిరస్కరించింది.

ఈ తాజా చర్య కేవలం ఒక రాజకీయ ప్రకటన జారీ చేయడం కన్నా భిన్నమైనది. ఎందుకంటే ఈ పేర్లను సర్వే ఆఫ్ ఇండియా అధికారిక పటాల రికార్డులలో పొందుపరుస్తున్నారు. ఈ 28 ప్రదేశాలలో, లడఖ్‌లో జనరల్ జోరావర్ సింగ్ చేసిన సైనిక దండయాత్రలతో ముడిపడి ఉన్న జోరావర్ శిఖరం, పద్మసంభవ అని కూడా పిలిచే బౌద్ధ గురువు గురు రింపోచే వంటి భౌగోళికంగా, సాంస్కృతికంగా ప్రాముఖ్యత కలిగిన పేర్లు ఉన్నాయి. సర్వే ఆఫ్ ఇండియా, అదనపు అంశాలతో కూడిన లడఖ్ నవీకరించిన మ్యాప్‌ను తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

# మందిరంపై దాడి



కూడా ఎక్స్ పై ఒక పోస్ట్‌లో, హిందూ అమెరికన్ సమాజంపై అపూర్వమైన ద్వేషం, కఠోర విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో ఈ ద్వేషపూరిత నేరం జరిగిందని పేర్కొంది. "భారతీయ, హిందూ అమెరికన్ వర్గాలపై విద్వేషపూరిత ప్రసంగాలను మన దేశంలోని ఎన్నికైన నాయకులు, ప్రభుత్వ సంస్థలు బహిరంగంగా, నిస్సందేహంగా ఖండించాలని మేము పిలుపు నిస్తున్నాము," అని అది పేర్కొంది.

"ఇది ఇప్పుడు వాస్తవం. ఆన్‌లైన్ విద్వేషం వాస్తవ దాడిగా రూపాంతరం చెందింది. వీడియోను సమీక్షించి, నిందితుడిని పట్టుకోండి," అని హెచ్ఏఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సుహాగ్ శుక్లా కోరారు. హిందూ హక్కుల పరిరక్షణ సంస్థ గతంలో అమెరికాలోని హిందూ మత ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడులు, విధ్వంసాలను నమోదు చేసింది. వీటిలో ఆగష్టు 2022లో న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో ఉన్న శ్రీ తులసి మందిరంలోని గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం, డిసెంబర్ 2023లో కాలిఫోర్నియాలోని నెవార్క్‌లో ఉన్న ఎస్ఎంవిఎస్ శ్రీ స్వామినారాయణ ఆలయంపై గ్రాఫిటీ వేయడం వంటివి ఉన్నాయి. 2024లో న్యూయార్క్, కాలిఫోర్నియాలోని బీఏపీఎస్ ఆలయాలపై జరిగిన దాడులను కూడా ఇది నివేదించింది. గత సంవత్సరం, కాలిఫోర్నియాలోని చినో హిల్స్‌లో ఉన్న బీఏపీఎస్ ఆలయంపై విద్వేషపూరిత సందేశాలతో దాడి జరిగిందని ఆ పరిరక్షణ సంస్థ తెలిపింది.

# స్మిత్ మచ్చర్‌పై కాంగ్రెస్, ఉదారవాదుల మౌనం



ప్రతిపక్ష కాంగ్రెస్ సహా వామపక్ష, ఉదారవాద వర్గాలు మరోసారి తమ బుద్ధి బయటపెట్టుకున్నాయి. ఒక హిందువు తన ప్రాణాలకు తెగించి 174 మంది ప్రాణాలు కాపాడినా, ఆ సాహసాన్ని ప్రపంచ మంతా కొనియాడుతున్నా వారిలో మాత్రం స్పందన రాలేదు. ఫ్లైదుబాయ్ పైలెట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ విషయంలో ఈ వర్గాలు వ్యవహరిస్తున్న తీరు వారిలోని అమానవీయతను బయటపెడుతున్నది. ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను 'నిజమైన హీరో' అని గౌరవించారు. ప్రధాని మోదీ కూడా కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఒక హీరో అని బహిరంగంగా పేర్కొన్నారు. తీవ్రమైన గాయాలపాలైనప్పటికీ, ఆయన వందలాది ప్రాణాలను కాపాడారు. ముఖ్యంగా, కాంగ్రెస్ పార్టీ మౌనం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమా అనే ప్రశ్న తలెత్తుతోంది. నిరంతరం పాలస్తీనాకు మద్దతుగా నిలుస్తూ, ర్యాలీలు, ప్రకటనలు, సోషల్ మీడియా ద్వారా తమ మద్దతును ప్రియాంక వాద్రా, కాంగ్రెస్ పార్టీ బహిరంగంగా వ్యక్తం చేస్తుంటారు. అయినప్పటికీ, ఒక భారతీయ పైలట్ తాను గాయపడినప్పటికీ174 మంది ప్రాణాలను కాపాడినప్పుడు, వారి సోషల్ మీడియా వేదికలపై దీని గురించి ఒక్క మాట కూడా ప్రస్తావించలేదు. ఒకవేళ కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్థానంలో ఒక ముస్లిం ఈ సాహసాన్ని చేసి ఉంటే, ట్విట్టర్‌లో, విలేకరుల సమావేశాలలో ఇప్పటికీ పెద్ద ఎత్తున చర్చ జరుగుతూ ఉండేది. తమ ముస్లిం ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్ష పార్టీలు మౌనం పాటిస్తున్నాయి ఇది వారి దీర్ఘకాలిక విధానానికి కొనసాగింపు మాత్రమే. వారి దృష్టిలో, ధైర్యసాహసాల కొలమానం అనేది బాధితుడి గుర్తింపు, దాడి చేసిన వ్యక్తి నేపథ్యంపై ఆధారపడి ఉంటుందా? ప్రతి చిన్న విషయంపైనా గంటల తరబడి వీడియోలు చేసేవారు, 174మంది ప్రాణాలు నిలిపిన విషయంపై మాత్రం ఎందుకు మౌనంగా ఉన్నారు? వారి మౌనమే వారి నిజస్వరూపాన్ని తెలియజేస్తుంది.

# మాన్‌గఢ్ ధామ్‌ను జాతీయ స్మారకంగా ప్రకటించాలి



భగత్ ఉద్యమానికి పురిటి గడ్డ అయిన మాన్‌గఢ్ ధామ్‌ను జాతీయ స్మారకంగా ప్రకటించాలని అఖిల భారత వనవాసీ కల్యాణాశ్రమం డిమాండ్ చేసింది. భిల్వారాలో జరుగుతున్న కేంద్ర కార్యకారిణి సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని కూడా ఆమోదించారు. కల్యాణ్ ఆశ్రమం జాతీయ అధ్యక్షుడు సత్యేంద్ర సింగ్ జీ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

వాగడ్ ప్రాంతానికి చెందిన సాధువు గోవింద్ గురు నాయకత్వంలోని 'భగత్ ఉద్యమాన్ని' అణచివేసేందుకు, 1913 నవంబర్ 17న బ్రిటిష్ పాలకులు మంగఢ్ ధామ్ వద్ద జరిపిన పాశవిక కాల్పుల్లో 1,500 మందికి పైగా గిరిజన పురుషులు, మహిళలు, పిల్లలు మరణించారని అందులో పేర్కొన్నారు. జలియన్ వాలాబాగ్ దురంతానికి ఆరు సంవత్సరాల ముందే జరిగిన ఈ ఘటన, స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన సమాజం చేసిన అసమాన త్యాగాలలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. గోవింద్ గురు నాయకత్వంలో సాగిన 'భగత్ ఉద్యమం' బ్రిటిష్ పాలనలోని అణచివేత చట్టాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, గిరిజన సమాజం, సంస్కృతి, విశ్వాసం, మూల విలువలకు నూతన ఉత్తేజాన్ని ఇచ్చిందని కళ్యాణ్ ఆశ్రమం పేర్కొంది. మంగఢ్ ఘటన రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని గిరిజన ప్రాంతాలలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేక పోరాట చైతన్యాన్ని మరింత విస్తృతం చేసింది. గిరిజన అమరవీరులకు నివాళులర్పించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2022 నవంబర్ 1న మంగఢ్ ధామ్‌ను సందర్శించారని కూడా గుర్తు చేశారు. అలాగే, అమరవీరులకు నివాళులర్పించేందుకు రాష్ట్రపతి కూడా 2024 అక్టోబర్ 4న మంగఢ్ ధామ్‌ను సందర్శించారు. మంగఢ్ ధామ్‌ను జాతీయ వారసత్వ ప్రదేశంగా గుర్తించాలని 'షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్' కూడా సిఫార్సు చేసింది. అలాగే, పాఠశాల, కళాశాల పాఠ్యపుస్తకాలలో మంగఢ్ చరిత్రకు తగిన ప్రాధాన్యత కల్పించాలని రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలను కూడా అది కోరింది.

# దోనెపూడి వెంకయ్య ఇక లేరు



లోకంలో ప్రసిద్ధులు చాలామంది ఉంటారు. ప్రసిద్ధులు కాకున్నా సిద్ధులైనవారు కొందరే ఉంటారు. అలాంటి వారిలో ఒకరైన దోనెపూడి వెంకయ్య సెప్టెంబర్ 30 న నర్సరావుపేటలో తన 91వ ఏట కన్నుమూశారు. వారు గొప్ప రచయిత, కవి, అనువాదకులు.

రాష్ట్రీయ స్వయంసేవక సంఘ కార్యకర్తగా అంకితమై జీవితం గడిపిన వెంకయ్య సంఘ ప్రార్థన గురించి విపులమైన వ్యాఖ్యానం వ్రాశారు. గత 50 సంవత్సరాలలో ఈ పుస్తకం 20కు పైగా ముద్రణలు పొంది ఉంటుంది. దీనితోపాటు వారు రచించిన మరొక గ్రంథం సద్గుణ సంపదను కూడా పాఠ్య గ్రంథంగా పేర్కొనవచ్చును. ఇది మొదట నాలుగు భాగాలుగా ముద్రితమైనా తర్వాత ఒకే బృహ ద్గ్రంథ రూపాన్ని సంతరించుకొని అనేక ముద్రణలు పొందడం విశేషం. దీనానాథ్‌బత్రా హిందీలో సేకరించి ప్రచురించిన ప్రేరణాదీప్ గ్రంథావళిని తెలుగులోకి అనువదించారు. బాలసాహిత్యంలో వాటికి ఒక ప్రత్యేక స్థాన ముంది.

జాగృతి వారపత్రికకు వీరు అందించిన సేవలు మరువలేనివి. మార్క్సిజమా? మానవతావాదమా? అనే వ్యాసావళిని జాగృతి పత్రికకు రాశారు. తరువాత ఆ వ్యాసాలు పుస్తక రూపంలో వచ్చాయి. మార్పుకు పాఠాలు అనే లఘు వ్యాసావళిని కూడా జాగృతి కొరకు రాశారు. ప్రతి వ్యాసంలోనూ ఒక పద్యం ఉంటుంది. ఇవి రెండు భాగాలుగా ప్రచురిత మయ్యాయి.

భారతి పత్రికకు కూడా చాలా వ్యాసాలు రాశారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం ద్వారా వారి రచనలు ప్రసారమయ్యాయి. 'భీష్మ యుధిష్ఠర సంవాదం' కూడా జాగృతిలో ధారావాహికగా ప్రచురితమైన తర్వాత పుస్తకరూపంలో వచ్చింది. ఈ పుస్తకం కూడా అనేక ముద్రణలు పొందింది.

జాతీయ సాహిత్యపరిషత్ వెలువరించిన 'హిరణ్య గర్భ' కవితల సంకలనంలో చోటు సంపాదించిన వ్రత దీక్ష, అమ్మ కవితలు వచనకవిత ప్రక్రియకు నమూనాగా పేర్కొనదగినవి. జాగృతి పత్రికకు ఎన్నో కవితలు రాశారు, పద్య కథలు రాశారు. అరుణాచల యోగిగా ప్రసిద్ధుడైన శ్రీ రమణ మహర్షి సాహిత్యాన్ని తెలుగులోకి తీసుకొని రావటంలో వీరి పాత్ర అసమానమైనది. ఇరవైకి పైగా పుస్తకాలను రాశారు. రమణమహర్షి బోధనలను, ఆయన ఆధ్యాత్మిక సందేశాన్ని, వ్యక్తిత్వాన్ని పరిచయం చేయడానికి సంస్కృతంలో వాడుకలో ఉన్న అనుష్టుప్ ఛందస్సును తెలుగులోకి తీసికొని వచ్చారు.

ఇలా తెలుగు సాహిత్య రంగానికి, రాష్ట్రీయ స్వయంసేవక సంఘానికి, రమణుల సందేశ వ్యాప్తికి సేవలందించిన దోనెపూడి వెంకయ్యగారి మరణం తీర్చలేని లోటును మిగిలిస్తున్నది.

# వినమ్ర శ్రద్ధాంజలి

**దోనెపూడి వెంకయ్య గారు ఆత్మ బంధువు, స్నేహశీలి, మంచి ఆచార్యులు కూడా. మనందరకు తెలిసిన వెంకయ్య మంచి కవి, రచయిత, అనువాదకులు. కానీ సంఘ కేంద్రిత జీవనం వీరిది. సిద్ధాంతపరంగా తన కలం బలంతో పాశ్చాత్యయిజాలకు దీటుగా సమాధానం చెప్తూ మన సత్య సిద్ధాంతాల పట్ల సమాజంలో విశ్వాసాన్ని పెంచిన వ్యక్తి. ఆధ్యాత్మికత, ధర్మం, సంస్కృతి, నిష్ఠ పెంచడం కోసం సరళ సాహిత్యాన్ని మనందరకు అందజేయడం వారి విశేషత.**

కార్యకర్తలను తీర్చిదిద్దడంలో సిద్ధహస్తులు వారు. నేను బౌద్ధిక్ విభాగంలో ఓనమాలు నేర్చుకున్నది వారి సన్నిధిలోనే. అది నా అదృష్టం. ఒకసారి సంఘశిక్షావర్గలో ఎవ్వరు ఇప్పటివరకు చెప్పని కథ నన్ను చెప్పమన్నారు. వీరపాండ్య కట్టబొమ్మన్ తమ్ముడైన ఉమ్మదురై గూర్చి చదివి చెప్పాలి. నేను వినని వ్యక్తిత్వం అది. జటిల విషయాలను సరళీకరణం చేసి మనకు అర్థం చేయించడంలో వారు దిట్ట. వారి సహాయంతో ఆ కథ శిక్షావర్గలో నేను అందరూ ఊహించిన దానికంటే బాగా చెప్పాను. అందరూ నన్ను అభినందిస్తుంటే చాలా ఆనందించిన వ్యక్తి వెంకయ్యగారు. తరవాత చాలా విషయాల్లో వారి మార్గదర్శనం నాకు లభించడం నా పూర్వ జన్మ సుకృతం.

కఠిన పదజాలం ఉపయోగించకుండా మృదు సంభాషణ ద్వారా వ్యక్తిని తీర్చిదిద్దే ప్రక్రియ వారిది. నేర్చుకో – నేర్చుకో అనే మాటలకు నిలువెత్తు ఆచరణ రూపం వెంకయ్యగారు. వారి ప్రక్కన ఉంటే 'నేను నిన్నటి కంటే యీ రోజు జ్ఞానవంతుడిని' అనే భావం కలగక తప్పదు. మనకు భారతదేశం ఎలా ధర్మాధిష్ఠిత సమాజమో, ఆధ్యాత్మిక ప్రధాన దేశమో సోదా హరణంగా సజీవ దృష్టాంతాలతో వివరించేవారు.

ఆదర్శ స్వయంసేవక్‌గా ఎలా జీవించాలో మనకు చూపించారు. సరళ జీవనం, విరళ చింతనం, మిత వ్యయం లాంటి గుణాలు సంపూర్ణంగా వారిలో దర్శనమిస్తాయి. సంఘ వ్యవస్థను నూటికి నూరుపాళ్ళు జీవితమంతా గౌరవించడంలో వారికి వారే సాటి. 5 సం.ల క్రితం వారింటికి వెళ్ళినప్పుడు ఇంట్లో అడుగు పెట్టగానే ఇంట్లో వారందరికి మంచం మీద నుండే క్షేత్ర కార్యవాహ వచ్చారని పిలిచి ఒక దగ్గరకు చేర్చి, మనం వెళ్లకపోయినా మన దగ్గరకు రావడం సంఘ అధికారుల విశేషమని కుటుంబ సభ్యులందరికీ వివరించారు.

చెరగని నవ్వు వారి ప్రత్యేకత. తన దగ్గర ఉన్నది పంచివ్వడం వారి స్వభావం. వారికి శ్రద్ధాంజలి సమర్పించడం మనందరి కర్తవ్యం. వారి మరణం మనందరికీ తీరని లోటే. ఈ లోకంలో లేకపోయినా వారు గురుతుల్యులు. వారి స్మరణ ఎప్పుడూ ప్రేరణాదాయకంగా ఉంటుంది.

**దూసి రామకృష్ణ**
**క్షేత్ర సహ సంఘచాలక్**

# అంజూరు బాలసుబ్రహ్మణ్యం ఇక లేరు



శాఖా కార్యం- సమాజ కార్యం రెంటినీ సమన్వయం చేసుకుంటూ 51ఏళ్లు పనిచేసిన ధన్యజీవి అంజూరు బాలసుబ్రహ్మణ్యం. శ్రీకాళహస్తికి చెందిన వీరు ప్రభుత్వ ఉద్యోగిగా ఎమర్జెన్సీలో సంఘ కార్యకర్తలతో పరిచయం అయ్యారు. 1979 శాఖా ముఖ్యశిక్షక్ బాధ్యత నుండి పుత్తూరు తాలూకా కార్యవాహ, చిత్తూరు జిల్లా బౌద్ధిక ప్రముఖ్, తిరుపతి విభాగ్‌కార్యవాహ, సామాజిక సమరసతా వేదిక ప్రాంత ఉపాధ్యక్షులుగా జీవితాంతం సంఘం ఏ బాధ్యత ఇచ్చినా సక్రియంగా పనిచేశారు. శ్రీకాళహస్తి నగరంలో సంఘకార్యం బలోపేతం చేయడంలో నగర కార్యవాహ బుజ్జన్నకు కుడిభుజంగా పని చేశారు. మృదుస్వభావి, స్నేహశీలలి. సమాజ కార్యంలో 1983 నాటి సంగతి. వారు పుత్తూరు తాలూకా కార్యవాహగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఎన్టీఆర్ రాజకీయ ప్రభంజనం ఉంది. కార్వేటినగరం పక్కనే ఉన్న పాదిరి కుప్పం ఎస్సీ కాలనీవాసులు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. ప్రధాన గ్రామస్తులు తెలుగుదేశం పార్టీకి పనిచేశారు. ఎన్నిక రోజు రాత్రి పెద్ద ఎస్సీకాలనీ పూరిగుడిసెలు మంటలకు ఆహుతి అయ్యాయి. రెండువైపులా కొందరు మరణించారు. ఈ దుర్ఘటన ఉద్రిక్తతలకు దారి తీసింది. ఎస్సీలు,ఇతర కులస్థుల మధ్య ఉద్రిక్తతలకు దారితీసింది. ఆర్ఎస్ఎస్ తిరుపతి జిల్లా కార్యాలయంలో జిల్లాకార్యవాహ దొమ్మరాజు రామక్రిష్ణ రాజు అధ్యక్షతన సమావేశంలో, పరిస్థితిని సమీక్షించి “ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకైనా ఎవరైనా ఓటు వేసుకోవచ్చు. ఇలాంటి దుర్ఘటనలు జరుగ రాదు, వేడిని చల్లార్చి, సమాజాన్ని కలిపి ఉంచడం సంఘ బాధ్యత” అని తీర్మానం చేశారు, ఆ ఉద్రిక్త పరిస్థితుల్లో ఆ ఎస్సీ కాలనీకి వెళ్లి ఏ ఇంట్లో ఎంత మంది ఉన్నారో లెక్కలువేసి ప్రతీ కుటుంబానికి పంచె, చీర, తువ్వాలు ఆర్ఎస్ఎస్ పేరున బాల సుబ్రహ్మణ్యంగారే వెళ్లి ఇచ్చారు. ఆరోగ్యం బాగోలేని సమయంలో సైతం సామాజిక సమరసతావేదిక శ్రీకాళహస్తి కమిటీని ఏర్పర్చారు. వారికి ఏర్పేడు మలయాళస్వామి ఆశ్రమంతో సత్సంబంధాలు ఉన్నాయి. సద్గురు మలయాళస్వామి బోధనల పుస్తకం, మోక్షానికి అర్హత కులమా? గుణమా? (ఎమెస్కో ప్రచురణ) పుస్తకా విష్కరణ ఏర్పేడు ఆశ్రమంలో నిర్వహించారు. అనారోగ్యంతో సెప్టెంబర్ 29న తనువు చాలించారు. వారి కుటుంబ సభ్యులు వారి సామాజిక కార్యానికి అండగా నిలిచారు.

# సక్షమ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష




**భీమవరం :** సక్షమ్ ఆధ్వర్యంలో లైన్స్‌క్లబ్ వారి సహకారంతో అక్టోబర్ 3న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండల కార్యాలయంలో ఉచిత కంటి చికిత్స నిర్వహించారు. ఇందులో 81 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. వీరిలో 20మందికి ఆపరేషన్ చేసుకోవాలి సూచించారు. సక్షమ్ 60 మందికి కళ్లజోళ్లను ఉచితంగా ఇచ్చారు. ఈ సమావేశంలో పోడూరు మండల్ ఎంపీడీఓ, పశ్చిమ గోదావరి జిల్లా సక్షమ్ అధ్యక్షులు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.




**భాగ్యనగర్ :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి (జాతీయ సాహిత్య పరిషత్ జాతీయ పూర్వ అధ్యక్షులు) గారికి 2025 సంవత్సరానికి గాను ప్రతిభాపురస్కారం సెప్టెంబర్ 26 న ప్రదానం చేసింది. వారు చేసిన తెలుగు సాహిత్య విమర్శ - పరిశోధనకుగాను ఈ పురస్కారం లభించింది. తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, ప్రముఖ సినీ నటులు మురళీమోహన్ చేతుల మీదుగా ఆచార్యులవారిని సత్కరించారు.

# కథ

కారు డ్రైవ్ చేస్తున్నాడన్నమాటే గాని శ్రీధర్ మనసు మనసులో లేదు.

నిండా నాలుగేళ్లయినా లేని తన చిన్నకొడుకు అన్న మాట, దానికి ఎనిమిదేళ్ల పెద్దవాడు నవ్విన నవ్వు, ఇచ్చిన జవాబు అతణ్ణి వెంటాడుతున్నాయి. పట్టుమని పదేళ్లయినా లేని,పరస్పరం ఎంతో స్నేహంగా ఉండవలసిన అన్నదమ్ములు...ఆఫ్ట్రాల్ టీవీ కోసం ఎలాంటి మాటలు విసురుకుంటున్నారు?! ఇప్పుడే ఇలా ఉంటే పెద్దయ్యాక ఒకరికొకరుగా బతుకు తారా? ఒకరి కష్టాన్ని మరొకరు పంచుకుంటారా..?!

శ్రీధర్‌కి తెలుసు, తన భయాలు విని నలుగురూ నవ్వుతారని."ఏ కాలంలో ఆలోచిస్తున్నావయ్యా...ఈ రోజుల్లో ఏ అన్నదమ్ములు రామలక్ష్మణుల్లా కలిసి మెలసి ఉంటున్నారో చూపించు!" అంటారు. కాని, తన ఆలోచనలు..కోరికలు వేరు. తన కడుపున పుట్టిన పిల్లలిద్దరూ ఎప్పటికీ ఒకరంటే ఒకరు ప్రాణంగా ఉండాలి. ఒకరికొకరు చేయూతనిచ్చు కోవాలి. ఒకరికి కష్టం కలిగితే మరొకరు ఆదుకోవాలన్నది తన ప్రగాఢవాంఛ. అందుకే భార్గవి 'ఒక్కడు చాలంటున్నా', ఇద్దరిని కన్నాడు! ఆ ఇద్దరూ ఏనాడూ స్నేహంగా కబుర్లు చెప్పుకోరు. బద్ధశత్రువుల్లా పోట్లాడుకుంటారు. ఇవాళైతే మరీనూ. చూడబోతే, ఇద్దరు మగపిల్లలు స్నేహంగా ఉండగలరు గాని అన్నదమ్ములుగా మాత్రం ఆ స్నేహాన్ని పంచుకోలేరు కాబోలనిపిస్తోంది.

"పిల్లలు తెలిసీ తెలియకా ఏదో మాట్లాడుతూ ఉంటారు.అవన్నీ పట్టించుకుంటారెందుకు..?!" అని భార్గవి మందలించినా అతని మనసులో మాత్రం పిల్లల ప్రవర్తన, ఆ నేపథ్యంలో మరేవో జ్ఞాపకాలు గింగిరాలు తిరుగుతున్నాయి. అస్పష్టంగా ఒక పదిహేనేళ్ల కుర్రాడి రూపం కనిపిస్తోంది. "దొంగ వెధవా.. చావు" అంటూ తన మీదకి కత్తి విసురు తోంది. తను భయంతో పక్కకి గెంతుతున్నాడు.

ఎన్నాళ్లయింది తను ఆ పదిహేనేళ్ల కుర్రవాడిని... తన సొంత అన్నని మర్చిపోయి? కచ్చితంగా ఆరేళ్లు! అమ్మానాన్నా పోయాక, ఈ ఆరేళ్లలో తను ఒక్కసారి కూడా వాణ్ణి తలచుకున్న గుర్తు లేదు. బతికున్నంత కాలం కొడుకు కోసం వాళ్లు ఏడ్చారు గాని..తను అంత యాతన పడిన జ్ఞాపకమూ లేదు. ఎప్పుడైనా వాడు గుర్తొస్తే బాధగా అనిపించేదంతే. కాని, ఇవాళ తన కొడుకులిద్దరి మాటలూ విన్న తర్వాత... వాళ్లిద్దరూ పెద్దయ్యాక ఒకరితో ఒకరు ఆప్యాయంగా.. ప్రేమగా ఉండరనే భయం కలిగాక, ఒక్కసారిగా అన్నయ్య గుర్తొచ్చాడు. కనబడకుండా పోయిన అన్నదమ్ముణ్ణి వెతికేందుకు తను కనీస ప్రయత్నం కూడా చెయ్యలేదన్న మాట బాణపు ములికు గుచ్చుకుని, 'నువ్వు నీ అన్నదమ్ముడి కోసం ఏం చేశావు గనక' అని ఎత్తిపొడుస్తోంది.

తండ్రికి తనూ, కేశవా..ఇద్దరే. వాడు సరిగ్గా చదివేవాడు కాదు. స్కూలు ఎగ్గొట్టి మరీ ఆటలాడుతూ ఉండేవాడు. తండ్రికి చదువంటే ప్రాణం. బాగా చదువుకోమని కేశవని సున్నితంగానే మందలించే వాడు. కేశవ కించిత్తూ పట్టించుకునేవాడు కాదు. మరోవైపు తనకి అన్నీ ఫస్టుమార్కులే. స్కూల్లో అందరూ తనని పొగుడుతూ "మీ తమ్ముణ్ణి చూసి నేర్చుకోరా" అని కేశవని తిట్టేవారు.వాడు అందుకు బాధపడేవాడు కాదు సరికదా, నాకు మంచి మార్కు లొస్తున్నందుకు సంతోషించేవాడు. "నువ్విలాగే బాగా చదువుకోరా! నాన్న సంతోషిస్తారు" అనేవాడు.

తనకి మాత్రం వాడిని నలుగురూ తిడుతూంటే సిగ్గనిపించేది. తను కూడా మంచి మార్కులు తెచ్చుకుంటే బావుణ్ణు కదా అనిపించేది. నెమ్మదిగా తను కూడా వాడికి చదవమని చెప్పడం ప్రారంభిం చాడు. అంతమంది చెప్పినా పట్టించుకోనివాడు, తను చెప్పేసరికి మాత్రం అగ్గి మీద గుగ్గిలం అయి పోయాడు. "గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందని, నువ్వు నాకు సుద్దులు చెప్పక్కర్లేదురోయ్. నీ చదువేదో నువ్వు చూసుకో చాలు!" అన్నాడు. అలా కొన్నాళ్లయ్యాక, వాడి టెన్త్ క్లాసు రిజల్ట్స్ వచ్చాయి. పేపర్లో వాడి నంబరు లేదు. పరీక్ష పోయింది. ఎప్పుడూ అత్తెసరు మార్కుల్తోనైనా పాసయ్యేవాడు.అలాంటిది ఏకంగా



# తోడు నీడ

లక్ష్మీగాయత్రి

బోర్డు పరీక్ష పోయేసరికి వాడికే కళ్లంట నీళ్లొచ్చేశాయి.

అప్పుడే తను గబుక్కున, "కనీసం పరీక్షల ముందు బాగా చదివినా బావుండేది!" అన్నాడు.

ఆ మాటకి వాడు పరశురాముడే అయిపోయాడు. ఆపుకోలేని క్రోధావేశంతో, "నా జోలికి రావద్దన్నానా...దొంగవెధవా..చావు!" అంటూ పక్కనే ఉన్న చాకు తీసి తన మీదికి విసిరేశాడు. తను చప్పున పక్కకి గెంతాడు. దాంతో గుండెలకి తగలాల్సిన కత్తి వచ్చి జబ్బకి గుచ్చుకుని బొటబొటా రక్తం కారడం ప్రారంభించింది. అంతే, తను పెద్ద పొలికేక పెట్టడం, కేశవ బాణంలా బైటికి పరిగెత్తడం ఒక్కసారి జరిగాయి. అలా వెళ్లినవాడు మరింక ఇంటికి తిరిగి రాలేదు. పోలీస్ కంప్లయింట్ ఇచ్చినా, నాలుగు సార్లు పేపర్లో వేయించినా ఫలితం లేకపోయింది. పెద్దకొడుకు కనబడకుండా పోయాడన్న బాధతోనే అమ్మా నాన్నా చనిపోయారు. వాళ్లు పోయాక తను కేశవని ఇంచుమించు పూర్తిగా మర్చిపోయాడు. తోడబుట్టినవాడు ఎక్కడున్నాడో ఎలా ఉన్నాడో అన్న ఆలోచన కూడా తనకి లేకపోయింది.

ఈ రోజు పొద్దున్న తను ఆలస్యంగా లేచి, హాల్లో కూర్చుని కాఫీ తాగుతున్నాడు. పిల్లలకి సెలవు. ఇద్దరూ టీవీ ముందు కూచుని రిమోట్ కోసం పోట్లాడుకుంటున్నారు. వాళ్ల గోల తను పట్టించుకో లేదు.



ఉన్నట్టుండి నాలుగేళ్లయినా లేని చిన్నవాడు ఒక్క కేక పెట్టాడు. ఏమిటా అని చూస్తే, వాడు అన్న మీద అరుస్తున్నాడు.."నన్ను టీవీ చూడనివ్వవా? టీవీ నీకేనా...నేను చచ్చిపోవాలా? నేను చచ్చిపోతే నీకు హేపీయా..?! టీవీ నువ్వొక్కడివే చూస్తావా" ఆ మాటకి ఎనిమిదేళ్ల పెద్దవాడు పకపకా నవ్వుతూ, "చచ్చిపోతావా.. చచ్చిపోరా చూద్దాం!" అన్నాడు. వాళ్లిద్దరి మాటలూ విని తను కొయ్యబారిపోయాడు. అప్పటినుంచీ తన మనసు మనసులో లేదు. పాతికేళ్ల కిందట మాయమైపోయిన అన్నదమ్ముడే కళ్లలో మెదులుతున్నాడు.

తన పిల్లల గురించీ, మాయమైపోయిన తన అన్న గురించీ చెదురు మదురుగా ఆలోచిస్తూ ఎలాగో స్నానం చేసి టిఫిన్ తిన్నాడు శ్రీధర్. ఆఫీసులో ఇంటర్వ్యూలున్నాయి. డ్రైవర్ రాజు ఆఫీసు కారు తీసుకురాగానే బయల్దేరాడు. రాజుకి శ్రీధర్ దగ్గర బాగా చనువు. తన కుటుంబం గురించి కూడా శ్రీధర్‌కి చెబుతూ ఉంటాడు. కార్లో రాజుని చూడగానే శ్రీధర్‌కి అతనితో మాట్లాడాలనిపించింది.

''రాజూ, నువ్వూ మీ తమ్ముడూ కలిసే ఉంటున్నారు కదూ!" అంటూ ప్రారంభించాడు.

"అవున్సార్, వాడి దారిన వాణ్ణి వదిలేస్తే, డబ్బంతా తాగుడుకే తగలేత్తాడు. కుటుంబంలో అందరూ పస్తులుండాల! అందుకే తెచ్చి నా దగ్గర పెట్టుకున్నా. నేనంటే కాస్త బయం ఎదవకి!"

"నీకు డబ్బులిస్తూ ఉంటాడా?"

"ఆ..ఇత్తాడు సార్. దాచిపెడతా ఉంటాను. తాగుడు కూడా తగ్గింది. మా తమ్ముడు మంచోడే సార్. ఆడు తాగకండా ఉన్నప్పుడు నెమ్మదిగా సుద్దులు చెబతా ఉంటా. ఆడి కూతురు పెద్దదవతాంది. పెళ్లి చెయ్యాల.. డబ్బు ఎనకెయ్యాల అని చెబ్తాంటా. ఇంటాడు"

శ్రీధర్‌కి మనసు కాస్త చల్లబడిరది. అవునంతే. అన్నదమ్ములు ఒకరికొకరుగా బతకాలి. లక్ష్మణుడేం చేశాడు? కైకమ్మ రాముణ్ణొక్కణ్ణే అడవికి పొమ్మన్నా తను కూడా అన్నతో బాటు వెళ్లిపోయాడు. సుమిత్ర కూడా రాముణ్ణి తండ్రిగా భావించి సేవించుకోమని కొడుక్కి హితబోధ చేసింది గాని 'నీకెందుకు నువ్వు హాయిగా ఇక్కడుండి రాజభోగాలు అనుభవించు' అనలేదు. రామాయణం భారతీయులకి కుల భూషణం. మార్గదర్శక గ్రంథం. అన్నదమ్ములంతా రామలక్ష్మణుల్లా ఉండాల్సిందే! ఇవాళే నాలుగు దినపత్రికలకి ఫోన్ చేసి కేశవ గురించి ప్రకటన ఇవ్వాలి. గట్టిగా పట్టుబడితే కేశవ దొరక్కపోడు. ఎక్కడున్నాడో, ఎలా ఉన్నాడో అన్నయ్య!

శ్రీధర్ తన ఛాంబర్‌కి వెళ్లేసరికి అప్పటికే వచ్చి ఉన్న గిరి పలకరించాడు. ఇంటర్వ్యూ పానల్‌లో శ్రీధర్, గిరి, రజిత ఉన్నారు.

"మేడమ్ ఇంకా రాలేదా.." శ్రీధర్ అడిగాడు

"ఇంట్లో అందరికీ సేవలు చేసి రావొద్దూ" గిరి వెటకరించాడు

శ్రీధర్ నవ్వి, సీట్లో వెనక్కి వాలుతూ, "థాంక్ గాడ్. ఇప్పుడు కాస్త రిలాక్సయాను. పొద్దున్నయితే అసలు ఆఫీసుకి రావాలనిపించలేదు!" అన్నాడు

"ఏం..ఏమైంది?!"

శ్రీధర్ పిల్లలిద్దరి మాటలూ చెప్పాడు.

గిరి పకపకా నవ్వుతూ, "పిల్లల మాటలు భలే క్యూట్‌గా ఉంటాయి!" అన్నాడు

శ్రీధర్‌కి కంపరమెత్తింది. "చావు మాటలు క్యూట్‌గా ఉన్నాయా నీకు? రామలక్ష్మణుల్లా కలిసి మెలిసి ఉండాల్సిన అన్నదమ్ములు నేను ఛస్తే నీకు సంతోషమే కదా అని అడగడమా?!" అన్నాడు

గిరి చెయ్యి విదిలించి, "చాల్లే భాయ్, ఎక్కడో రామాయణం నాటి కబుర్లు చెబుతావు. మా అన్నయ్యనే చూడు, నాకు యాక్సిడెంటయి ఆస్పత్రిలో ఉంటే మొక్కుబడిగా ఓసారి వచ్చి చూసి

వెళ్లిపోయాడు. ఎక్కడ వాణ్ణి డబ్బుల దుగుతానో అని భయం. మా ఆవిడ ఒక గ్రాము బంగారం కొందంటే చాలు, మా వదిన రెండు గ్రాములు కొనేదాకా నిద్రపోదు. ఆవిడకి వాడు వత్తాసు. అందుకే మొన్న వాడి కొడుక్కి ఆపరేషనయినప్పుడు లక్ష రూపాయలు అడిగితే లేవని కచ్చితంగా చెప్పేశాం నేనూ మా ఆవిడ. అప్పటినుంచి ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటిమీద వాలడం లేదు. పోతే పోనీ అని హేపీగా ఉన్నాం మేం!"

శ్రీధర్‌కి తల తిరిగింది. ఏమిటీ మనుషులు.. ఆర్థికంగా ఎదుగుతూ, నైతికంగా దిగజారి పోతున్నారు. రక్తసంబంధాలకి కూడా దిక్కులేకుండా ఉంది. రేపు తన పిల్లలిద్దరూ కూడా ఇలాగే ఉంటారేమో! అంతవరకూ ఎందుకు! తన అన్న కనబడకుండా పోయాడు గాని, వాడే గనుక ఉంటే తను కూడా ఇలాగే ఉండేవాడేమో..!! ఆ లెక్కన భరతుడు ఎలా ఉండి ఉండాలి...అయాచితంగా వచ్చిపడ్డ రాజ్యాధికారాన్ని అనుభవిస్తూ కన్నూమిన్నూ గానకుండా ఉండాలి. కాని అన్నగారి కాలి చెప్పులకే ఆ వైభవాన్ని కట్టబెట్టి చరిత్రలో చెరగని స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు తన పిల్లలు రామలక్ష్మణుల్లా ఉండాలంటే తనేం చెయ్యాలి..? అంతులేని ఆలోచనలతో రజిత ఎప్పుడు వచ్చిందీ కూడా గమనించలేదు శ్రీధర్.

ఇంటర్వ్యూలు మొదలయ్యాయి. అన్యమనస్కం గానే అభ్యర్థుల్ని ప్రశ్నిస్తున్నాడు. ఇంతా చేస్తే ఇది ఆఫీస్ అసిస్టెంటు పోస్టుకి ఇంటర్వ్యూ. కాని పర్మనెంటు పోస్టు కాబట్టి రూలు ప్రకారం అన్నీ జరగాలి. అభ్యర్థుల్ని అడుగుతున్నది జనరల్ నాలెడ్జి ప్రశ్నలు కాదు..వాళ్ల ఆర్థిక స్థితిగతులూ, తాగుడు అలవాట్లూ అవీ. ఆ ప్రశ్నలకి జవాబుల్ని బట్టి వాడు ఎంత నిజాయతీగా పనిచేస్తాడన్నది నిర్ణయించు కోవచ్చునన్నాడు శ్రీధర్. ఆ ప్రకారమే కానిస్తున్నారు.

తొమ్మిదిమంది అయ్యాక, పదో కుర్రవాడు లోపలికి వచ్చాడు. అందరికంటే చిన్నవాడిలా కనిపిస్తున్నాడు. ఆ కుర్రవాణ్ణి చూస్తూనే ఉలిక్కిపడ్డాడు శ్రీధర్. ఎవరీ కుర్రాడు...ఎక్కడో చూసినట్టుంది. బాగా పరిచయం ఉన్నవాడిలా ఉన్నాడు.

"శ్రీధర్ కూచిభొట్ల.." రజిత ఫైల్లోంచి పేరు చదువుతూ, ఆశ్చర్యంగా శ్రీధర్ వైపు చూసింది.

అప్పటికే శ్రీధర్‌కి బుర్ర పనిచెయ్యడం మానేసింది. భగవంతుడు తనకి ఇంత త్వరగా జవాబిస్తున్నాడా...తన మనసులో కలుగుతున్న భావం ఆనందమో కాదో నిర్ణయించుకోలేకపోతున్నాడు శ్రీధర్.

''యస్ మేడమ్..'' ఆ కుర్రాడు, శ్రీధర్ వినయంగా అన్నాడు.

"నీ పేరు శ్రీధరా..." శ్రీధర్ అప్రయత్నంగా ప్రశ్నించాడు.



"అవును సార్."

"ఇంటిపేరు కూచిభొట్లా.."

కుర్రాడు తలాడించాడు.

"మీ నాన్నగారి పేరు..?"

"కేశవ సార్"

శ్రీధర్‌కి కళ్లలో తిరుగుతున్న నీళ్లు ఆపుకోవడం కష్టమైంది.

"జస్ట్..పద్దెనిమిదేళ్లు నిండాయి నీకు. ఇంటర్‌లో చాలా మంచిమార్కులు వచ్చాయి కూడా. చదువుకోకుండా ఉద్యోగానికెందుకు వచ్చావు?!" రజిత ప్రశ్నించింది

కుర్రాడి మొహంలో ఒక్కసారిగా దిగులు కమ్ముకుంది.

"నాన్న సిమెంటు ఫ్యాక్టరీలో పనిచేసేవారు మేడమ్. లంగ్ ఇన్ఫెక్షన్ వచ్చి బాగా నీరసపడి పోయారు. కంపెనీ వాళ్లు ఉద్యోగంలోంచి తీసేశారు. అందుకని..." ఏడుపు దిగమింగుకుంటున్నట్టు కుర్రాడి స్వరం చెప్పింది.

శ్రీధర్‌కి మరోసారి కళ్లు చెమ్మగిల్లాయి. కేశవకి లంగ్ ఇన్ఫెక్షనా! నీరసపడిపోయాడా!తిండి కూడా తినకుండా రోజంతా హాయిగా ఆటలాడిన కేశవ!

"నీకు శ్రీధర్ అని ఎందుకు పెట్టారు పేరు..?!" శ్రీధర్ ప్రశ్నకి రజిత వింతగా చూసింది

కుర్రాడు ఒక్కక్షణం తటపటాయించాడు. తర్వాత,"మా చిన్నాన్న పేరు శ్రీధర్ సార్. తను చాలా బాగా చదివేవాడట. నేను కూడా అంత బాగా చదువుకోవాలని మా నాన్న నాకీ పేరు పెట్టారు! మా తమ్ముడిలా చదువుకో అని చెబుతూ ఉంటారు" అన్నాడు

గిరీ, రజితా మళ్లీ శ్రీధర్ వైపు చూశారు.

శ్రీధర్‌కి ఉన్న కాస్త అనుమానం కూడా తీరిపోయింది. కర్చీఫ్ తీసి మొహం తుడుచుకుంటూ, "నువ్వెళ్లి హాల్లో కూర్చో. నేనొచ్చేదాకా ఎక్కడికీ వెళ్లకు!" అన్నాడు

కుర్రాడు ఆశ్చర్యంగా చూసి తలూపి వెళ్లిపోయాడు.

గిరీ, రజితా ఏదో అడగబోయారు.

"ప్లీజ్, తర్వాత చెప్తాను. ఇంటర్వ్యూలు కానివ్వండి. ఇప్పుడొచ్చిన కుర్రాణ్ణి వదిలేసి వేరే ఎవరినైనా సెలెక్ట్ చెయ్యండి!" అన్నాడు శ్రీధర్

ఇంటర్వ్యూలు ముగిశాయి. శ్రీధర్ బైటికొచ్చి, కుర్రాణ్ణి తనతో రమ్మని సైగ చేసి వెళ్లి కారెక్కాడు. కుర్రాడు మరింత ఆశ్చర్యపోతూ కారెక్కి కూర్చున్నాడు.

"మీ ఇంటికి దారి చెప్పు.." క్లుప్తంగా అన్నాడు శ్రీధర్

పావుగంటలో కారు ఒక సందులోకి వెళ్లి, చిన్న పెంకుటింటి ముందు ఆగింది.

కుర్రాడి వెనకాలే లోపలికి నడిచాడు శ్రీధర్. అప్పుడే భోజనం చేసి విశ్రాంతిగా కుర్చీలో కూర్చుని ఉన్నాడు కుర్రాడి తండ్రి. కొడుకు వెనకాలే వచ్చిన మనిషిని చూసి ఆశ్చర్యంగా లేచి నిలబడ్డాడు.

శ్రీధర్ ఏమీ మాట్లాడలేదు. అవతలివాడి మొహంలోకే చూస్తూ నించున్నాడు.

అవతలిమనిషి కలవరపడుతూ శ్రీధర్‌ని పరకాయింపుగా చూసి, ఒక్కసారిగా ఉద్వేగపడుతూ, "తమ్ముడూ..." అన్నాడు

అంతే...ఒక్క ఉదుటున అన్నని హత్తుకుపోయి ఏడ్చేశాడు శ్రీధర్.

''ఎలా వెళ్లిపోయావురా మమ్మల్ని వదిలేసి..మేమెవరం అక్కర్లేదను కున్నావా..?"

"ఛీ...కాదురా. నీ మీద కత్తి విసిరేశాక, ఇక మీకెవరికీ మొహం చూపించ కూడదనుకున్నాను. నా పాట్లేవో నేను పడదామనుకున్నాను!" కేశవకి కూడా కన్నీళ్లు ఆగలేదు.

"చాల్లే...భగవంతుడి దయ వల్ల మళ్లీ దొరికావు నాకు!" కళ్లు తుడుచుకుంటూ పక్కకి తిరిగి, సంభ్రమంగా చూస్తున్న ఇల్లాల్ని "వదినా.." అంటూ పాదాలకి ప్రణమిల్లాడు శ్రీధర్

అరగంట తర్వాత, వదినగారి చేతి భోజనం చేసి, విశ్రాంతిగా కూర్చుని, భార్యకి మెసేజి పంపించాడు శ్రీధర్..."భార్గవీ!మన పిల్లలిద్దరూ రామలక్ష్మణుల్లా ఒకరికొకరు తోడూ నీడగా ఉండాలంటే ఏం చెయ్యాలో నాకు ఆ భగవంతుడే తెలియజెప్పాడు. ముందు నేను లక్ష్మణుణ్ణి కావాలి. నా పిల్లలకి ఆదర్శంగా నిలవాలి. భగవంతుడి దయ వల్ల మా రాముడు..అంటే కేశవ కనిపించాడు. వాడి కుటుంబాన్ని తీసుకువస్తున్నాను. ఇకనుంచి అందరం కలిసే ఉందాం. మనకి మొత్తం ముగ్గురు పిల్లలు. ఆ ముగ్గురి బాధ్యతా మన నలుగురిదీ! మన పెద్దకొడుకు పేరు నా పేరే, శ్రీధర్. వాడికి డాక్టరవ్వాలని కోరిక. ఇంటర్‌లో టాప్ ర్యాంకర్. వాణ్ణి ఎంసెట్‌కి ప్రిపేర్ చెయ్యాలి! ఆ ఏర్పాట్లు చూడు!"

మానవత్వం మూర్తీభవించిన సంఘసేవికా, కాలేజీ లెక్చరరూ అయిన భార్గవి తనకి పూర్తి చేదోడువాదోడుగా ఉంటుందని శ్రీధర్‌కి తెలుసు. ఆ నమ్మకంతోనే అతను అన్న కుటుంబాన్ని తీసుకుని ఆనందంగా కారెక్కాడు!! ★




# ఆసియా క్రీడల్లో రాశితగ్గినా.. వాసిపెరిగిన భారత్!

జపాన్ వేదికగా ముగిసిన 2026-ఆసియాక్రీడల్లో భారత్ రాశి తగ్గినా వాసి మాత్రం పెరిగింది. పలు క్రీడల్లో తొలిసారిగా స్వర్ణాల పంట పండించుకొంది. తెలుగు రాష్ట్రాల అథ్లెట్లు సైతం స్థాయికి మించి రాణించడం ద్వారా దేశానికే గర్వకారణంగా నిలిచారు.

ఆసియాఖండ దేశాల క్రీడాభిమానులను గత రెండువారాలుగా అలరించిన 20వ ఆసియాక్రీడలు వినూత్నంగా, అత్యంత విజయవంతంగా ముగిసాయి. అయిచీ- నగోయ నగరాలు వేదికగా జరిగిన ఈ క్రీడల్లో ఆసియాలో తిరుగులేని క్రీడాశక్తిగా చైనా మరోసారి తన సత్తా చాటుకోగా..పతకాల పట్టికలో భారత్ తన నాలుగో స్థానాన్ని విజయ వంతంగా నిలుపుకోగలిగింది.

**వ్రతం చెడినా ఫలితం దక్కిన భారత్..**

మొత్తం 43 క్రీడాంశాలలో 45 దేశాలకు చెందిన అథ్లెట్లు 400కు పైగా బంగారు పతకాల కోసం పోటీపడగా...భారత్ ఎంపిక చేసిన 35 క్రీడల్లో మాత్రమే 269 మంది పురుష, 234 మంది మహిళా అథ్లెట్లతో పతకాలవేటలో నిలిచింది.గత (2022) ఆసియాక్రీడల్లో సాధించిన 107 పతకాల (28 స్వర్ణాల) రికార్డును తిరగరాయాలన్న లక్ష్యానికి భారత్ చేరువకాలేకపోయింది. కేవలం 21 స్వర్ణాలతో 82 పతకాలకే పరిమితమయ్యింది. అయితే..పతకాల సంఖ్య తగ్గినా పతకాలపట్టికలో నాలుగోస్థానం దక్కించుకోవడం ద్వారా ఊపిరి పీల్చుకొంది.

ఆసియా దిగ్గజం చైనా 169 స్వర్ణ, 89 రజత, 83 కాంస్యాలతో సహా 341 పతకాలతో అగ్ర స్థానంలో నిలిచింది. ఆతిథ్య జపాన్ 269 (83 స్వర్ణ, 95 రజత, 91 కాంస్య) పతకాలతో రెండు, దక్షిణ కొరియా 150 (39 స్వర్ణ, 43 రజత, 68 రజత) పతకాలతో మూడు స్థానాలు దక్కించు కొన్నాయి. 70 పతకాల (21 స్వర్ణ, 25 రజత, 24 కాంస్యా)తో ఐదో స్థానంతో సరిపెట్టుకొంది.

**అరుదైన పతకాలతో సంచలనం....**

బ్యాడ్మింటన్, షూటింగ్ లాంటి క్రీడల్లో పేరు మోసిన సింధు, మను బాకర్ లాంటి పలువురు దిగ్గజ అథ్లెట్లు దారుణంగా విఫలమైనా...మహిళా గోల్ఫ్ వ్యక్తిగత విభాగంలో ప్రణవి, మహిళల విలువిద్య రికర్వ్ వ్యక్తిగత విభాగంలో కుంకుమ్ మొహాద్, బాక్సింగ్ మహిళల విభాగంలో లవ్లీనా బోర్గెయిన్, మహిళల షూటింగ్ ట్రాప్ విభాగంలో నీరూ దండా, మహిళల పోల్ వాల్ట్‌లో పర్ణికా ఇలంగోవన్, మహిళల రిలే అంశాలలో భారత మహిళా అథ్లెట్లు చరిత్రాత్మక విజయాలతో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుత క్రీడల్లో భారత్ సాధించిన మొత్తం 82 పతకాలలో సగభాగం మహిళా అథ్లెట్లు సాధించినవే కావడం విశేషం. పురుషులతో పోల్చి చూస్తే తక్కువ సంఖ్యలో పాల్గొన్న మహిళా అథ్లెట్లే స్థాయికి మించి రాణించి మరోసారి భారత్ పరువు నిలిపారు.

**ఆరుకు ఆరు స్వర్ణాలతో జోరు....**

కబడ్డీ, క్రికెట్, హాకీ (పురుషుల,మహిళల) విభాగాలలో భారతజట్లు స్థాయికి తగ్గట్టుగా రాణించి బంగారు పతకాలు సాధించడం ద్వారా అంచనాలను అందుకోగలిగాయి. క్రికెట్, హాకీ విభాగాలలో స్వర్ణవిజేతలుగా నిలవడంతో భారత పురుషుల, మహిళల జట్లకు 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో నేరుగా పాల్గొనే అవకాశం దక్కింది.

కబడ్డీ పురుషుల, మహిళల విభాగాలలో చిరకాల ప్రత్యర్థి ఇరాన్‌ను అధిగమించడం ద్వారా భారత్ జంట స్వర్ణాలను కైవసం చేసుకోగలిగింది. ఆసియా



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969



క్రీడల కబడ్డీలో భారత పురుషుల జట్టు రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి బంగారు పతకం అందుకొంది.

క్రికెట్ పురుషుల ఫైనల్లో పాకిస్థాన్‌ను, మహిళల ఫైనల్లో శ్రీలంకను చిత్తు చేయడం ద్వారా భారతజట్లు వరుసగా రెండోసారి స్వర్ణపతకాలు తమ ఖాతాలో వేసుకోగలిగాయి.

మహిళల హాకీ ఫైనల్లో శక్తిమంతమైన చైనాను 1–0తో కంగు తినిపించడం ద్వారా భారత్ 44 సంవత్సరాల విరామం తర్వాత స్వర్ణపతకంతో మెరిసి మురిసింది. పురుషుల ఫైనల్లో మలేసియా పై 5–1గోల్స్‌తో అలవోకగా నెగ్గడం ద్వారా భారత్ ఐదోసారి ఆసియాక్రీడల విజేతగా నిలువగలిగింది. కేవలం ఒక్క విలువిద్య క్రీడలోనే భారత్ రికార్డుస్థాయిలో ఐదు స్వర్ణ, రెండేసి రజత, కాంస్య పతకాలతో అత్యంత విజయవంతమైన క్రీడగా అవతరించింది.

**పతకాల వేటలో తెలుగు వెలుగులు!**

ఆసియాక్రీడలకు ఎంపికైన 490కు పైగా భారత అథ్లెట్ల బృందంలో తెలుగు రాష్ట్రాల అథ్లెట్లకు పరిమిత సంఖ్యలోనే చోటు దక్కింది. విలువిద్య పురుషుల, మహిళల విభాగాలలో నలుగురు, బ్యాడ్మింటన్లో నలుగురు, క్రికెట్ పురుషుల, మహిళల విభాగాలలో ఒక్కొక్కరు, మహిళల పిస్టిల్ షూటింగ్ లో ఒక్కరు మాత్రమే తెలుగు అథ్లెట్లు ప్రాతినిథ్యం వహించారు.

తెలంగాణాకు చెందిన షూటర్ ఈషాసింగ్ రజత, క్రికెటర్ తిలక్ వర్మ , విలువిద్య మహిళల కాంపౌండ్ టీమ్, మిక్సిడ్ టీమ్ విభాగాలలో తానివర్తి చికిత బంగారు పతకాలు సాధించారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు ఆర్చర్లు (వెన్నం జ్యోతిసురేఖ, గణేశ్ మణిరత్నం తిరుమూరు, ధీరజ్ బొమ్మదేవర) స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో దేశానికే గర్వకారణంగా నిలిచారు.

మహిళా క్రికెట్లో విజేతగా నిలిచిన భారత కీలక స్పిన్నర్‌గా శ్రీచరణి స్వర్ణపతకం అందుకోగలిగింది. మహిళల అథ్లెటిక్స్ పరుగులో పాల్గొనటానికి ఎంపికైన విశాఖ రన్నర్ జ్యోతి యర్రాజీ అనుకోని గాయంతో ట్రాక్‌లోకి దిగకుండానే స్వదేశానికి తిరిగి వచ్చింది.

మొత్తం మీద తెలుగు రాష్ట్రాల అథ్లెట్లు భారీసంఖ్యలో పతకాలు సాధించడం ద్వారా తమతమ రాష్ట్రాల ఖ్యాతిని చాటగలిగారు. వివిధ క్రీడల్లో దేశానికి పతకాలు సాధించి పెట్టిన అథ్లెట్లను మన క్రీడాప్రియ ప్రధాని నరేంద్ర మోదీ అభినందన సందేశాలతో ఉత్సాహపరిచారు.



**పతక విజేతలకు భారీ ప్రోత్సాహక బహుమతులు...**

ఆసియాక్రీడల్లో పతకాలు సాధించడం ద్వారా భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించిన అథ్లెట్లను కేంద్రంతో పాటు వివిధ రాష్ట్రప్రభుత్వాలు భారీనజరానాలు, ప్రోత్సాహక నగదు బహుమతులతో ముంచెత్తడానికి సిద్ధంగా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక నగదు బహుమతుల విధానం ప్రకారం ఆసియాక్రీడల వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించినవారికి 30 లక్షల రూపాయలు నగదుతో పాటు..వారివారి విద్యారజతను బట్టి స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగావకాశం కల్పించనున్నారు.

రజత పతకం సాధించిన వారికి 20 లక్షల రూపాయలు, కాంస్య విజేతలకు 10 లక్షల రూపాయలు చొప్పున అందిస్తారు.

**తమిళనాడులో కోట్ల వర్షం....**

భారత బృందంలో సభ్యులుగా పతకాలు సాధించిన తమ రాష్ట్ర అథ్లెట్ల కోసం తమిళనాడు ప్రభుత్వం 6 కోట్ల 90 లక్షల రూపాయలకు పైగా మొత్తాన్ని ప్రోత్సాహక నగదు బహుమతుల కోసం విడుదల చేసింది.

తమిళనాడుకు చెందిన 37 మంది అథ్లెట్లు 11 రకాల క్రీడాంశాలలో భారత్ తరపున పాల్గొని 20 పతకాలు సాధించారు. తమిళనాడు ప్రభుత్వ విధానం ప్రకారం స్వర్ణ పతక విజేతకు రూ. 80 లక్షలు, రజత పతక గ్రహీతకు రూ. 75 లక్షలు, కాంస్య పతకం సాధించినవారికి రూ. 60 లక్షలు చొప్పున అందివ్వనున్నారు.

**మిజోరంలో స్వర్ణానికి 25 లక్షల రూపాయలే...**

శుచిశుభ్రతకు మరోపేరైనా భారత ఈశాన్య రాష్ట్రం మిజోరం తన ఆర్థిక పరిస్థితికి తగ్గట్టుగా ప్రోత్సాహక నగదు బహుమతులు ప్రకటించింది. నాలుగు దశాబ్దాల తరువాత మహిళల హాకీలో బంగారు పతకం సాధించిన భారతజట్టులో సభ్యులుగా ఉన్న మిజోరం జోడీ లాల్ రెమ్ సియామీ, లాథాన్ తులుంగీలకు చెరో 25 లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి లాల్దు హోమా ప్రకటించారు.

ఒడిషా, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ, హరియాణ, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ ప్రభుత్వాలు సైతం తమతమ రాష్ట్రాలకు పతకాలతో ఖ్యాతి తెచ్చిన అథ్లెట్లను భారీనగదు బహుమతులతో సత్కరించనున్నాయి.

మరో ఏడాది కాలంలో జరిగే లాస్ ఏటంజెలిస్ ఒలింపిక్స్‌కు ప్రస్తుత ఆసియాక్రీడల ఫలితాలను మదింపు చేసుకోడం ద్వారా భారత్ తన అథ్లెట్లను సమాయత్తం చేయటానికి ఇక వ్యూహాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది.

మొత్తం మీద 2026 ఆసియాక్రీడల బరిలోకి భారీ అంచనాలతో దిగిన భారత్‌కు మిశ్రమ ఫలితాలనే ఇచ్చినా పతకాల పట్టిక నాలుగోస్థానాన్ని నిలుపుకోడం మాత్రం ఊరట నిచ్చిందనడంలో ఏమాత్రం సందేహం లేదు. ★

# సైబర్ దొంగలకు చెక్ టీఏసీ సెక్యూరిటీ

చౌకైన ఇంటర్నెట్ అందుబాటులో ఉండడంతో ప్రపంచం మన అరచేతిలోకి వచ్చేసింది. ఉదయం కళ్లు తెరిచినప్పటి నుంచీ మన మొబైల్ ఫోన్‌లోనో, లాప్‌టాప్ లేదా కంప్యూటర్‌తోనే జీవితాన్ని వెళ్ల దీసేస్తున్నాం. అమెరికాలో ఉన్నా, ఆఫ్రికాలో ఉన్నా సందేశాలిచ్చేస్తున్నాం, మాట్లాడేస్తున్నాం. ఆఖరుకు మన ఆర్థిక లావాదేవీలను కూడా వీటిద్వారానే జరుపుతున్నాం. ఎంతో సుఖవంతంగా, సులువుగా అనిపిస్తోంది కదూ? మనం నిజంగా అలా అనుకుంటే తప్పులో కాలు వేసినట్టే. ఎందుకంటే, కూటి కోసం కోటి విద్యలు అన్నట్టుగా ఆన్‌లైన్‌లో కూడా మోసం చేసే సైబర్ మోసగాళ్లు తయారయ్యారు. మొన్నటి వరకూ మీకు లాటరీ వచ్చిందంటూ మెయిళ్ల ద్వారా మోసంచేస్తే, సైబర్ అరెస్టులు అంటూ కొత్త మోసాలు మొదలెట్టారు. అంతేకాదు, మనం క్రెడిట్, డెబిట్ కార్డుల, ఆధార్ వంటి కీలక సమాచారాన్ని సేకరించి కూడా మోసాలు చేస్తున్నారు. వీటన్నింటికీ విరుగుడు ఏమిటంటే సైబర్ సెక్యూరిటీ. మనం వాడే నెట్‌వర్క్‌లను, డిజిటల్ డేటాను ఈసైబర్ దాడుల నుంచి కాపాడేదే సైబర్ సెక్యూరిటీ.

భారతదేశపు తొలిసారి సైబర్ సెక్యూరిటీ కోసం టీఏసీ సెక్యూరిటీని త్రిష్నీత్ అరోరా స్థాపించారు. ఇది సైబర్ రక్షణ రంగ స్వరూపాన్ని పునర్నిర్మిస్తున్న ఒక శక్తి. డిజిటల్ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా మార్చాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ సంస్థ అత్యంత వేగంగా అద్భుత వృద్ధిని సాధించింది. ఈ సంస్థ, వల్నరబిలిటీ మేనేజ్‌మెంట్, సైబర్ రిస్క్ క్వాంటిఫికేషన్, పెనెట్రేషన్ టెస్టింగ్ వంటి రంగాలలో వ్యాపారాలకు అత్యాధునిక పరిష్కారాలను అందించడానికి కృత్రిమ మేధని ఉపయోగించుకుంటుంది. దాదాపు 19 ఏళ్ల వయసులో, 2013లో చండీగఢ్ నుండి టీఏసీ సెక్యూరిటీని ప్రారంభించడంతో ఆయన వ్యాపార ప్రస్థానం మొదలైంది.

త్రిష్నీత్ అరోరా నవంబర్ 2, 1993న పంజాబ్‌లోని లూథియానాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనకు టెక్నాలజీపై ఉన్న ఆసక్తి, చివరికి ఆయన్ను సైబర్ సెక్యూరిటీ ప్రపంచంలోకి నడిపించింది. తన ప్రయోగాల ద్వారానే కంప్యూటర్ హార్డ్‌వేర్ గురించి అంతా నేర్చుకున్నాడు. కంప్యూటర్‌పై ఉన్న విపరీతమైన మోజు కారణంగా అతను ఎనిమిదో తరగతి పరీక్షలో ఫెయిల్ అయి, ఓపెన్ లెర్నింగ్ ద్వారా పదో తరగతి పూర్తి చేశాడు. బ్లాగింగ్ చేస్తున్నప్పుడు అతనికి ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీపై ఆసక్తి కలిగింది.




దీనితో అతడు కంప్యూటర్లను బాగుచేయడం నుండి సాఫ్ట్‌వేర్‌ను శుభ్రపరచడం వరకు చిన్న చిన్న ప్రాజెక్టులను చేపట్టడం ప్రారంభించాడు, చివరికి తన మొదటి గణనీయమైన చెల్లింపుగా 60,000 రూపాయలను అందుకున్నాడు, దానిని అతడు అభివృద్ధి చెందుతున్న తన కంపెనీలో పెట్టుబడిగా పెట్టాడు. తర్వాత తాను నేర్చుకున్న విషయాలను పంచుకోవడానికి ఒక పుస్తకం రాయాలని నిర్ణయించుకున్నాడు. కొన్ని ఆటంకాల కారణంగా, అతని మొదటి పుస్తకం పెద్దగా విజయం సాధించలేదు, దీనితో అతను మళ్లీ ప్రారంభించాడు. అతడి రెండవ పుస్తకం, 'ది హ్యాకింగ్ ఎరా', ఫిబ్రవరి 2013లో ప్రచురితమైంది. దాదాపు అదే సమయంలో అతను తన సొంత సంస్థ అయిన టీఏసీ సెక్యూరిటీ సొల్యూషన్స్‌ను ప్రారంభించాలని కూడా నిర్ణయించుకున్నాడు.

గుజరాత్‌లో 2013లో జరిగిన ఒక వ్యాపార సంబంధాల సదస్సులో అతడు నాటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హాతో కలిసి కీలక ప్రసంగం చేశారు. అతడి ప్రసంగం విన్న తర్వాత, కొంతమంది సీనియర్ పోలీసు అధికారులు తమ క్రైమ్ బ్రాంచ్ కోసం ఒక వర్క్‌షాప్ నిర్వహించమని అతడిని ఆహ్వానించారు. ఇక్కడే అతడు పోలీసుల కోసం సైబర్ క్రైమ్ కేసులపై పనిచేయడం ప్రారంభించారు. ఆ తర్వాత కొద్దికాలానికే, సైబర్ క్రైమ్ దర్యాప్తు, ఫోరెన్సిక్స్‌పై తమతో కలిసి ఒక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించమని పంజాబ్ పోలీసులు అతడిని సంప్రదించారు. అప్పటి నుంచి, త్రిష్నీత్ అనేక మంది ఐపీఎస్ అధికారులకు, క్రైమ్ బ్రాంచ్ సెల్ అధికారులకు, బ్యాంకు ఉద్యోగులకు, సీబీఐ అధికారులకు శిక్షణ ఇస్తూ వస్తున్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకాష్ సింగ్ బాదల్ చేతుల మీదుగా ఆయన 2014లో రాష్ట్ర పురస్కారం అందుకున్నారు. ఆ తర్వాత ఆయన పంజాబ్ పోలీసులకు ఐటీ సలహాదారుగా నియమితులయ్యారు.



టీఏసీ సెక్యూరిటీ లక్ష్యం, 'సైబర్‌స్పేస్‌ను సురక్షితం చేయడం, భవిష్యత్తును సురక్షితం చేయడం,' అన్నది సైబర్ నేరాలను ఎదుర్కోవడంలో వారి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఒక బలమైన సహాయక వ్యవస్థను నిర్మిస్తూ, అరోరా న్యూయార్క్, సింగపూర్‌కు చెందిన పరిశ్రమ నిపుణులతో సహా అనుభవజ్ఞులైన సైబర్‌సెక్యూరిటీ నిపుణులను సంస్థలోకి తీసుకువచ్చారు. ప్రఖ్యాత పెట్టుబడిదారు విజయ్ కేడియా నుండి ఆయన ప్రారంభ నిధులను అందుకున్నారు. ఈ మద్దతు టీఏసీ సెక్యూరిటీ వేగంగా అభివృద్ధి చెందడానికి దోహదపడింది, లుధియానా నుండి చండీగఢ్‌కు, ఆపై ముంబైకి, చివరికి యునైటెడ్ స్టేట్స్‌కు విస్తరించింది.

అతని బహుళజాతి సంస్థ, టీఏసీ సెక్యూరిటీ సొల్యూషన్స్, కార్పొరేషన్లకు నెట్‌వర్క్ లోపాలు, డేటా దొంగతనం నుండి రక్షణను, సైబర్ సెక్యూరిటీ శిక్షణను అందిస్తోంది. టిఏసీ క్లయింట్లలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), పంజాబ్ పోలీస్, గుజరాత్ పోలీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, అమూల్, రాల్సన్ (ఇండియా) లిమిటెడ్, అవాన్ సైకిల్స్ లిమిటెడ్, దుబాయ్, యుకెకు చెందిన బహుళజాతి సంస్థలు (ఎంఎన్‌సీలు) ఉన్నాయి.

ఈ అద్భుతమైన పనితీరు అందరి దృష్టిని ఆకర్షించింది. వ్యవస్థాపకుడు, సీఈఓ అయిన త్రిష్నీత్ అరోరా, 1,100 కోట్ల రూపాయల నికర సంపదతో, హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024లో ఆరవ అతి పిన్న వయస్కుడిగా, 1,463వ అత్యంత ధనవంతుడిగా స్థానం పొందారు. ఆయనకు లభించిన ఈ గుర్తింపు, ప్రపంచ వేదికపై భారతదేశ సాంకేతిక, సైబర్‌సెక్యూరిటీ రంగాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది. ★

# బాల జాగృతి



## నక్క గర్వం | కథ

**ఒ**క అడవిలో ఒక నక్క ఉండేది. అది తన తెలివి గురించి చాలా గొప్పగా చెప్పుకునేది. అడవిలోని ఇతర జంతువులను చూసి, "నా అంత తెలివైన జంతువు ఈ అడవిలో ఇంకేదీ లేదు" అని ఎప్పుడూ అనేది.

ఒకరోజు నక్క అడవిలో తిరుగుతూ ఒక చెరువు దగ్గరకు వెళ్లింది. అక్కడ ఒక కొంగ నీటిలో చేపలను పట్టుకుంటోంది.

నక్క కొంగను చూసి, "ఇంతసేపు నీళ్లలో నిలబడి చేపల కోసం వెతుకుతున్నావా? నాకు చెప్తే ఇంత కష్టం లేకుండా ఒక్కసారిగా చాలా చేపలు పట్టేస్తాను కదా?" అని అంది.

కొంగ ఏమీ మాట్లాడకుండా నవ్వింది.

అంతలో నక్కకు చెరువు అవతల కొన్ని పండ్లు కనిపించాయి. వాటిని తినాలనుకుని చెరువును దాటడానికి ప్రయత్నించింది. కానీ నీరు లోతుగా ఉండటంతో భయపడి వెనక్కి వచ్చింది.

అప్పుడు కొంగ, "నువ్వు చెరువు దాటలేకపోతున్నావు కదా. నా సహాయం కావాలా?" అని అడిగింది.

నక్క కొంచెం సిగ్గుపడి, "అవును. నాకు సహాయం చెయ్యి" అని చెప్పింది.

కొంగ తన పొడవైన కాళ్లతో నీటిలోకి వెళ్లి, నక్కకు సురక్షితంగా అవతలి వైపుకు వెళ్లే దారి చూపించింది.

అవతలి ఒడ్డుకు చేరుకున్న తర్వాత నక్క "నేను తెలివైనవాడినని అనుకుని ఇతరులను తక్కువగా చూశాను. కానీ ప్రతి ఒక్కరికీ తనకంటూ ఒక ప్రత్యేకమైన సామర్థ్యం ఉంటుందని ఇప్పుడు అర్థమైంది" అని చెప్పింది.

కొంగ నవ్వుతూ, "మనకు తెలియని విషయాలు ఇతరులకు తెలిసి ఉండవచ్చు. అందుకే ఎవరినీ తక్కువగా చూడకూడదు" అంది.

ఆ రోజు నుంచి నక్క తన తెలివి గురించి గొప్పలు చెప్పుకోవడం మానేసింది. ★

## మంచిమాట

చిన్న లక్ష్యాలను సాధిస్తూ
ముందుకు వెళ్తే పెద్ద లక్ష్యాలు
కూడా చేరువవుతాయి



## మెదడుకు మేత



తోక ఉంది.. కానీ
జంతువు కాదు.
ఏమిటది?

జవాబు : గాలిపటం

## పద్యం



చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలిలోని ముల్లు
ఇంటిలోని పోరు ఇంతింత కాదయా
విశ్వదాభిరామ వినుర వేమ!

**భావం :** చెప్పులో రాయి, చెవిలో జోరీగ, కంటిలో నలుసు, కాలిలో ముల్లు ,ఇంట్లో జరిగే గొడవల చెప్పలేనంత బాధ కలిగిస్తాయి.

## శ్లోకం



దర్శనే స్పర్శనే వాపి
భాషణే భావనే తథా
యత్ర ద్రవత్యంతరంగం
స స్నేహః ఇతి కథ్యతే

**భావం :** ఎవరినైనా చూసినప్పుడు, తాకినప్పుడు, మాట్లాడినప్పుడు, తలచుకున్నప్పుడు మనసుకు ఆహ్లాదం, ఆనందం, ఆత్మీయత, ఆర్ద్రత కలిగిస్తుందో అదే స్నేహం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఏనుగు | పొడవైన మెడ |
| జిరాఫీ | పెద్ద చెవులు |
| నెమలి | గట్టి పెంకు |
| తాబేలు | రంగురంగుల తోక |

జవాబులు : ఏనుగు–పెద్ద చెవులు; జిరాఫీ–పొడవైన మెడ; నెమలి–రంగురంగుల తోక; తాబేలు–గట్టి పెంకు.

## శాస్త్రవేత్తలు

### డా. ఎల్.ఎ. రామ్‌దాస్



దేశంలో వ్యవసాయ వాతావరణ శాస్త్రాన్ని అభివృద్ధి చేసిన ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త డా. ఎల్.ఎ. రామ్‌దాస్ **1900**లో కేరళలో జన్మించారు. పంటలపై వాతావరణ ప్రభావాన్ని అర్థం చేసుకోవడంలో ఆయన చేసిన పరిశోధనలు భారతీయ వ్యవసాయానికి ఎంతో ఉపయోగ పడ్డాయి. భూమికి దగ్గరగా రాత్రి ఉష్ణోగ్రతలపై పరిశోధనలు చేసి, తరువాత "రామ్‌దాస్ లేయర్"గా పిలిచే వాతావరణ పరిస్థితిని గుర్తించారు. వ్యవసాయ వాతావరణ శాస్త్రానికి చేసిన విశేష కృషికి గుర్తింపుగా **1958**లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలో అతి చిన్న దేశం ఏది?
2. దేశంలో అత్యధిక జనాభా కలిగిన నగరం ఏది?
3. 'ల్యాండ్ ఆఫ్ రైజింగ్ సన్' అని ఏ దేశాన్ని పిలుస్తారు?

సమాధానాలు : 1. వాటికన్ సిటీ, 2. ఢిల్లీ, 3. జపాన్

## భక్తాగ్రేసరులు

### కలంగినాథర్



రసవాదంలో ప్రసిద్ధ గురువు కలంగినాథర్ వారణాసిలో జన్మించి, దక్షిణపథంలోని తమిళనాడులోని కంజమలై పర్వతంపై నివసించారు. ఆయనను కంజమలై సిద్ధర్ అని కూడా అంటారు.నాడు దేశంలోని తొమ్మిది మంది సిద్ధులలో అగ్రగణ్యుడు. ప్రపంచగమనం, దివ్యశక్తి, జీవిత తత్త్వం, విశ్వ రహస్యాలను పరిశోధించి ఆకళింపు చేసుకొన్న విశిష్ట వ్యక్తి. శరీరధర్మం, జీవితం, ఆత్మ, విశ్వం, ప్రకృతులను అర్థం చేసుకోవడం ద్వారా దైవత్వాన్ని పొందాలన్న సిద్ధుల ప్రధాన లక్ష్యాన్ని ఆయన కచ్చితంగా పాటించారు. తన ఆవిష్కరణలు దేశ, ప్రాంతాలకు అతీతంగా సర్వమానవాళికి ఉపకరించాలన్నది ఆయన ధ్యేయం. పోతిగై కొండలలో అడవి జంతువులను మంత్రాలతో నియంత్రించేవారట. గిరిజనులకు వాసియోగం లాంటివి నేర్పారు.వారి కోసం ధ్యానం చేసేవారు. తన లక్ష్యసాధనకు ప్రియశిష్యుడు భోగర్‌ను చైనాకు తీసుకువెళ్లారు. ఆయనకు సిద్ధశాస్త్రాలకు సంబంధించిన అంశాలన్నిటిని బోధించారు. కాంచీపురం వద్ద మోక్షం పొందారు.



# వారఫలాలు

12-18 అక్టోబర్, 2026



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఊహించని ఆహ్వానాలు అందుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. తెలివిగా వ్యవహరించి శత్రువులను కూడా ఆకట్టుకుంటారు. వ్యాపారులు కొత్త పెట్టుబడులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు ఒత్తిడుల నుంచి విముక్తి లభిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు ఒడిదుడుకులు తొలగుతాయి. 14,15తేదీల్లో శారీరక రుగ్మతలు. కుటుంబంలో చికాకులు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. పాతబాకీలు సైతం వసూలవుతాయి. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఇంటి నిర్మాణయత్నాలలో కదలికలు ఉంటాయి. విద్యార్థుల యత్నాలు సఫలమవుతాయి. వ్యాపారులు అనుకున్న లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులకు హోదాలు దక్కే అవకాశం. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, క్రీడాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 17,18 తేదీల్లో దుబారా ఖర్చులు. శారీరక రుగ్మతలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

స్వల్ప శారీరక రుగ్మతలు ఎదురైనా ఉపశమనం పొందుతారు. ఆలయాలు సందర్శిస్తారు. వాహనాలు, ఇళ్లు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు భాగస్వాములతో సర్దుబాట్లు చేసుకుంటారు. ఉద్యోగస్తులకు ఊరటనిచ్చే సమాచారం అందుతుంది. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. 12,13 తేదీల్లో ఆస్తి వివాదాలు. బంధువులతో తగాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

నూతన విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. సమాజసేవలో పాల్గొంటారు. కుటుంబంలో వేడుకలకు తగిన ఏర్పాట్లుచేస్తారు. వ్యాపారులు తగినంత లాభాలు అందుకుంటారు. ఉద్యోగులు ఉన్నత పోస్టులు దక్కించుకుంటారు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు కొత్తఆశలు చిగురిస్తాయి. 15,16 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. మానసిక ఆందోళన. శారీరక రుగ్మతలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

రాబడి ఆశాజనకం. మీ నిర్ణయాలు బంధువులను ఆకట్టుకుంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులు కోరుకున్న ఉద్యోగాలు సాధిస్తారు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలు ఆహ్వానాలు అందుకుంటారు. 14,15 తేదీలలో వృథా ఖర్చులు.ఆకస్మిక ప్రయాణాలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ప్రయాణాలలో మార్పులు చేసుకుంటారు. దూరపు బంధువుల రాక కొంత సంతోషం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు కొద్దిపాటి లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు మీదపడవచ్చు. కళాకారులు, రచయితలకు ఆహ్వానాలు అందుతాయి. 16,17 తేదీల్లో శుభవార్తలు. వాహన యోగం. లక్ష్మీగణపతి స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

విద్యార్థులకు ఊహించని ఫలితాలు ఆశ్చర్యపరుస్తాయి. జీవిత భాగస్వామి సలహాలతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారులకు అత్యధిక లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు సమస్యలు కొన్ని తీరతాయి. 12,13 తేదీల్లో దూరప్రయాణాలు. రుణాలు చేస్తారు. గణేశాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆలోచనలు అమలు చేస్తారు. ఆస్తుల వ్యవహారాలలో నెలకొన్న ఇబ్బందులు తొలగుతాయి. నూతన విద్యావకాశాలు దక్కుతాయి. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు హోదాలు దక్కే ఛాన్స్. పారిశ్రామికవేత్తలు, రచయితలకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. 15,16 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. అప్పులు చేస్తారు. దేవీ స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

పొరపాట్లు సరిదిద్దుకుని కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. ఆదాయం గతం కంటే మెరుగు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు విధుల్లో తగిన గుర్తింపు లభిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులకు ఉత్సాహవంతమైన కాలం. 17,18 తేదీల్లో ధనవ్యయం. కుటుంబ సభ్యులతో విభేదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

భూ వివాదాలు పరిష్కరించుకుంటారు. ఇళ్లు, వాహనాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ముఖ్య విషయాలు చర్చిస్తారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణ ప్రశాంతంగా సాగిపోతుంది. రాజకీయవేత్తలు, క్రీడాకారులకు ఆదరణ పెరుగుతుంది. 14,15 తేదీల్లో దుబారా ఖర్చులు. శారీరక రుగ్మతలు. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వచ్చి లబ్ది పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు మరింత లాభదాయకంగా ఉంటుంది. ఉద్యోగస్తులకు ఒక ముఖ్య సమాచారం అందుతుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు క్లిష్ట సమస్యలు తీరతాయి. 13,14 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. శ్రీరామరక్షాస్తోత్రం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పనుల్లో అవాంతరాలు తొలగుతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. భూవివాదాలు కొంత పరిష్కారమవుతాయి.వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగాలలో అనుకున్న హోదాలు లభిస్తాయి. రాజకీయవేత్తలు, క్రీడాకారులకు లక్ష్యాలు నెరవేరతాయి. 15,16 తేదీల్లో వృథాఖర్చులు. శారీరక రుగ్మతలు.ప్రయాణాలు వాయిదా. లక్ష్మీ నృసింహ స్తోత్రాలు పఠించండి.

# పదరసం-585

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | | 4 | | ■ | 5 |
| | ■ | | ■ | | ■ | | ■ | 6 | |
| 7 | | ■ | 8 | | | | ■ | 9 | |
| | ■ | 10 | ■ | | ■ | | ■ | | |
| 11 | 12 | | ■ | | ■ | 13 | 14 | ■ | ■ |
| ■ | | ■ | 15 | | 16 | ■ | 17 | | 18 |
| 19 | ■ | 20 | | ■ | | ■ | | ■ | |
| 21 | | | | ■ | 22 | 23 | | ■ | ■ |
| | ■ | 24 | | 25 | ■ | | ■ | 26 | |
| 27 | | ■ | 28 | | | ■ | 29 | | ■ |

## ఆధారాలు

### అడ్డం

1. దేవమాత (3)
3. ఆశ్వయుజంలో పూవుల పండుగ (4)
6. సరస్వతి పూజ చేసుకునే నక్షత్రం (2)
7. ఈ బాణానికి తిరుగులేదట (2)
8. ఎండమావి (4)
9. వానరం (2)
11. వృక్షం (3)
13. పార్వతీదేవే..అటు నుంచి (2)
15. శుకం (3)
17. బంగారం (3)
20. కర్ర, కలప (2)
21. పుష్పహారాలే (4)
22. గౌరీపతి వాహనం.. బహువచనం (3)
24. క్షుద్బాధ..అటు నుంచి (3)
26. దసరా నాడు  పూజించే చెట్టు (2)
27. చంద్రగుప్తుడి తల్లి (2)
28. దమయంతి పతి తడబడ్డాడు (3)
29. బిలం, రంధ్రం (2)

### నిలువు

1. దసరానాడు ఈ దేవిని అర్చిస్తారు (5)
2. పంచాంగంలో ఒక అంశం (2)
3. రేగుచెట్ల తోటలు (6)
4. ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మ (5)
5. విజయదశమి నాడు ఈ పక్షిని చూడాలట (4)
6. దండు, గుంపు (2)
10. వాయసం కూత (2)
12. ముని (2)
14. కుమార్తెలు (4)
15. బాల మూషికాలు (5)
16. కవిత్వం (3)
18. పాపం కాదు...తలకిందులుగా (2)
19. ఆశ్చర్యం, వింత (4)
20. సముద్రం (3)
23. అత్త మీది కోపం దీని మీదా..? (2)
25. ఆజ్ఞ, ప్రతిజ్ఞ (2)
26. యజ్ఞానికి వికృతి (2)

## పదరసం - 584 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 స | 2 రా | స | రి | ■ | 4 ను | 5 గ్గు | ■ | 6 ఉ | ప్పు |
| ■ | 7 వి | రి | ■ | 8 గ | ■ | 9 సె | 10 మ | లి | ■ |
| 11 త | ■ | గ | ■ | 12 ర | క్తం | ■ | ధు | ■ | 13 నా |
| గ | ■ | 14 మ | 15 రా | ళం | ■ | 16 ఆ | వు | 17 పా | లు |
| 18 వ | 19 ని | ■ | యి | ■ | 20 క | ల | ■ | 21 శం | క |
| 22 రి | క్క | లు | ■ | 23 క | డ | మం | లం | ■ | లు |
| ■ | ము | ■ | 24 గో | డ | ■ | ద | ■ | 25 ఇ | ■ |
| 26 ప | ■ | 27 గో | దా | వ | 28 రి | ■ | 29 కో | 26 ల | ■ |
| 30 తా | ళి | ■ | దే | ■ | 31 వా | ల్మీ | కి | ■ | 32 ఈ |
| 31 కం | ■ | 33 క | వి | రా | జు | ■ | 34 ల | వు | డు |

# సినిమా చరిత్రలో చెరగని సంతకం సింగీతం!

**'ఇది సాధ్యమేనా?' అని ఎవరైనా ప్రశ్నవేస్తే... 'ఎందుకు సాధ్యం కాదు!?' అని ఎదురు ప్రశించే ధీశాలి సింగీతం శ్రీనివాసరావు. భారతీయ చలన చిత్రసీమలో 94వ యేట సినిమాకు దర్శకత్వం వహించి రికార్డ్ సృష్టించిన వ్యక్తి. నలభై యేళ్ల నాటి తన కలను ఇటీవలే సాకారం చేసుకుని ప్రశాంతంగా తనువు చాలించారు. సినిమా చరిత్రలో చెరగని సంతకం ఆయన.**

సింగీతం శ్రీనివాసరావు సెప్టెంబర్ 21, 1931న జన్మించారు. గూడూరు, నెల్లూరు, మద్రాసులలో విద్యాభ్యాసం చేసి, సైన్సు డిగ్రీ సంపాదించారు. అధ్యాపక వృత్తితో జీవితం ఆరంభించిన ఆయన భారతి, స్వతంత్ర పత్రికల్లో పలు కథలు, స్కెచ్ లు రాశారు. 'భ్రమ, అంత్యఘట్టం, చిత్రార్జున' వంటి నాటక రచనలు చేసి రచయితగా పేరు సంపాదించారు. ముఖ్యంగా 'చిత్రార్జున'లో ప్రధానపాత్రను శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి ధరించడం విశేషం. ఈ కాలంలోనే సింగీతం ప్రముఖ కవి, నాటక ప్రదర్శకులు అయిన హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ దగ్గర దర్శకత్వంలో శిక్షణ పొందారు.

సినిమా రంగం మీద మక్కువతో 1954లో చెన్నయ్ చేరిన సింగీతం ప్రఖ్యాత దర్శకులు కె.వి.రెడ్డి దగ్గర 'దొంగరాముడు, మాయాబజార్, జగదేకవీరుని కథ, శ్రీకృష్ణార్జున యుద్ధం' తదితర చిత్రాలకు సహాయకుడిగా పనిచేశారు. ఎంజీఆర్, భానుమతి, పద్మిని నటించిన 'రాజాదేసింగ్' సినిమాను తెలుగులో డబ్ చేసినప్పుడు దానికి మాటలు, పాటలు శ్రీశ్రీ రాయగా, తెలుగు అనువాదం పనులు పర్యవేక్షించిన సింగీతం పేరును టైటిల్ కార్డులలో 'డైలాగ్ డైరెక్షన్' అని వేశారు. తెలుగులో ఈ సినిమాను 'దేసింగ్ రాజు కథ'గా రిలీజ్ చేశారు. అలానే కన్నడలో పట్టాభిరామిరెడ్డి రూపొందించిన 'సంస్కార' సినిమాకు సింగీతం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పనిచేశారు. గిరీశ్ కర్నాడ్, స్నేహలతారెడ్డి ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. సింగీతం తొలిసారిగా 1972లో 'నీతి నిజాయితీ' చిత్రంతో దర్శకుడయ్యారు. ముంబైకి చెందిన సతీశ్ అరోరా హీరో కాగా, కాంచన హీరోయిన్. తొలి చిత్రంలోనే ఓ సాహసం చేశారు. అందులో హీరో మూగవాడు. దాంతో సినిమా ఆడలేదు. అయినా ప్రయోగాలు చేయడానికి ఆయన ఎప్పుడూ వెనకాడలేదు. చిత్రం ఏమంటే... ఆయన కెరీర్ మొత్తం ప్రయోగాలతోనే సాగింది. మరీ ముఖ్యంగా ఆయన తన 94వ యేట దర్శకత్వం వహించిన 'సింగ్ గీతం'లో మాటలను కూడా పాటల రూపంలో పాత్రధారులతో పలికించిన దర్శకుడాయన.

తొలి చిత్రం 'నీతి -నిజాయితీ' ఆశించిన స్థాయిలో ఆడకపోయినా ఆయన ప్రతిభను, అప్పటికే ఉన్న అనుభవాన్ని చిత్రసీమ గుర్తించింది. ప్రముఖ రచయిత రాజాజీ కథతో, తమిళనాడు స్టేట్ ఫిలిమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో సింగీతం తెరకెక్కించిన 'దిక్కెట్ట పార్వతి' సినిమా మేకర్‌గా ఆయనకు పేరు తెచ్చిపెట్టింది. ఈ సినిమా ఉత్తమ ప్రాంతీయ తమిళ చిత్రంగా ఎంపికైంది. లక్ష్మీ, శ్రీకాంత్ వై.జి. మహేంద్ర కీలక పాత్రలు పోషించిన



ఈ సినిమాకు వీణ చిట్టిబాబు సంగీతం సమకూర్చడం విశేషం. ఆ తర్వాత సింగీతం తెలుగులో తీసిన 'జమిందారుగారమ్మాయి' మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. 'ఒక దీపం వెలిగింది' మంచి విజయాన్ని అందుకోగా మాదిరెడ్డి సులోచన నవల ఆధారంగా తెరకెక్కిన 'తరం మారింది' అవార్డులు తెచ్చిపెట్టింది. 'పంతులమ్మ' (1978)తో మరోసారి సక్సెస్ ఫుల్ దర్శకుడు అనిపించుకున్నారు.

ఇక కమల్ హాసన్ హీరోగా సింగీతం తెరకెక్కించిన 'సొమ్మొకడిది సోకడిది' తో వారి మధ్య అనుబంధం బలపడింది. ఈ సినిమా కూడా కమర్షియల్‌గా మంచి సక్సెస్ అయ్యింది. దాంతో కమల్ హాసన్, రాజ్ కమల్ ఇంటర్నేషనల్ సంస్థను స్థాపించి, తాను, మాధవి జంటగా, ఎల్.వి. ప్రసాద్ కీలక పాత్రలో 'అమావాస్య చంద్రుడు' సినిమాను తెలుగు, తమిళ భాషల్లో తీశారు. ఆయన దర్శకత్వంలోనే మాటలు లేని 'పుష్పక్' సినిమా చేశారు.

ఎన్టీఆర్ నటించిన పలు చిత్రాలకు దర్శకత్వ శాఖలో పనిచేసిన సింగీతం ఆయన కుమారుడు బాలకృష్ణ కథానాయకుడిగా టైమ్ మిషన్ నేపథ్యంలో 'ఆదిత్య 369', జానపద చిత్రం 'భైరవ ద్వీపం', పౌరాణిక చిత్రం 'శ్రీకృష్ణార్జున విజయం'ను తెరకెక్కించారు. అలానే అక్కినేని నాగేశ్వరరావు ను డైరెక్ట్ చేసిన సింగీతం ఆయన తనయుడు నాగార్జునతో 'ఆకాశవీధిలో' సినిమాను డైరెక్ట్ చేశారు. కృష్ణంరాజుతో సినిమాలు తీసిన సింగీతం... ఆయన తమ్ముడి కొడుకు ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఎ.డి.'కి సాంకేతిక సహకారం అందించారు. కామెడీ కింగ్‌గా పేరు తెచ్చుకున్న రాజేంద్ర ప్రసాద్‌తో 'మేడమ్' తెరకెక్కించారు. ఈ సినిమాలన్నీ ఒక ఎత్తు కాగా 'మయూరి' సినిమా మరో ఎత్తు. నృత్యకారిణి సుధాచంద్రన్ యాక్సిడెంట్‌లో కాలు కోల్పోయి, కృత్రిమ పాదంతో తిరిగి నాట్యం చేయడం గురించి తెలిసిన రామోజీరావు ఆమె జీవిత కథను 'మయూరి' సినిమాగా నిర్మించారు. ఆమెనే కథానాయికగా ఎంపిక చేసుకుని ఈ సినిమాను అద్భుతంగా సింగీతం వెండితెరపై ఆవిష్కరించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీతో పాటు సింగీతం ఆంగ్ల చిత్రాన్నీ తీశారు. యానిమేషన్ చిత్రాన్ని సైతం రూపొందించిన ప్రతిభాశాలి సింగీతం శ్రీనివాసరావు. కొన్ని కన్నడ చిత్రాలకు సంగీతాన్ని అందించడంతో పాటు పాటలు రాశారు. రచనా వ్యాసాంగం అంటే ఆయనకు ఎంతో ఇష్టం. హాసం పక్షపత్రికలో సింగీతం 'క రాజు కథలు' పేరుతో ఓ శీర్షికను నిర్వహించారు. భార్య లక్ష్మీ కళ్యాణితో 'శ్రీ కళ్యాణం' పేరుతో ఆత్మకథ రాయించారు. ఓ రకంగా చెప్పాలంటే అది అది సింగీతం జీవితం అనుకోవచ్చు.

సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన పలు చిత్రాలు అనేకానేక అవార్డులను అందుకున్నాయి. ఎన్నో పురస్కారాలను పొందారు. అయితే పద్మశ్రీ వంటి జాతీయ పురస్కారాలు ఆయన్ని వరించకపోయినా, ఆయన ఎప్పుడూ అసంతృప్తిని వ్యక్తం చేయలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012వ సంత్సరానికి ఆయనకు బి.ఎన్. రెడ్డి పురస్కారాన్ని ప్రకటించింది. రాష్ట్రం విడిపోవడంతో ఆ అవార్డు ప్రధానం జరగలేదు. ఈ యేడాది డిసెంబర్‌లో అవార్డులను అందిస్తామని ఏపీ ప్రభుత్వం తెలిపింది. కానీ దానిని అందుకోకుండానే సింగీతం తనువు చాలించారు.

**– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-



వెల : ₹.100/-



వెల : ₹.270/-



వెల : ₹.150/-



వెల : ₹.150/-



వెల : ₹.180



వెల : ₹.190



వెల : ₹.250/-



వెల : ₹.60/-



వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.200/-



వెల : ₹.900/-



వెల : ₹.350/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 52





మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి మెచ్చండి పంచండి


Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01